గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




అమెరికా దిగ్బంధం నడుమ అద్భుత దేశం క్యూబా 04


సంపుటి 08, సంచిక: 138 | శుక్రవారం | 18-04-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00




క్షీరసాగర్   రావుల   పశ్యపద్మ

## ఎఐకెఎస్ జాతీయ కమిటీ ఎన్నిక 03

- అధ్యక్షులుగా క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శిగా రావుల వెంకయ్య, జాతీయ కార్యదర్శిగా పశ్యపద్మ



05

## బెంగాల్ టీచర్లకు స్వల్ప ఊరట

- నూతన నియామకాలు చేపట్టేవరకూ ఉద్యోగాల్లో కొనసాగడానికి 'సుప్రీం' గ్రీన్ సిగ్నల్
- మే 31 నాటికి కొత్త నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి ఆదేశం

## 'నరేగా' కార్మికుల అణచివేత

- మోదీ ప్రభుత్వం పేదల వ్యతిరేకి : ఖర్గే

05

# రూ.1000 కోట్ల పెట్టుబడులు

- తెలంగాణలో పెట్టేందుకు ముందుకొచ్చిన జపాన్ వ్యాపార దిగ్గజం మారుబెనీ
- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంసిద్ధత
- 600 ఎకరాల్లో ప్రపంచస్థాయి, నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి ప్రతిపాదనలు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల ఉద్యోగాలు
- టోక్యోలో మారుబెనీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం భేటీ



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బృందం జపాన్ పర్యటనలో తొలి రోజునే కీలకమైన పెట్టుబడుల ఒప్పందం కుదుర్చుకుంది. జపాన్‌కు చెందిన వ్యాపార దిగ్గజం మారుబెనీ కంపెనీ తెలంగాణలో దాదాపు రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు మారుబేనీ కంపెనీ సంసిద్ధత తెలిపింది. టోక్యోలో ఆ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. దాదాపు రూ.1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో మారుబెనీ కంపెనీ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. దశల వారీగా ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో ప్రపంచ స్థాయి, నెక్ట్స్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకుంది. అందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ తరువాయి 2లో

## వక్ఫ్ చట్టంపై సమాధానానికి వారం గడువు

- కేంద్ర ప్రభుత్వం అభ్యర్థనకు సుప్రీంకోర్టు అంగీకారం
- వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని కేంద్రం హామీ
- తదుపరి విచారణ మే 5కు వాయిదా




**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) చట్టం2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను గురువారం సుప్రీంకోర్టు విచారించింది. దీనిపై మొత్తం 72 పిటిషన్లు దాఖలయ్యాయి. వక్ఫ్ చట్టంపై సమాధానం ఇచ్చేందుకు కేంద్రం 7 రోజుల గడువు ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరగా, ఆ అభ్యర్థనను అంగీకరించింది. తదుపరి విచారణ తేదీ మే 5 వరకూ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, బోర్డులలో ముస్లిమేతరులను ఎవరినీ నియమించబోమని, వక్ఫ్ ఆస్తులను కూడా డీనోటిఫై చేయమని కేంద్రం సుప్రీంకోర్టు సూచనలపై తన హామీఇచ్చింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ వక్ఫ్ (సవరణ) చట్టం2025 పార్లమెంట్ చర్చల ద్వారానే ఆమోదించబడిందని, ప్రభుత్వం వివరణ వినకుండా దానిని నిలిపివేయకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా, తరువాయి 2లో

## ఆర్థిక సాయం అందించండి

- జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీకి తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం విజ్ఞప్తి
- మెట్రో రైల్ రెండోదశ, మూసీ పునరుజ్జీవనం, ట్రిపుల్ ఆర్, ఒఆర్ఆర్ రేడియల్ రోడ్లకు రుణాలు ఇవ్వాలని వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానించే రేడియల్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని జైకాను కోరింది. జపాన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్ తరువాయి 2లో

## 450 ఎకరాల్లో ఐటి నాలెడ్జ్ హబ్

- హైదరాబాద్‌లోని పుప్పాలగూడ పరిసరాల్లో ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రుల ఆదేశం
- ఐదులక్షల మంది యువతకు ఉపాధికి అవకాశం
- పుప్పాలగూడ భూములు, తాజా పరిస్థితిపై ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్

పుప్పాలగూడ పరిసరాల్లో సుమారు 450 ఎకరాల్లో మొదటి దశలో ఐటి నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అభిప్రాయపడ్డారు. పుప్పాలగూడ, తదితర అంశాలపై హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల, రెవెన్యూ శాఖ అధికారులతో గురువారం తరువాయి 2లో

## ప్రాణం తీసిన ఈత సరదా

దమ్మాయిగూడెం వద్ద మున్నేరులో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్



ఈత సరదా ప్రాణాలు తీసింది. ఇంట్లో క్రికెట్ ఆటకని చెప్పి ఇద్దరు బాలురు ఈతకు వెళ్లి అనంతలోకాలకు వెళ్లిన ఘటన ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలోని డాబాలబజార్‌కు చెందిన అన్నం సుబ్బారావు కుమారుడు అన్నం కిరణ్‌తేజ (14), గుట్టలబజార్ వాటర్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన కూచిపూడి మధుకృష్ణ తరువాయి 2లో

## ఇద్దరు పిల్లలను నరికి పై నుంచి దూకి


- తల్లి ఆత్మహత్య
- మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సూసైడ్ నోట్
- మేడ్చల్ జిల్లా గాజుల రామరంలో దుర్ఘటన

ప్రజాపక్షం/దుండిగల్

మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గాజులరామరం బాలాజీ లేఔట్ సహస్ర మహేష్ హైట్స్ అనే అపార్ట్మెంట్ లో నివాసం ఉండే తేజ అనే మహిళ (35) తన ఇద్దరు పిల్లలను కొబ్బరిబోండా కత్తితో నరికి, అనంతరం అపార్ట్మెంట్ బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికులను, పోలీసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. సాయంత్రం 4 గంటల సమయంలో జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందడంతో, ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఎసిపి బాలానగర్, డిసిపి బాలానగర్ ఘటనా స్థలానికి తరువాయి 2లో



## హెచ్‌ఆర్‌సి చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్ బాధ్యతల స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సి) చైర్మన్‌గా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నాంపల్లిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు తరువాయి 2లో

# కుల గణనను అడ్డుకునేందుకే

- సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను చూసి భయపడుతున్నారు
- అందుకే వారిపై అక్రమ కేసులు
- కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకపోతున్నారు
- పార్టీని అప్రతిష్ఠపాలు చేసేందుకు బిజెపి ప్రభుత్వం యత్నం
- ఇడి చర్యలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా

ప్రజాపక్షం / హైదరాబాద్




దేశంలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను, దేశవ్యాప్తంగా కులగణనను అడ్డుకోవడానికి, కాంగ్రెస్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సోనియాగాంధీ, రాహుల్ గాంధీల పై అక్రమ కేసులు పెడుతున్నారని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాహుల్, సోనియాగాంధీలను చూసి ప్రధాని మోదీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఛార్జ్ షీట్‌లో ఎఐసిసి అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడాన్ని నిరసిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కార్యదర్శి తరువాయి 2లో

## భూముల అమ్మకాలపై మేము చర్చకు సిద్ధం

- కెటిఆర్ సిద్ధమా అని టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ సవాల్
- సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కెటిఆర్, హరీశ్‌రావులు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఫైర్



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌యుసి), గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన భూముల అమ్మకాలపై తాము చర్చకు సిద్ధమని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ తరువాయి 12లో

## గ్రూప్-1 నియామక ప్రక్రియపై స్టేకు హైకోర్టు నో

- ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని సూచన
- విచారణ పూర్తయ్యే వరకూ ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు ఇవ్వొద్దని ఆదేశం

**హైదరాబాద్ :** తెలంగాణలో నిర్వహించిన గ్రూప్–1 నియామక ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని తెలిపింది. అయితే, విచారణ పూర్తయ్యే వరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని టిజిపిఎస్‌సిని ఆదేశించింది. ఇటీవల వెల్లడించిన గ్రూప్–1 జనరల్ ర్యాంకింగ్‌ను సవాల్ చేస్తూ తరువాయి 2లో

## భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటుకు తక్షణం చర్యలు

- తెలంగాణ, ఎపి రాష్ట్రాలకు పలువురు వక్తలు విజ్ఞప్తి
- నిరుపేదలకు భూదాన్ భూములు పంచేందుకు ప్రభుత్వాలు చొరవతీసుకోవాలని రౌండ్‌టేబుల్ వినతి

ప్రజాపక్షం / హైదరాబాద్



భూదాన్ యజ్ఞ బోర్డు ఏర్పాటుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు తెలంగాణ, ఎపి రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. భూదాన్ భూములను గెజిట్ ఆధారాలతో సహా భూదాన్ యజ్ఞ బోర్డుకు అప్పగించాలని కోరారు. భూదాన్ భూములను నిరుపేదలకు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. 'ఆచార్య వినోబా బావే' భూదాన్ ఉద్యమానికి 74 ఏళ్లు నిండిన సందర్భంగా ఈ నెల 18 నుంచి ఏడాది పాటు '75వ వసంతాల వజ్రోత్సవాలను' నిర్వహించనున్న నేపథ్యంలో 'అఖిల భారత సర్వోదయ మండల్– తెలంగాణ, ఆంధ్రప్రదేశ్' ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, అఖిల భారత సర్వోదయ మండల్ జాతీయ అధ్యక్షులు తరువాయి 12లో


## రెవెన్యూ అధికారుల లీలలు

- ధృవీకరణ లేకుండానే భూ హక్కుల బదలాయింపు
- అంతా ముగిశాక పోలీసులకు ఫిర్యాదు
- రెవెన్యూ శాఖను తప్పుదారి పట్టించారు : తహసీల్దార్



ప్రజాపక్షం/ఖమ్మం

గడిచిన కొంత కాలంగా జిల్లాలోని ఖమ్మం రూరల్ మండల రెవెన్యూ అధికార యంత్రాంగం అభాసుపాలైనట్లుగా మరే మండలంలోనూ జరగలేదన్నది వాస్తవం. బతికుండగానే మరణించినట్లు తప్పుడు ధృవీకరణలతో భూ హక్కులను బదలాయించారు. అటువంటిదే ఇప్పుడు కూడా జరిగింది. వారసత్వ ధృవీకరణ పత్రాల్లో వాస్తవ వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా కోట్లాది రూపాయల విలువైన భూమిని ఓ వ్యక్తి పేరు మీద బదలాయించారు. ఇప్పుడు ఈ భూమి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ. 50 కోట్ల వరకు ఉండవచ్చునని అంచనా. అంతా ముగిశాక అతను తప్పుడు ధృవీకరణ ఇచ్చాడని పోలీసులకు ఫిర్యాదు చేసి ఇక మేము ఏమి చేయలేమంటూ తహసీల్దార్ చేతులెత్తేశాడు. ఈ భూ బాగోతం వెనుక కొన్ని రాజకీయ శక్తులు ఉన్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఖమ్మం, హైదరాబాద్ జాతీయ రహదారి పక్కనే కాళికా మాత ఆలయానికి ఎదురుగా తరువాయి 12లో




# ప్రపంచం
WORLD NEWS

## పాలస్తినాలో ప్రిజనర్స్ డే:జైలులో యువకుడు మృతి

ఇజ్రాయెల్ జైలులో 20 ఏళ్ళు వయసుగల పాలస్తినా యువకుడు మరణించారు. పాలస్తినా ప్రిజనర్స్ డే సందర్భంగా ఈ ఘటన జరిగింది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17వ తేదీన పాలస్తినా ప్రజలు ప్రిజనర్స్ డే నిర్వహిస్తారు. మాతృభూమికోసం దశాబ్దాలుగా పాలస్తినా ప్రజలు ఇజ్రాయెల్‌పై పోరాటం చేస్తున్నారు. ఈ పోరాటం సందర్భంగా 1974లో ఏప్రిల్ 17వ తేదీన మొదటిసారి ఒక పాలస్తినా ఖైదీ ఎం.కె.హజాజీ ఇజ్రాయెల్ చెరనుండి బయటపడ్డారు. ఇక అప్పటినుండి పాలస్తీనయన్లు ఏప్రిల్ 17ను ప్రిజనర్స్ డే గా పాటిస్తున్నారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం ఇజ్రాయెల్ జైళ్ళలో 10,000 మంది పాలస్తీనియన్లు ఖైదీలుగా మగ్గుతున్నారు. 400 మంది పిల్లలు కూడా జైల్లో ఉన్నారు. 1967 నుండి పాలస్తీనియన్లు చేస్తున్న పోరాటంలో ఇప్పటివరకూ 10,00,000 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ అరెస్టు చేస్తూ వచ్చింది.


## 13 మంది విదేశీయులు సహా మయన్మార్‌లో 4,900 మంది ఖైదీల విడుదల





**బ్యాంకాక్ :** మయన్మార్ సైనిక పాలకులు గురువారంనాడు 4,900 మంది ఖైదీలను విడుదల చేశారు. దేశ సంప్రదాయ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వీరందరికీ క్షమాభిక్ష ప్రసాదించినట్లు జుంటా సైనిక ప్రభుత్వం ప్రకటించింది. 13 మంది విదేశీయులను కూడా విడుదల చేశారు. విదేశీయులను వారి వారి స్వదేశాలకు పంపే ఏర్పాట్లు కూడా చేస్తారు. విడుదలైనవారిలో 22 మంది రాజకీయ ఖైదీలు ఉన్నారు. గడచిన శుక్రవారంనాటికి లభించిన గణాంకాల ప్రకారం పదవీచ్యుతురాలైన మయన్మార్ ప్రధానమంత్రి ఆంగ్ సాన్ సూకీ సహా 21,197 మంది రాజకీయఖైదీలు జైళ్ళల్లో మగ్గుతున్నారు. యాంగాన్‌ఇన్‌సెయిన్ జైలు నుండి 19 బస్సులలో విడుదలైన ఖైదీలు బయలుదేరి బాహ్యప్రపంచంలోకి వచ్చారు. బయట గేటు వద్ద వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు విడుదలైన ఖైదీలకు ఘనస్వాగతం పలికారు. వారు గురువారం తెల్లవారుజామునుండే గేటు బయట పడిగాపులు కాశారు. మయన్మార్ జైళ్ళలో దారుణంగా మానవహక్కుల ఉల్లంఘన జరిగిందని స్వతంత్ర వాచ్‌డాగ్ గ్రూపు ఈ సందర్భంగా పేర్కొంది. అధికార మిలిటరీ కౌన్సిల్ అధిపతి సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లాంగ్ 4,893 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించారని ఎంఆర్‌టివి తెలియజేసింది. 2021 ఫిబ్రవరి 1వ తేదీన మయన్మార్‌లో సైన్యం మరోసారి తిరగబడి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూల్చివేసి అధికారాన్ని స్వాధీనం చేసుకుంది. ఐతే ఆ తర్వాత ప్రజాఉద్యమాన్ని సైనికపాలకులు దారుణంగా అణచివేశారు. వేలాదిమందిని హతమార్చారు. దీంతో దేశవ్యాప్తంగా తర్వాత పౌర గ్రూపులు ఆయుధాలు సమకూర్చుకుని సైనికపాలకులతో అంతర్యుద్ధం ప్రారంభించాయి. ప్రస్తుతం దేశంలో అంతర్యుద్ధం కొనసాగుతోంది. గతనెల 28న మయన్మార్‌లో భీకర భూకంపం రావడంతో 3,725 మంది మరణించారు. అపారనష్టం వాటిల్లింది. ఈ దెబ్బకు సైనికపాలకులకు పెద్ద శరాఘాతం తగిలినట్లయింది. భూకంప ప్రాంతాల్లో పునర్నిర్మాణం ప్రారంభిస్తామని సైనికపాలకుడు మిన్ ఆంగ్ హ్లాంగ్ ప్రకటించారు.

## ఒక్కరోజులో 165 మంది ఉక్రేన్ సైనికులు మృతి



**మాస్కో :** కుర్స్క్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధంలో గడచిన 24 గంటల్లో 165 మంది ఉక్రేన్ సైనికులు మరణించారు. దీంతో ఈ ప్రాంతంలో యుద్ధం మొదలైనప్పటి నుండీ ఇప్పటివరకూ ఉక్రేన్ 74,780 సైనికులను కోల్పోయిందనీ, 410 యుద్ధట్యాంకులను, 334 పదాతిదళ యుద్ధ వాహనాలను, 2,277 యుద్ధవాహనాలు, 618 ఆర్టిల్లరీ గన్స్, 57 మల్టిపుల్ రాకెట్ లాంఛర్లు, సైనికులను మోసుకెళ్ళే మరో 305 వాహనాలను ఉక్రేన్ నష్టపోయిందని రష్యా రక్షణమంత్రిత్వశాఖ గురువారంనాడు ప్రకటించింది. టాస్ వార్తాసంస్థ ఈ విషయం తెలియజేసింది. గడచిన 24 గంటల్లో 165 మంది సైనికులతోపాటు రెండు యుద్ధట్యాంకులు, పదాతిదళ యుద్ధ వాహనాలు, 12 మోటార్ వెహికిల్స్, మూడు ఆర్టిల్లరీగన్స్‌ను ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఆరు ప్రాంతాలలో 71 ఉక్రేన్ డ్రోన్లను రాత్రికిరాత్రే కూల్చేసినట్లు పేర్కొంది. 2024 ఆగస్టులో ఉక్రేన్ ఆకస్మికదాడులు చేసి కుర్స్క్ ప్రాంతంలో కొంతభాగాన్ని తన వశం చేసుకుంది. కానీ ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని కోల్పోయింది. కాగా ఆగ్నేయ ఉక్రేన్ నగరం ద్నిప్రోపై రష్యా దళాలు భారీఎత్తున డ్రోన్లతో దాడి చేసింది. ఈ దాడుల్లో 30 మంది మరణించారు. మృతుల్లో ఐదుగురు పిల్లలు ఉన్నారు. డజన్ల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతుండగానే మరోవైపు యుద్ధ దాడులు కూడా ఆగకుండా కొనసాగుతున్నాయి. డ్రోన్లదాడివల్ల పౌరప్రాంతాలలో మౌలిక సదుపాయాలకు అపారనష్టం సంభవించిందని ద్నిప్రోపెట్రోవస్క్ ప్రాంతీయ ప్రభుత్వ యంత్రాంగం పేర్కొంది.

**రష్యన్ కిల్లర్స్‌పై ఒత్తిడి చేయండి:జెలెన్స్కీ**

మూడేళ్ళుగా చేస్తున్న యుద్ధాన్ని ఆపేందుకు రష్యాపై ఒత్తిడి తీసుకురావాలని తన యూరోపియన్ యూనియన్ మిత్రులకు, ప్రపంచదేశాలకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్, అమెరికా దేశాల ప్రతినిధులతో ఉక్రేన్ సమస్యపై పారిస్‌లో చర్చలు ప్రారంభంకానున్నాయి. ఉక్రేన్ అధికార ప్రతినిధి పారిస్‌కు బయల్దేరిన సందర్భంగా జెలెన్స్కీ మాట్లాడుతూ, ''కిల్లర్ రష్యాపై ప్రపంచ దేశాలు ఒత్తిడి తీసుకురావాలి'' అని కోరారు. పగలూ రాత్రీ తేడా లేకుండా రష్యా మమ్మల్ని చంపుకుతింటోందని ఆయన విమర్శించారు. క్రైస్తవుల పవిత్రదినం పామ్ సండేనాడు సుమీపై జరిగిన దాడిలో 34 మంది మరణించిన తర్వాత జెలెన్స్కీ ప్రపంచదేశాలకు పలుసార్లు విజ్ఞప్తులు చేస్తున్నారు.

## గాజాలో రోజూ 27 మంది పిల్లలు మృతి

### 39వేలమంది అనాథలు : యూనిసెఫ్

**కైరో:** గాజా ఒక మృత్యుకేంద్రంగా మారిందనీ, ఈ యుద్ధప్రాంతంలో ప్రతి రోజూ 27 మంది పిల్లలు దాడుల్లో మరణిస్తున్నారనీ యూనిసెఫ్ (ఐక్యరాజ్యసమితి బాలల విద్యా నిధి)తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. యుద్ధం కారణంగా ఇప్పటివరకూ 39,000 మంది పిల్లలు అనాథలుగా మారారని పేర్కొంది. 2023 అక్టోబరులో యుద్ధం మొదలైనప్పటినుండీ గాజాలో ఇదే పరిస్థితి కొనసాగుతోందని పాలస్తినాలో యూనిసెఫ్ ప్రతినిధి తన తాజా నివేదికలో వెల్లడించారు. గాజాలో 16,000 మందికి అత్యవసర ఆరోగ్య చికిత్సలు చేయించాల్సి ఉందని, వారిని మెరుగైన వైద్యంకోసం మంచిచోటకు తక్షణం తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉందనీ, వీరిలో 4000 మంది పిల్లలు కూడా ఉన్నారనీ ఈ నివేదిక పేర్కొంది. ఇజ్రాయెల్ మార్చి 18వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అప్పటినుండి తిరిగి సైనికదాడులు పునఃప్రారంభించింది. ఈ దాడుల్లో 1600 మంది ఇప్పటివరకూ మరణించారు. అక్రమిత వెస్ట్‌బ్యాంక్, ఖాన్‌యూనిస్ ప్రాంతాల నుండి ప్రజలను బలవంతంగా ఖాళీచేయిస్తున్నారు. ప్రజలు ఖాళీచేసిన ప్రాంతాలను ప్రత్యేక జోన్లుగా ప్రకటించి సైన్యం తనఅధీనంలో ఉంచుకుంటున్నది. ఇటీవల ఈజిప్టుకు ఇజ్రాయెల్ ఒక ప్రతిపాదన చేస్తూ, హమాస్ ఉగ్రవాదులు ఆయుధాలు వదిలిపెట్టాలనీ, వారివద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలలో కనీసం సగంమందినైనా విడుదల చేస్తే 45 రోజులు కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామనీ పేర్కొంది. దీనిని తాము పరిశీలిస్తామని చెప్పిన హమాస్ ఇప్పటివరకూ జవాబు చెప్పలేదు. ఐతే ఆయుధాలు వదిలిపెట్టేందుకు హమాస్ ఉగ్రవాదులు సిద్ధంగా లేరు. కాగా కాల్పులను పునరుద్ధరించినప్పటినుండీ మరో 5,00,000 మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది.

**ఒకే కుటుంబంలో 10 మంది మృతి**

ఇదిలా ఉండగా, గురువారంనాడు ఇజ్రాయెల్ చేసిన తాజా దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన పదిమంది మరణించారు. మొత్తంగా చూసినప్పుడు 23 మంది పాలస్తీనియన్లు ఈ దాడుల్లో మరణించారు. గడచిన ఆరు వారాలుగా గాజాలోకి ఆహారాన్ని రానివ్వకుండా ఇజ్రాయెల్ దళాలు అడ్డుకుంటున్నాయనీ, దీనివల్ల దుకాణాలు మూతపడ్డాయనీ, నిత్యావసరాలు, మందుల కొరతతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణ ఖాన్‌యూనిస్‌లో ఇజ్రాయెల్ సైనికులు చేసిన దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు పిల్లలు, నలుగురు మహిళలు, ఒక పురుషుడు మరణించారు.





## పాలస్తినా సమస్య పరిష్కారానికి ఖతార్ – రష్యా కృషి



**మాస్కో :** అంతర్జాతీయస్థాయిలో మధ్యవర్తులు కుదిర్చిన ఒప్పందానికి ఇజ్రాయెల్ కట్టుబడటంలేదని ఖతార్ ప్రభుత్వం విమర్శించింది. మాస్కో వెళ్ళిన ఖతార్ రాజు షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ థానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో సమావేశం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. పుతిన్–అల్ థానీ ఇద్దరూ ఇజ్రాయెల్‌లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. పాలస్తినాలో శాంతి సాధనకు ఖతార్–రష్యా ఏకాభిప్రాయంతో ఉన్నాయని నాయకులు ఇద్దరూ అంగీకరించారు. ఇజ్రాయెల్–హమాస్‌మధ్య ఏకాభిప్రాయసాధనకు కృషిచేస్తున్న కీలకమధ్యవర్తిపాత్రలో ఉన్న ఖతార్ రాజు చర్చల సందర్భంగా, కొన్ని నెలల క్రితమే ఒప్పందం చేసుకున్నప్పటికీ దానిని ఇజ్రాయెల్ గౌరవించలేదన్నారు. చాలా నెలలపాటు మధ్యవర్తిత్వం చేసిన తర్వాత ఈ ఏడాది జనవరిలో మూడు దశల కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటికీ ఇజ్రాయెల్ దానికి కట్టుబడలేదని బిన్ హమద్ అల్ థానీ విమర్శించారు. ఐతే ఇప్పుడు తాజాగా కాల్పుల విరమణకు అంగీకరించడానికి అత్యంత కఠినమైన షరతులు విధించిందని విమర్శించారు. ఖతార్ దేశం మధ్యవర్తిగా యుద్ధ పరిష్కారానికి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పాలస్తినా ప్రజలు మరణిస్తూనే ఉన్నారని పుతిన్ ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరి సమావేశంలో ద్వైపాక్షిక సహకారం, ఆర్థికఅంశాలు, వాణిజ్యం, మానవతా సంబంధాలను ప్రధానంగా చర్చించారు. ఉక్రేన్‌లో సంక్షోభం, సిరియా, మధ్యాసియాలో యుద్ధ వాతావరణం, చర్చల ప్రతిష్ఠంభన గురించి వారిద్దరూ అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకున్నారు. రష్యాలో ఒక బిలియన్ డాలర్లు ప్రత్యక్ష పెట్టుబడులు సమకూర్చేందుకు ఖతార్ అంగీకరించింది. 2024 జులైలో ఖజకస్థాన్ రాజధాని అస్థానాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా వారిద్దరు కలిశారు.

## అణుసమస్యపై ఇరాన్–అమెరికా రెండో విడత చర్చలు



**దుబాయ్ :** ఇరాన్–అమెరికా ప్రతినిధులమధ్య రోమ్‌లో శనివారం (ఏప్రిల్ 18)న రెండో విడత చర్చలు జరుగుతాయి. ఇరాన్ అధికార ప్రతినిధులు ఈ విషయాన్ని గురువారంనాడు ధృవీకరించారు. ఈ చర్చలకు ఒమన్ దేశం మరోసారి మధ్యవర్తిగా వ్యవహరించనున్నది. ఐతే ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమం గురించి ఎలాంటి మాటలకూ చర్చల్లో తావు లేదని ఆ దేశ అగ్రనాయకులు ఇప్పటికే స్పష్టం చేశారు. అణు కార్యక్రమంపై ఒక ఒప్పందం చేసుకోకపోతే ఇరాన్‌పై బాంబులవర్షం కురిపిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే హెచ్చరికలు చేస్తున్న తరుణంలో ఈ చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ లాంఛనంగా తమ ఉపాధ్యక్షులలో ఒకరైన మహ్మద్ జావెద్ జారిఫ్ రాజీనామాను ఆమోదించిన నేపథ్యంలో ఈ ధృవీకరణ వచ్చింది. 2015లో అమెరికాతో ఇరాన్ తరపున కీలక అణుఒప్పంద సంప్రదింపులు తరపున చేసిన ఉపాధ్యక్షుడు గతనెలలోనే తన పదవికి రాజీనామా చేశారు. కానీ అధ్యక్షుడు వెంటనే ఈ రాజీనామాను ఆమోదించలేదు. ఇదిలా ఉండగా ఐక్యరాజ్యసమితి తరపున ప్రపంచ అణ్వాయుధ పర్యవేక్షణాధిపతి రాఫెల్ గ్రాస్సీ గురువారంనాడు ఇరాన్ చేరుకుని ఇరాన్ అణుఇంధనసంస్థ అధిపతి మహ్మద్ ఎస్లామీని తో సమావేశమయ్యారు. ఇరాన్–అమెరికామధ్య అణుఒప్పందానికి సంబంధించి ఈ సమావేశం ఎంతో కీలకమైనదని గ్రాస్సీ అన్నారు.

## ఈత సరదా (మొదటి పేజీ తరువాయి)

కుమారుడు బెన్విత్ (14) ఇటీవల పదవ తరగతి పరీక్షలు వ్రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. సెలవులు కావడంతో ప్రతి రోజు ఇంట్లో క్రికెట్ ఆటకని చెప్పి వెళ్లేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఇరువురు క్రికెట్ ఆడుకునేందుకు వెళ్తున్నామని చెప్పి దానవాయిగూడెం వద్ద గల మున్నేరు వద్దకు ఈతకు వెళ్లారు. మున్నేరులో దిగి ఈతరాక ప్రమాదవశాత్తు మునిగిపోయారు. స్థానికులు గమనించి వారిని కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే మృతిచెందారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆ ప్రాంతానికి వెళ్లి విఘాతజీవులుగా పడి ఉన్న వారి పిల్లల మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం ఖానాపురం హవేలీ (అర్బన్) సిఐ భానుప్రకాష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బిల్డింగ్ పైనుంచి దూకి (మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. పరిశీలనలో స్పాట్‌లోనే తేజ, పెద్ద కుమారుడు హర్షిత్ రెడ్డి (11) మృతి చెందినట్టు గుర్తించారు. చిన్న కుమారుడు ఆశిష్ రెడ్డి (9) ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించగా, తేజ రాసిన ఆరుపేజీల సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో ఆమె తన భర్తపై కొంత కోపంగా ఉన్నట్టు, అలాగే మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్టు లేఖలో పేర్కొన్నది. ఆమె కంటికి సంబంధించి ఆరోగ్య సమస్యలతో పాటు పిల్లల ఆరోగ్య పరిస్థితి కూడా దానికి కారణమని తెలుస్తోంది. తేజ కుటుంబంలో నెలకొన్న మానసిక, వైయక్తిక సమస్యలే ఈ ఘోర ఘటనకు దారితీశాయని పోలీసులు భావిస్తున్నారు. నింధితురాలైన తేజ తాను, పిల్లలను నరికి చంపే స్థితికి ఎలా చేరుకుంది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోంది. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర ఆవేదనకు దారితీసింది పోలీసులు సమగ్ర విచారణ చేపడుతున్నారు.

## నాలెడ్జ్ హబ్ (మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుప్పాలగూడ భూములు, తాజా పరిస్థితులపై సమావేశంలో చర్చించారు. పుప్పాలగూడ పరిసరాల్లో ఎంఎల్ఎలు, ఎంపిలు, ఐఎఎస్ అధికారుల కోసం గత ప్రభుత్వం స్థలాలను కేటాయించింది. అలాగే రెవెన్యూ అధికారులు,స్పెషల్ పోలీస్ మ్యూచువల్ కోఆపరేటివ్ సొసైటీ, తదితర సొసైటీలకు సుమారు 200 ఎకరాలకు పైచిలుకు భూమిని ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. అయితే పుప్పాలగూడ పరిధిలో వివిధ సొసైటీలకు కేటాయించిన భూములను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు మంత్రుల సబ్ కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. సొసైటీలకు కేటాయించిన భూములకు పక్కనే ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు 250 ఎకరాల విస్తీర్ణం ఉన్నదని, ఈ రెండు భూములు కలిపితే మొత్తంగా 450 ఎకరాల భూమి ఉంటుందని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ 450 ఎకరాల భూమిని ఐటి నాలెడ్జ్ హబ్ అభివృద్ధికి ఉపయోగిస్తే, మొదటి దశలో ఏర్పాటు చేయబోతున్న ఐటి హబ్ ద్వారా ఐదు లక్షల మంది యువతకు ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నాలెడ్జ్ హబ్ , ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పడింది. ప్రపంచ వ్యాప్తంగా ఐటి రంగాల్లో వచ్చిన ప్రతి మార్పులలో హైదరాబాద్ భాగస్వామి అయిందని, ఇప్పుడు కూడా ఐటి రంగంలో ఎఐ టెక్నాలజీలో వేగంగా వస్తున్న మార్పును హైదరాబాద్ అందిపుచ్చుకోవాలని మంత్రుల సబ్ కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్ ఆర్థిక అభివృద్ధిలో సుస్థిర స్థానాన్ని ఇప్పటికే సాధించిందని, హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకోవడం సాధ్యం కాదని ఆర్థికవేత్తలు స్పష్టం చేసిన విషయాన్ని సమావేశంలో మంత్రులు చర్చించారు. అభివృద్ధిని కొనసాగించే క్రమంలో పుప్పాలగూడలో 450 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్‌ను అభివృద్ధి చేస్తూ దశాబ్దాలుగా కొనసాగుతున్న హైదరాబాద్ ప్రగతిని వేగవంతం చేయాలని వారు నిర్ణయించారు.

## వారం గడువు (మొదటి పేజీ తరువాయి)

జస్టిస్ సంజయ్‌కుమార్, కెవి.విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనానికి విన్నవించారు. కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, బోర్డులలో ముస్లిమేతరులను అనుమతిస్తామనే ప్రతిపాదనను నిలిపివేస్తామనడంతోపాటు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫైపై మధ్యంతర ఉత్తర్వులను జారీచేస్తామంటూ అత్యున్నత న్యాయస్థానం చేసిన ప్రతిపాదనలను కేంద్ర కూడా గట్టిగా వ్యతిరేకించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్ర ప్రభుత్వం తరపున తన స్పందన తెలియజేసేందుకు ఏడు రోజుల గడువు ఇవ్వాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. తదుపరి విచారణ తేదీ మే 5 వరకూ సెక్షన్లు 9, 14 కింద (చట్టంయొక్క) ఎలాంటి అపాయింట్‌మెంట్లు చేయరాదని ధర్మాసనం హెచ్చరించగా అందుకు ఆయన అంగీకంచారు. దీంతో ధర్మాసనం మే 5వ తేదీకి విచారణను వాయిదా వేసింది. తుషార్ మెహతా మాట్లాడుతూ 'మేం ప్రభుత్వంగానే కాదు. పార్లమెంట్‌గా కూడా ప్రజలకు జవాబుదారీగా ఉన్నాం' అని ధర్మాసనం ముందు చెప్పారు.ప్రభుత్వానికి అనేక ప్రాతినిధ్యాలు అందాయని, దీనిపై చివరికి సవరణ చట్టం వచ్చిందని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా ధర్మాసనానికి తెలియజేశారు. 'నేను ధర్మాసనం ముందు కొన్ని మెటీరియల్స్ సహా ప్రాథమిక సమాధానాలు, డాక్యుమెంట్లు, చట్టాలకు సంబంధించిన వివరాలు చూపడానికి, సమర్పించడానికి నాకు ఏడు రోజుల గడువు ఇస్తే సరిపోతుంది. ఒక వారంలోగా ఎలాంటి మార్పులు చేయబడవు అని నేనే హామీ ఇస్తున్నాను' అని తుషార్ మెహతా చెప్పారు. ఓ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేదీ మాట్లాడుతూ'మధ్యంతర ఉత్తర్వులు ఒక వారం రోజులు దాటితే స్వర్గధామం ఏమీ పడిపోదు' అని అన్నారు. ధర్మాసనానికి సారథ్యం వహించిన సిజెఐ సంజీవ్‌ఖన్నా మాట్లాడుతూ 'మేం మార్పు పరిస్థితిని కోరుకోవడం లేదు. పార్లమెంట్ చట్టాలను చేస్తుంది, ఎగ్జిక్యూటివ్ నిర్ణయాలు అమలు చేస్తుంది. న్యాయవ్యవస్థ అర్థం చేసుకుంటుంది' అని వివరించారు. దాఖలైన 72 పిటిషన్లలో ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తెహాద్‌ఉల్‌ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్ బి), జమైత్ ఉలామాఇ హింద్, ద్రావిడ మున్నేట్ర కజగం (డిఎంకె), ఎయుక్యూఎఫ్ కర్ణాటక స్టేట్ బోర్డ్ మాజీ చైర్మన్ అన్వర్ బాషా తరపున ప్రాతినిథ్యం వహించిన న్యాయవాది తారిఖ్ అహ్మద్, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, మొహమ్మద్ జావేద్ ఈ వక్ఫ్ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలుచేసిన వారిలో ఉన్నారు.ఈ కేసులో పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్‌సింఘ్వీ, హుజెఫా అహ్మదీ ఉన్నారు.

## అడ్డుకునేందుకే (మొదటి పేజీ తరువాయి)

విశ్వనాధన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఎంపి అంజన్ కుమార్ యాదవ్, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాను ఉద్దేశించి భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో కులగణన అడ్డుకోవడానికే సోనియా, రాహుల్ పై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీని చూసి ప్రధాని మోడీ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భయపడుతున్నదన్నారు. దేశవ్యాప్తంగా ఇవి మిషన్లు కాకుండా బ్యాలెట్ పేపర్ కావాలన్న ఎఐసిసి ప్లీనరీ నిర్ణయానికి బిజెపి భయపడుతున్నదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలే కాంగ్రెస్‌ను గెలిపించుకుంటారన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి దేశ ప్రజలు అండగా ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన కులగణన సర్వే దేశవ్యాప్తంగా చేయాలంటే ప్రధాని మోడీ స్నేహితులైన అంబానీ ఆదానీలకు దోచి పెడుతున్న దేశ సంపద, వనరులు ఇక ముందు తాడిత, పీడిత, అణగారిన వర్గాలకు చెందిన దేశ ప్రజలందరికీ పంచాల్సి వస్తేదేమో? ఆ పరిస్థితి వస్తే కార్పొరేట్ సంస్థలతో బతుకుతున్న బిజెపి భవిష్యత్తు ఏమవుతుందో అన్న భయం పట్టుకుని, దేశంలో కుల గణన జరగకుండా అడ్డుకోవడానికి చేసిన కుట్రలో భాగంగానే ఎఐసిసి అగ్రనేతలు రాహుల్, సోనియాలపై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. నేషనల్ హెరాల్డ్ పత్రికలో పనిచేస్తున్న వారికి జీతాలు ఇవ్వాలని, కరెంట్ బిల్లులు కట్టాలని రూపాయి, రూపాయి పోగేసి చందాలు వేసుకుని డబ్బులు ఇస్తే కేసులు పెట్టడం న్యాయమా? జర్నలిస్టులకు అండగా నిలబడినటువంటి కాంగ్రెస్ అగ్ర నేతలపై కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అక్రమంగా పెట్టిన ఈ.డి కేసులను సమస్త జర్నలిస్టులు ఎండగట్టాలని కోరారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిజెపి ఫాసిస్టు పాలన కొనసాగుతున్నదన్నారు. రాహుల్ గాంధీకి పెరుగుతున్న ప్రతిష్టను చూసి ఓర్వలేక మోదీ సర్కార్ అక్రమ కేసుల కుట్రలకు తెరలేపిందని విమర్శించారు. ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ దేశంలో బిజెపి గుండాయిజం, రౌడీయిజం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ట పెరుగుతుందని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని, రాహుల్‌గాంధీని బిజెపి ప్రభుత్వం వేధింపులకు గురిచేయడం ద్వారా ఆధైర్యపరిచే ప్రయత్నం చేస్తుందన్నారు. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అనడం కంటే కెసిఆర్ ప్రతిపాదన మేరకు బిజెపి అధ్యక్షుడైన కిషన్ రెడ్డి చట్టాల గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు.

## స్టేకు హైకోర్టు నో (మొదటి పేజీ తరువాయి)

20 మంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. జిఆర్ఎల్‌లో అవకతవకలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. మెయిన్స్ పత్రాల మూల్యాంకనం సరిగా నిర్వహించలేదని, అందుకే అభ్యర్థులు నష్టపోయారని పిటిషనర్లు పేర్కొన్నారు. మూల్యాంకనం, నియామకాలు నిబంధనలకు విరుద్ధమని, తిరిగి మూల్యాంకం చేయాలని, లేదంటే మరోసారి మెయిన్స్ నిర్వహించాలని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. మూల్యాంకనంపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఈ మేరకు ప్రతివాదులను ఆదేశించాలని 20 మంది గ్రూప్–1 అభ్యర్థులు అభ్యర్థించారు. తెలంగాణ ప్రభుత్వం, టిజిపిఎస్‌సిని ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

## బాధ్యతల స్వీకరణ (మొదటి పేజీ తరువాయి)

హెచ్‌ఆర్‌సి జ్యూడిషల్ సభ్యులుగా రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి శివాది ప్రవీణ, నాన్ జ్యూడిషల్ సభ్యులుగా రిటైర్డ్ ఎఐఎస్ అధికారి డాక్టర్ బి.కిషోర్ కూడా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ పెండింగ్‌లో ఉన్న 300 కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా మానవ హక్కుల కాపడే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పెట్టుబడులు (మొదటి పేజీ తరువాయి)

ఇంటెంట్‌పై ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు. జపాన్ కంపెనీలతో పాటు ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేస్తారు. దీంతో దాదాపు రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అంచనాలున్నాయి. మారుబేని ఇండస్ట్రియల్ పార్క్ ప్రధానంగా ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి పెడుతుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. చర్చల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీకి మారుబేనికి స్వాగతం పలికారు. ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే మొట్టమొదటి పార్కు ఇదేనని అన్నారు. దీంతో తెలంగాణలో దాదాపు 30 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, జీవనోపాధి మెరుగుపడుతుందని అన్నారు. తెలంగాణలో వ్యాపారానికి అనువైన అవకాశాలున్నాయని మారుబేనికి ప్రభుత్వం తరపున తగినంత మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, అందులో మారుబేని పెట్టుబడులకు ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. భారత దేశంతో జపాన్‌కు అనేక ఏళ్లుగా ఉన్న స్నేహ సంబంధాల దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను తమ స్వస్థలంగానే భావిస్తారని ముఖ్యమంత్రి మాటిచ్చారు. తెలంగాణ, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు ముఖమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకున్న దార్శనికతకు మారుబేని నెక్స్ట్ జనరేషన్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దైసకాకురా అభినందించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శించారు. అక్కడున్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందువరుసలో ఉంటామని అన్నారు. మారుబేని కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 65 దేశాలలో 410 కి పైగా గ్రూప్ కంపెనీల ద్వారా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులు, లోహాలు, గనులు, ఇంధనం, విద్యుత్తు, కెమికల్స్, మౌలిక సదుపాయాలు, ఫైనాన్స్ లీజింగ్, రియల్ ఎస్టేట్, ఏరోస్పేస్, మొబిలిటీ రంగాలలో ఈ కంపెనీ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మందికి పైగా ఉద్యోగులను నియమించిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## ఆర్థిక సాయం అందించండి (మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఉన్నత యాజమాన్యంతో సమావేశమైంది. రాష్ట్రంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు నిధులను సమీకరించేందుకు జైకాతో తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరిపింది. ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా, ఆ సంస్థ సీనియర్ మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పెట్టుబడిదారులను ఆకర్షించేలా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సానుకూల విధానాలు, ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా హైదరాబాద్‌ను అత్యంత ఆకర్షణీయమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా రూ.24,269 కోట్ల అంచనాలతో చేపట్టనున్న మెట్రో రైలు రెండో దశ ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్రం తుది పరిశీలనలో ఉన్నాయని జైకా బృందానికి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే వ్యయంలో 48 శాతం అంటే రూ.11,693 కోట్ల రుణం అందించి మద్దతు ఇవ్వాలని కోరారు. భారత ప్రభుత్వ విదేశీ రుణ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితంగా పాటిస్తుందని చెప్పారు. మెట్రోతో పాటు మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు, కొత్త రేడియల్ రోడ్లకు నిధులు సమకూర్చాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్, టోక్యో లాంటి ప్రపంచ నగరాలతో సమానంగా అభివృద్ధి చేయాలనే తన ఆలోచనలను ముఖ్యమంత్రి వారితో పంచుకున్నారు. జైకాకు, తెలంగాణతో అనేక ఏళ్లుగా సంబంధాలున్నాయని జైకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ షోహెయ్ హరా అన్నారు. మెట్రో రైలు విస్తరణతో పాటు, అర్హతలున్న ఇతర అభివృద్ధి ప్రాజెక్టులకు జైకా నుంచి ఆర్థిక సాయం పొందేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ



సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మెట్రో రైలు ఎండి ఎన్‌విఎస్.రెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, తెలంగాణకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**సోనీ ప్రధాన కార్యాలయంలో సిఎం బృందం :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గురువారం జపాన్‌లో సోనీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోనీ కంపెనీకి చెందిన యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బృందాన్ని కలుసుకుంది. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అధికారిక పర్యటనలో భాగంగా సోనీ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. సోనీ కార్పొరేషన్ తయారు చేస్తున్న కొత్త ఉత్పత్తులు, చేపడుతున్న కొత్త కార్యక్రమాలను ఆ కంపెనీ ప్రతినిధులు ప్రదర్శించారు. ఉత్పత్తులతో పాటు వారి పనితీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సోనీ కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్‌పై వివరణాత్మక చర్చలు జరిపింది. యానిమేషన్, విఎఫ్ఐ, గేమింగ్ రంగాలలో హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ బృందం కంపెనీ ప్రతినిధులకు వివరించింది. ఎండ్‌టు ఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన భవిష్యత్తు విజన్‌ను వారితో పంచుకున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎక్సైజ్ ఎస్ఐ మురళీకృష్ణకు క్యాష్ అవార్డు



ప్రజాపక్షం/హైదరాబాద్ : భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన సమయంలో పట్టుకున్న గంజాయి కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల శిక్షతో పాటు రూ. 20వేల జరిమాన పడే విధంగా కేసు రాసిన బానాల మురళీకృష్ణకు గురువారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి చేతుల మీదుగా క్యాష్ అవార్డును అందించారు. మురళీకృష్ణ ప్రస్తుతం ఊట్‌నూర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు. మురళీకృష్ణ 2023లో భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో 28 కెజిల గంజాయిని రవాణ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ నిందితుడికి శిక్షపడే విధంగా కేసును, సాక్ష్యులను పెట్టడంలో కీలకపాత్ర వహించిన మురళీకృష్ణ క్యాష్ అవార్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి ఉన్నారు.

### వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలతో

# కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టు

**పర్యావరణ పరిరక్షణ : రైతుకు ఆదాయమే లక్ష్యం**

**ప్లాంట్లు ఏర్పాటు ద్వారా 3వేల ఉద్యోగాల కల్పన**

**వ్యవసాయ వ్యర్థాలను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు అవకాశం**



ప్రజాపక్షం/హైదరాబాద్ : పర్యావరణహిత రాష్ట్రమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోంది. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే వ్యవసాయ వ్యర్థాలను పర్యావరణ హితంగా మార్చే ప్రక్రియకు సన్నాహకాలు చేస్తోంది. ఇందులో భాగంగా వ్యవసాయ ఉత్పత్తుల వ్యర్థాలతో రాష్ట్రవ్యాప్తంగా 15 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ వ్యర్థాలను సమర్థంగా వినియోగించుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ఇటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టును ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత పెట్రోలియం కార్పొరేషన్‌లు 50 శాతం, జిపిఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థ 50 శాతం భాగస్వామ్యంగా ఈ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నాయి. ఒక్కో ప్లాంట్ 15 టన్నుల రోజువారి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండగా, మొత్తం 225 టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి జిపిఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థ ప్రతినిధుల బృందం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గురువారం ప్రతిపాదనలు సమర్పించారు.

**రాష్ట్రంలోని 15 జిల్లాలలో ప్లాంట్ల ఏర్పాటు :**

రాష్ట్రంలోని 15 జిల్లాల్లో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామాబాద్‌లలో ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ప్రతి ప్లాంట్‌కు కనీస స్థలం 20 ఎకరాలతో పాటు వరి గడ్డి, నాపియర్ గడ్డిని నిల్వ చేయడానికి అదనంగా మరో 25 ఎకరాలు, మొత్తం 55ఎకరాలు భూమి అవసరం కానుంది. ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన 18 నెలల్లో ఈ పనులు పూర్తి చేసే విధంగా కంపెనీ ప్రతినిధులు కార్యాచరణను రూపకల్పన చేశారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు, స్థానికంగా ఉండే దాదాపు 3వేల మంది గ్రామీణ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు కలుగనున్నాయి.

**పర్యావరణ హితకరమైన ప్రయోజనాలు :**

ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే పర్యావరణ పరిరక్షణే కాకుండా ఆర్థికంగా కూడా ఎంతో మేలు జరగనుంది. ఎందుకంటే ప్రతి ఏటా పంటల కోత తర్వాత ఉత్పత్తి అయ్యే వ్యవసాయ వ్యర్థాలను ఎండిన తర్వాత రైతులు పొలాల్లోనే కాల్చివేస్తుంటారు. దీంతో ఆ పొగ కారణంగా వాతావరణ కాలుష్యం బారిన పడి పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది. అయితే ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఇకమీదట రైతులు వ్యవసాయ వ్యర్థాలను సైతం అమ్ముకోవచ్చు. వీటిని బయో ప్రాజెక్టు వారే సేకరిస్తారు. ఈ ఏడాది వానాకాలంలోనే 65 లక్షల ఎకరాల్లో వరిపంట, 43లక్షల ఎకరాలలో పత్తిపంట సాగు చేయగా, దాదాపు 13 నుండి 14 కోట్ల క్వింటాళ్ల వరకు వరి కొయ్యలు, 8.6 కోట్ల క్వింటాళ్ల వరకు పత్తి కట్టే వ్యర్థాలు వెలువడినటుల అధికారాలు అంచనా. అయితే ఈ ప్రాజెక్టుల కుగాను ప్రతి ఏటా సుమారు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరిగడ్డి వినియోగించబడుతుంది. తద్వారా ఏటా 82,125 మెట్రిక్ టన్నుల కంప్రెస్డ్ బయో గ్యాస్ (సిబిజి) ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఇది సుమారు 57.84 లక్షల గృహ గ్యాస్ సిలిండర్లకు సమానమని ప్రాథమిక అంచనా. అంతేకాకుండా 3 లక్షల మెట్రిక్ టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది. దీనివల్ల వ్యవసాయరంగంలో మట్టి నాణ్యత మెరుగవడంతోపాటు సేంద్రియ వ్యవసాయానికి బలమైన తోడ్పాటు లభిస్తుంది. ఇక గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలలో 17.24 లక్షల మెట్రిక్ టన్నుల తగ్గింపు సాధ్యం కానుంది.

**తెలంగాణ హరిత భవిష్యత్తుకు నాంది : మంత్రి తుమ్మల**

రాష్ట్ర అభివృద్ధిలో పునరుత్పాదక ఇంధన రంగం కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తద్వారా వ్యవసాయ వ్యర్థాలే రైతులకి ఆదాయ మార్గంగా మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. జిపిఎస్ రెన్యూవబుల్స్ ఆర్య సంస్థ చేసిన ప్రతిపాదన రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని, ఇందుకు సంబంధించి అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది తెలిపారు. యువతకు ఉపాధి, రైతులకు ప్రత్యక్ష ఆదాయం, పర్యావరణ పరిరక్షణ వంటి బహుళ ప్రయోజనాలు కలగనున్నాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ చర్యలు తెలంగాణ హరిత భవిష్యత్తు నాంది పలకనున్నాయని మంత్రి వెల్లడించారు.

## ఎఐకెఎస్ జాతీయ కమిటీ ఎన్నిక

**అధ్యక్షులుగా క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శిగా రావుల వెంకయ్య, జాతీయ కార్యదర్శిగా పశ్యపద్మ**

అమరావతి : అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య తిరిగి ఎన్నికయ్యారు. అఖిలభారత కిసాన్ సంఘ్ (ఎఐకెఎస్) జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఖమ్మం జిల్లాకు చెందిన బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. తమిళనాడులోని నాగపట్టణంలో ఈనెల 15 నుంచి గురువారం వరకు ఎఐకెఎస్ 30వ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 650 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 57 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభలను జయప్రదం చేయటంలో తమిళనాడు రాష్ట్ర కిసాన్ సభ విశేష కృషి చేసింది. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలు చేసింది. ఈ జాతీయ మహాసభలో 115 మందితో జాతీయ కౌన్సిల్, 39 మందితో కార్యవర్గం, 17మంది ఆఫీసు బేరర్లను ఎన్నుకున్నారు. కాగా ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా తెలంగాణ నుంచి పశ్యపద్మ, బాగం హేమంతరావు, సూర్యనారాయణ, కంజర్ల భూమయ్య, వర్ల వెంకటయ్య, గోవిందరావు, ముత్యాల విశ్వనాథం, దేవభక్తుల సంధ్య, రాణి, రామచంద్రయ్య, కంబాల శ్రీనివాస్, దొడ్డ వెంకటయ్య, ప్రభులింగంలు ఎన్నికయ్యారు.



## సమసమాజ స్థాపనే లక్ష్యం

**సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**

ప్రజాపక్షం/చిగురుమామిడి : దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం, సమసమాజ స్థాపన లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలం ఒగులాపూర్ గ్రామంలో సిపిఐ గ్రామశాఖ మహాసభ మాజీ కార్యదర్శి గట్టు మధు అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై వెంకటరెడ్డి మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్రలో స్వాతంత్రంతో పాటు దోపిడీ లేని సమాజం, అంతరాలు లేని వ్యవస్థ, కార్మిక కర్షకుల సమస్యలతో పాటు ప్రజల అభ్యున్నతికి కీలకపాత్ర పోషించిందన్నారు. దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి కేవలం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేయడంలో జాప్యం చేయకుండా ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని, లేనిపక్షంలో ప్రజలచే తిరుగుబాటు తప్పదన్నారు. క్షేత్రస్థాయిలో నిర్మాణపరంగా సిపిఐ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందెస్వామి, చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్నస్వామి, బూడిద సదాశివ, శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్, గ్రామశాఖ నాయకులు పాల్గొన్నారు.



## సిపిఐలో చేరిన పాండురంగాచారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి సంఘం నేత రాయబండి పాండురంగాచారి తిరిగి తిరిగి మాతృ సంస్థ అయిన సిపిఐలోఎ చేరారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనమనేని సాంబశివ రావు పాండురంగా చారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కూనమనేని సాంబశివరావు మాట్లాడుతూ పాండురంగ చారి తిరిగి పార్టీలో రావడం మంచి పరిణామం అని అన్నారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జాతీయ నాయకులు టి.వెంకట్రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ధనంజయ్‌నాయుడు, ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్ పాల్గొన్నారు.

## 262 మందికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : చార్మినార్ జోన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న262 మందికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతులు కల్పిస్తూ మల్టీజోన్–2 ఐజి వి.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 73 మంది, సైబరాబాద్‌లో 147 మంది, సంగారెడ్డిలో 18 మంది, వికారాబాద్‌లో 17 మంది, డిప్యూటేషన్‌లో ఉన్న ఏడుగురు ఉన్నారు.

### మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో

# ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు

**ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ**




ప్రజాపక్షం/హైదరాబాద్ : తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు 4 రోజులు పాటు జరగనున్న అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం హైదరాబాద్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ నాయకులు 17వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్‌ను అవిష్కరించారు. అనంతరం వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ దేశంలో యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధానంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాలయాపన చేస్తుండడంతో రోజురోజుకూ నిరుద్యోగం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టిసారించకుండా ఎంతసేపటికీ ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారీ వ్యవస్థలపైనే ఆధారపడుతుండటంతో ఉన్నవారు మరింత ధనవంతులుగా, లేనివారు మరింత పేదవారుగా మారి అసమానతలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ జాతీయ మహాసభలలో ప్రధానంగా నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు తదితర అంశాలపై చర్చలు, తీర్మానాల ద్వారా నిర్ణయాలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. ఈ జాతీయ మహాసభలకు దేశం నలుమూలల నుండి సుమారు 800 మంది డెలిగేషన్ నాయకత్వం పాల్గొంటారన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి 80 మంది ప్రతినిధులు హాజరు కానుండగా, మే15న తిరుపతిలో జరగనున్న మహాసభల ర్యాలీ, బహిరంగ సభకు 1000 మంది పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, లింగం రవి, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్, పేరబోయిన మహేందర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్‌బేగ్, షేక్ మహమూద్, శివకుమార్, మధు, బోనగిరి మహేందర్, మస్కుసుధీర్, మహేష్, మాజీద్ అలీ ఖాన్, కల్యాణ్, మానస్‌కుమార్, మార్కపూరి సూర్య, రాజేష్, మధు, ప్రవీణ్, అశోక్, రాజ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖరులోగా ‘ఎల్‌ఆర్‌ఎస్’ ప్రక్రియ

**నూరు శాతం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలి**

**ఓపెన్ ప్లాట్‌తో పాటు లేఔట్‌ల పరిశీలనపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్**




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దాన కిషోర్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీలోగా వంద శాతం పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్లకు, మున్సిపల్ కమిషనర్లకు ఆయన సూచించారు. సచివాలయంలో గురువారం దాన కిషోర్, డిటిసిపి డైరక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డితో కలిసి ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్‌లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో భాగంగా తక్కువ ప్రొసీడింగ్‌లు జారీ చేసిన జిల్లా కలెక్టర్లతో ముఖ్య కార్యదర్శి మాట్లాడారు. ఎక్కువ ప్రొసీడింగ్స్ జారీ చేసిన జిల్లా కలెక్టర్లు తాము అనుసరిస్తున్న వ్యూహాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులందరికీ ప్రొసీడింగ్స్ జారీ ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ఓపెన్ ప్లాట్లతో పోల్చుకుంటే లేఔట్‌ల వెరిఫికేషన్ ఆశించిన వేగంగా జరగడంలేదని దానకిషోర్ తెలిపారు. ఓపెన్ ప్లాట్‌తో పాటు లేఔట్‌ల వెరిఫికేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్‌లు, కమిషనర్‌లకు ఆయన సూచించారు. బల్క్ అప్లికేషన్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను దరఖాస్తుదారులకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌లకు ఆయన సూచించారు. ఇప్పటికీ ఫీజు చెల్లించని దరఖాస్తుదారులకు మళ్ళీ ఫోన్ చేసి ఏప్రిల్ 30లోగా ఫీజులు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు.




## పౌర సరఫరాల శాఖలో సంస్కరణలు ప్రశంసనీయం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలోని పౌర సరఫరాల శాఖ బలోపేతానికి చేపట్టిన సంస్కరణలు ప్రశంసనీయమని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి సి.విశ్వనాథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆహార, పౌర సరఫరాల విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన విశ్వనాథ్ గురువారం హైదరాబాద్‌లోని సివిల్ సప్లైయి భవన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పౌరసరఫరాల శాఖ కమిషన్ డి.ఎస్.చౌహాన్ సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం విశ్వనాథ్ పౌరసరఫరాల శాఖ అధికారులతో తన అనుభావాలను పంచుకున్నారు. ఏడాది కాలంలోనే ప్రభుత్వ 4 ప్రధాన కార్యాక్రమాలను పౌరసరఫరాల శాఖ విజయవంతంగా అమలు చేయడ అభినందనీయమన్నారు. ఉత్తర ప్రదేశ్‌లో ఎఫ్‌సిఐ జనరల్ మేనేజర్‌గా డి.ఎస్ చౌహన్ పని చేసిన కాలంలోను ఆయన నిర్వహించిన పనితీరుతో మంచి ఫలితాలను సాధించారని విశ్వనాథ్ గుర్తు చేశారు.

## ఈస్టర్ ఫెస్టివల్‌కు ఎంఎంటిఎస్ ప్రత్యేక రైళ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: క్రిస్టియన్లకు ఇది శుభవార్త. ఈ నెల 20వ తేదీన ఈస్టర్ ఫెస్టివల్ నేపథ్యంలో ఎంఎంటిఎస్ ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది.ఈ మేరకు దక్షిణ మండల రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారి ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగరంలోని కల్వరి టెంపుల్కు వెళ్లే వారు ఈ ప్రత్యేక రైళ్లను ఉపయోగించుకోవాలని సూచించారు. 20వ తేదీన మొత్తం మూడు ఎంఎంటిఎస్ స్పెషల్ రైళ్లు అందుబాటులో ఉండనున్నారు. హైదరాబాద్ నుంచి లింగంపల్లి వెళ్లే ఎంఎంటిఎస్ రైలు.. 20వ తేదీన తెల్లవారుజామున 3.15 గంటలకు హైదరాబాద్ స్టేషన్ నుంచి బయల్దేరి లింగంపల్లికి ఉదయం 4.05 గంటలకు చేరుకోనుంది. ఫలక్నుమా లింగంపల్లి ఎంఎంటిఎస్ రైలు.. ఫలక్నుమాలో తెల్లవారుజామున 2.30 గంటలకు బయల్దేరి.. సికింద్రాబాద్కు 3.05 గంటలకు, లింగంపల్లికి ఉదయం 4 గంటల వరకు చేరుకోనుంది. లింగంపల్లి ఫలక్నుమా రైలు లింగంపల్లిలో 2.50కి బయల్దేరి, సికింద్రాబాద్కు 3.30కి, ఫలక్నుమాకు ఉదయం 4.30 గంటలకు చేరుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## నాన్ డ్యూటీ లిక్కర్‌పై దృష్టి సారించండి : ఎక్సైజ్ డిసి దశరథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : నాన్ డ్యూటీ లిక్కర్‌పై దృష్టిసారించాలని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అధికారులను ఆదేశించారు. నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ సిబ్బంది, అధికారులతో రంగారెడ్డి డివిజన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాల్లో గంజాయితో పాటు డ్రగ్స్‌ను అరికట్టేందుకు అధికారులు నిరంతరం దాడులు నిర్వహించాలని సూచించారు. ప్రధానంగా రంగారెడ్డి డివిజన్‌లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్లను ఆయన ఆదేశించారు. వీటికి తోడు ఎప్పటికప్పుడు ఎండిపిఎల్ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ వినియోగించేటువంటి ఫామ్‌హౌస్‌లు వాటిపై ప్రత్యేకంగా నిఘాపెట్టి దాడులు నిర్వహించి అక్రమ మద్యాన్ని అరికట్టాలని ఆయన సూచించారు. నమోదు చేసినటువంటి కేసుల్లో సకాలంలో చార్జిషీట్, వాహనాలను వేలం వేయాలని పట్టుకున్నటువంటి కాంట్రా బ్యాండ్ ఆదేశాలను తీసుకొని కాల్చివేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్‌తో పాటు శంషాబాద్, సరూర్‌నగర్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కృష్ణప్రియ, ఉజ్వలరెడ్డి, కె.నవీన్, ఫయాజుద్దీన్, విజయ్ భాస్కర్ గౌడ్‌లతోపాటు ఎస్‌టిఎఫ్ టీములు, స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-14, జిహెచ్ఎంసి**

NIT No. 02/E.E.14/GHMC/2025-26 తేది: 16.04.2025

**పని పేరు:** జిహెచ్ఎంసి, సి-14 కింద 77-జామ్‌బాగ్ డివిజన్‌లో 5-6-613 దర్గాషాకామోష్ మరియు 5-6-613 జామా మసీద్ దగ్గర కమ్యూనిటీ టాయిలెట్స్ పునరుద్ధరణ. (రూ.7.50 లక్షలు), **అంచనా విలువ / ఇసివి:** రూ.7.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 17.04.2025న ఉ.11.00గం.ల నుండి 21.04.2025న ఉ.11.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ -14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 515-PP/CL/ADVT/1/2025-26, Date: 17-04-2025

**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No. SSSD/132/2025 | బహిరంగ వేలము ప్రకటన - 2 | తేది: 17.04.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! మంచిర్యాల జిల్లా, దండేపల్లి మం॥, గూడెం గ్రామము యందలి శ్రీ సత్యనారాయణస్వామి దేవస్థానము వద్ద ఈ క్రింద తెలిపిన వేలము తేది: 28.04.2025 సోమవారం రోజున ఉదయం గం.11:00ల నుండి దేవాదాయశాఖ అధికారులు పర్యవేక్షణలో, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు మరియు హాజరు సభ్యుల సమక్షములో దేవాలయ కార్యనిర్వహణాధికారిచే దేవస్థాన కార్యాలయమునందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| క.సం. | బహిరంగ వేలము వివరములు | ధరావత్తు సొమ్ము | కాల పరిమితి |
|---|---|---|---|
| 1. | టెంకాయలు అమ్ముకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 19.06.2025 నుండి తేది: 18.06.2026 వరకు |
| 2. | కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొను హక్కు | రూ. 50,000/- | |
| 3. | ధాన్యము వ్రతపూజసామాగ్రి ప్రోగుచేసుకొను హక్కు | రూ. 1,00,000/- | తేది: 15.06.2025 నుండి తేది: 14.06.2026 వరకు |
| 4. | కిరాణం మరియు ఆటబొమ్మలు అమ్ముకొనుహక్కు, | రూ. 50,000/- | |
| 5. | వంట చెరకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు | రూ. 50,000/- | |
| 6. | టీ, టిఫిన్స్ అమ్ముకొను హక్కు | రూ.20,000/- | |

కావున ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి ఆధార్ కార్డు ఇచ్చి బహిరంగ వేలము పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాను. ఇట్టి వేలము పాట షరతులు వేలము పాటకు ముందు చదివి వినిపించబడును. ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

DIPR R.O. No. : 524-PP/CL/ADVT/1/2025-26, Date: 17-04-2025 సం/- కార్యనిర్వహణాధికారి

**పురపాలక సంఘ కార్యాలయము - రామాయంపేట**
జి॥ మెదక్. (టి.ఎస్.)

నెం. A1/52/MCR/2025 | బహిరంగ వేలము ప్రకటన | తేది: 16.04.2025

**విషయము :** పురపాలక సంఘం రామాయంపేట - 2025-26 ఆర్థిక సంవత్సరమునకు తైబజారు వేలము వేయుటకు గాను ప్రకటన జారీ చేయుట గురించి.

**సందర్భము :** 1. పురపాలక సంఘం రామాయంపేట గారి ప్రకటన నం. ఎ1/52/యం.సి.ఆర్./2025, తేది: 11.03.2025
2. పురపాలక సంఘం రామాయంపేట గారి ప్రకటన నం. ఎ1/52/యం.సి.ఆర్./2025, తేది 25.03.2025

ఇందుమూలముగా రామాయంపేట పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2025-26 ఆర్థిక సంవత్సరమునకు తేది 01.05.2025 నుండి 31.04.2026 వరకు తైబజారు వసూలు చేయుటకు ఈ దిగువ చేవ్రాలు చేయు వారిచే సందర్భము 1 మరియు 2 ద్వారా వేలం నిర్వహించగా ఇట్టి వేలములో ఎవరు డిపాజిట్ చెల్లించనందున వేలము వాయిదావేయనైనది. తిరిగి తేది 24.04.2025 గురువారము రోజున మధ్యాహ్నం గం. 12-00లకు పురపాలక సంఘ ఆవరణలో వేలము నిర్వహించబడును. కావున ఆసక్తి గల వారు తేది. 24.04.2025 రోజున ఉదయం 10 గం.ల వరకు సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించి ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరనైనది.

**వేలము యొక్క నిబంధనలు :-**

1. వేలం యొక్క వ్యవధి తేది 01.05.2025 నుండి 31.04.2026 వరకు ఉండగలదు.
2. వేలంలో పాల్గొనువారు ధరావత్తు రూ 1,00,000-00 చెల్లించినవారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు.
3. వేలములో నెగ్గిన వారు వేలము మొత్తములో 1/2 భాగము డబ్బు చెల్లించవలయును. మిగిలిన మొత్తం (6) సమాన వాయిదాలలో 11/2025 లోగా చెల్లించవలెను. అనగా 01.06.2025 నుండి 30.11.2025 వరకు ప్రతినెల 5వ తేదీలోగా చెల్లించి రశీదు పొందవలెను.
4. WP. No. 3234/2004 మరియు CయMA గారి సర్క్యులర్ నెం. 4868/2015/M31 తేది 06.07.2015 ప్రకారము గూడ్స్ ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలకు తైబజారు రుసుము వసూలు చేయరాదు.
5. గుత్తేదారు తైబజారు గుత్తలు ఇతరులకు బదిలీ చేయుటకు గాని తిరిగి గుత్తకు ఇచ్చుటకు గాని గుత్తేదారునికి అధికారము లేదు.
6. తైబజారు వేలములో పాట పాడేవారు సాల్వన్స్ సర్టిఫికెట్ రూాలు 10,00,000-00 లకు తక్కువ కాకుండా సమర్పించవలెను. సర్టిఫికెట్ దాఖలు చేసిన వారు మాత్రమే వేలము పాటలో పాల్గొనుటకు అర్హులు.
7. వేలములో పాల్గొను వారు పురపాలక సంఘానికి ఎలాంటి బకాయిలు ఉండకూడదు.
8. వేలము పూర్తి కాగానే వారము రోజులలో లీజు అగ్రిమెంట్ మరియు సెక్యూరిటీ బాండ్తో మున్సిపల్ కమీషనర్ గారి పేరిట రిజిస్ట్రేషన్‌మీ స్వంత ఖర్చుతో చేయించి కార్యాలయములో దాఖలు చేయవలెను. లేనిచో ధరావత్తు జప్తు గావించి తిరిగి వేలము వేయబడును.
9. వేలము పొందినవారు (6) MT చెక్కులు కార్యాలయములో సమర్పించవలెను.
10. వేలము యొక్క పాటను ఆమోదించుటకు మరియు ఏ కారణం లేకుండా తిరస్కరించుటకు కమీషనర్ రామాయంపేట గారికి సర్వ హక్కులు కలవు.
11. పురపాలక సంఘం నిర్ణయించిన రేట్ల ప్రకారము తైబజారు ఫీజు వసూలు చేయవలను. ఒకవేళ నిర్ణయించిన రేట్ల కంటే ఎక్కువ వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చినచో మీ యొక్క కాంట్రాక్టు రద్దు చేయబడును.

**దీని ప్రతులు :-**

1. మండల ప్రజా పరిషత్ కార్యాలయం, రామాయంపేట నోటీసు బోర్డుపై అతికించనైనది.
2. మండల రెవెన్యూ కార్యాలయం, రామాయంపేట నోటీసు బోర్డుపై అతికించనైనది.
3. మున్సిపల్ కార్యాలయం, రామాయంపేట నోటీసు బోర్డుపై అతికించనైనది.
4. పట్టణములోని గాంధి విగ్రహం వద్ద, బస్ స్టాండ్ నందు, అంబేద్కర్ విగ్రహం వద్ద, సుభాష్ రోడ్డు నందు, బి.సి.కాలనీలో, గొలిపర్తి, కోమటిపల్లి, రామాయంపేట తాండ, కోమటిపల్లి తాండ మెయిన్ చౌరస్తాల వద్ద అతికించనైనది.

సం/- కమిషనర్, పురపాలక సంఘ కార్యాలయం, రామాయంపేట.

DIPR R.O. No. : 496-PP/CL/ADVT/1/2025-26, Date: 17-04-2025

# ప్రజాపక్షం

శుక్రవారం, ఏప్రిల్ 18

## బిజెపి దూకుడుకు బ్రేక్

వక్ఫ్(సవరణ) బిల్లుకు ఆగమేఘాలమీద పార్లమెంటు ఆమోదం పొందటమేగాక, ఆ మరునాడే రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆమోదముద్రతో దాన్ని చట్టంగావించి, అమలు చేయటానికి ఆతృత పడిన భారతీయ జనతాపార్టీ ప్రభుత్వ తొందరపాటుకు సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. ముస్లిం మైనారిటీ మత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటమేగాక వారి మత స్వేచ్ఛ, వక్ఫ్ నిర్వహణ హక్కుల్లో ప్రభుత్వ జోక్యాన్ని, అన్యమత జోక్యాన్ని ప్రవేశపెడుతున్న ఈ బిల్లు రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ పలు ముస్లిం సంస్థలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, వ్యక్తులు అంతే త్వరగా సుప్రీంకోర్టులో 100కు పైగా పిటిషన్‌లు దాఖలు చేశాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో జస్టిస్‌లు సంజయ్ కుమార్, కె.వి.విశ్వనాథన్ కొద్ది రోజుల్లోనే – బుధవారం విచారణ చేబట్టారు.

ఈ చట్టంలో ప్రధానమైన వివాదాంశాలు–వక్ఫ్–బై–యూజర్ ( దీర్ఘకాలంగా వినియోగం వల్ల వక్ఫ్ ఆస్తిగా పరిగణన) ఏర్పాటుకు గుర్తింపు రద్దు చేయటం, వక్ఫ్ యాజమాన్య సంస్థల్లో ముస్లిం యేతరులకు స్థానం కల్పించటం, ఫలానా ఆస్తి వక్ఫ్‌దా లేక ప్రభుత్వానిదా అని నిర్ణయించే అధికారాన్ని ప్రభుత్వానికి (కలెక్టర్) ఇవ్వటం. ఈ విషయంలో ''అన్ని పక్షాలకు సమన్యాయం చేస్తూ మూడు అంశాలతో తాత్కాలిక ఉత్తర్వు'' ఇస్తానని ప్రధాన న్యాయమూర్తి చేసిన ప్రతిపాదన ప్రభుత్వపక్షంలో అలజడి సృష్టించింది.

జస్టిస్ సంజీవ్‌ఖన్నా లేవనెత్తిన అంశాలు ఎంత సమంజసంగా ఉన్నాయో కదా!. ఒకటి, కోర్టులు ఇప్పటికే వక్ఫ్ అని ప్రకటించిన ఆస్తులను, ప్రస్తుతానికి, డీనోటిఫై చేయరాదు లేదా వక్ఫ్ యేతర ఆస్తులుగా ప్రకటించరాదు. 'వక్ఫ్–బై–యూజర్' లేదా అధికారిక పత్రాలు, రిజిస్ట్రేషన్ లేకపోయినా ప్రకటన ద్వారా, లేదా ఇతరత్రా వక్ఫ్‌గా ప్రకటించబడిన ఆస్తుల కేటగిరీ కూడా ఇందులోకి వస్తుంది. ''పార్లమెంటు ఆమోదించిన శాసనంతో కోర్టు సాధారణంగా జోక్యం చేసుకోదు. అయితే మినహాయింపులున్నాయి. వక్ఫ్–బై–యూజర్ ఆస్తులను డీనోటిఫై చేస్తే ''చాలా పెద్ద సమస్య''కు దారితీస్తుంది. బ్రిటిష్‌వారు రాకముందు మనకు భూమి రిజిస్ట్రేషన్ చట్టం లేదా ఆస్తి బదలాయింపు చట్టం లేదు. మసీదుల్లో అనేకం 14వ, 15వ, 17వ శతాబ్దాల్లో నిర్మించబడినాయి. రిజిస్టర్డ్ విక్రయపత్రం చూపించమని ఇప్పుడు వారిని అడిగితే అది అసాధ్యం. జామా మసీదు అటువంటిదే'' అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. 2025 సవరణ చట్టానికి ముందున్న వక్ఫ్ చట్టాల్లో 'వక్ఫ్–బై–యూజర్'ని స్థిరపరిచినపుడు దాన్ని ఇప్పుడు చెల్లుబాటు కాకుండా చేయవచ్చునా అని చీఫ్ జస్టిస్ ఖన్నా, కేంద్రప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రశ్నించారు.

రెండు, ఒక ఆస్తి వక్ఫ్‌నా లేక ప్రభుత్వ ఆస్తినా అనే విషయాన్ని ప్రభుత్వాధికారి పరిశీలించటాన్ని అనుమతిస్తూనే, ఆ ఆస్తిని ఈలోపు వక్ఫ్ ఆస్తిగా ఉపయోగించటాన్ని ఆపుచేసే సంబంధిత నిబంధనను స్టే చేస్తాం. మూడు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, వక్ఫ్ బోర్డుల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ముస్లింయేతరులను నియమించటాన్ని అనుమతిస్తాం – అయితే మిగతా సభ్యులంతా ముస్లింలు అయిఉండాలి. అయితే తమ వాదనలు వినిపించేందుకు మరింత సమయం కావాలని తుషార్ మెహతా కోరటంతో తాత్కాలిక ఉత్తర్వు, లేదా ప్రభుత్వానికి నోటీసు ఇవ్వకుండా కేసు విచారణ గురువారానికి వాయిదా పడింది. అయితే అఫిడవిట్ దాఖలుకు ప్రభుత్వానికి మరింత సమయం కావాలని సొలిసిటర్ జనరల్ గురువారం కోరటంతో ధర్మాసనం వారంరోజుల వ్యవధి ఇచ్చింది. కేసు విచారణను మే 5వ తేదీకి వాయిదా వేసింది. అంతవరకు యథాతథ స్థితిని ఆదేశించింది. మే 13వ తేదీన సంజీవ్ ఖన్నా రిటైర్ అవుతున్నారు. కాబట్టి ఆలోపు పూర్తి తీర్పు రాకపోయినా తాత్కాలిక ఉత్తర్వు అయినా రావచ్చు.


మోదీ ప్రభుత్వం రిజిస్టర్డ్ పత్రాలు లేవన్న పేరుతో వక్ఫ్–బై–యూజర్‌గా ఉన్న ఆస్తులను డీనోటిఫై చేసి స్వాధీనం చేసుకోవటానికి తొందరపడుతున్నది. రైల్వేలు, ఆర్మీ వంటి వ్యవస్థల తర్వాత వక్ఫ్‌ల కిందనే 8లక్షల ఎకరాల భూమి ఉన్నందున, దాన్ని సంపన్న ముస్లింలు అనుభవిస్తున్నారనే సాకుతో వాటిని ముస్లింలకు లేకుండా చేయాలని చూస్తున్నది. వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిం యేతరులను నియమిస్తామని సవరణ చట్టంలో చెప్పిన మోదీ ప్రభుత్వం హిందూ దేవాదాయ–ధర్మాదాయ సంస్థల్లో ముస్లింలను నియమిస్తారా అనే ప్రశ్నకు జవాబుదాటవేస్తోంది. చట్టం వివక్షత దాని ముఖం మీదనే కనిపిస్తోంది.

## భూదానోద్యమానికి 75 ఏళ్లు



భూదాన్ ఉద్యమం ద్వారా భారతదేశమంతా పాదయాత్ర చేసి, గాంధేయ విధానాలను సామాన్య జీవన స్థిరత్వానికి జతపరచాలని ఒక ధృఢ సంకల్పంతో 1951, ఏప్రిల్ 18న స్వచ్ఛంద భూదాన ఉద్యమానికి నాంది పలికారు ఆచార్య వినోబా భావే. 75 ఏళ్ళ క్రితమే భారతదేశ సర్వ సామాన్య ప్రజల స్థితిగతులను అంచనా వేయగలిగిన ఆయన మేథస్సు చాలామంది సామాన్య ప్రజల జీవితా లను ఆర్థిక స్థిరత్వం వైపు నడిపించగలిగింది. గాంధేయ విధానాలను గ్రామ గ్రామానికి చేర్చగలిగింది. భారతదేశ వ్యాప్తంగా వ్యక్తిత్వ వికాసానికి, సర్వోదయ వికాసానికి చెక్కు చెదరని పునాదులు వేసింది. భూమిలేని నిరుపేదలకు అండగా, భూస్వాముల హృదయాలను కదిలించే దండుగా ఆచార్య వినోబా భావే తెలంగాణలోని శివరాంపల్లి నుంచి భూదాన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ శిగలోని ఒక మారుమూల పల్లె పోచంపల్లి భూదాన్ పోచంపల్లిగా భారతదేశ శిగలో చేరిన రోజు.. పోచంపల్లి జమీందార్ శ్రీ వెదిరే రామచంద్రా రెడ్డి దాతృత్వంతో భూమిలేని నిరుపేదలకు పంచమని తన నూరెకరాల భూమిని తొట్ట తొలి భూదానంగా వినోబాజీకి అందజేశారు. భూమికోసం, భుక్తికోసం మహోద్యమంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అనంతరకాలంలో వినోబా భావె భూదోనోద్యమానికి శ్రీకారం చుట్టారు. అయితే ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థ పట్టుసడలలేదు.

## అమెరికా దిగ్బంధం నడుమ అద్భుత దేశం క్యూబా



కె.శ్రీనివాస్ రెడ్డి
చైర్మన్,
తెలంగాణ మీడియా అకాడెమీ

క్యూబా రాజధాని హవానాలో 2025 మార్చి 17 నుండి 19 వరకు జరిగిన నాలుగవ అంతర్జాతీయ జర్నలిస్టుల సమావేశంలో భారతదేశం నుంచి నాతో పాటు (వ్యాసకర్త), డాక్టర్ బాలచంద్ర కాంగోను ఆహ్వానించారు. 'టెలిసూర్' అనే టెలివిజన్ ఛానెల్ ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు జోస్ మార్టి ప్రారంభించిన 'పాట్రియా' అనే వార్తాపత్రిక ప్రచురణ ప్రారంభించి 133 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల నుండి 400 మందికి పైగా పాత్రికేయులు హాజరవడం ద్వారా ఈ ఉత్సవం విజయవంతంగా జరిగింది. భారతదేశంతో పాటు చైనా, వియత్నాం, రష్యా, కజకిస్తాన్, స్పెయిన్, బెల్జియం, నైజీరియా, దాదాపు అన్ని లాటిన్ అమెరికా దేశాల నుండి పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ), రోబోటిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కొత్త సాంకేతిక పురోగతులు సృష్టించే సవాళ్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. క్యూబా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్ కానెల్ బెర్ముడెజ్ ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు హాజరయ్యారు. హవానా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. 1925లో హత్యకు గురైన కమ్యూనిస్ట్ యువ నాయకుడు 'మెల్లా' జ్ఞాపకార్థం ఒక స్మారక చిహ్నం ఏర్పాటు చేసిన యూనివర్సిటీ స్క్వేర్ వద్ద ప్రారంభోత్సవం జరిగింది. నయా వలసవాదం, సామ్రాజ్యవాదం, నిజమైన ప్రజాస్వామ్యంపై పోరాటం ఇంకా కొనసాగుతోందని, విజయం సాధించడానికి అనేకమంది వీరోచిత త్యాగాలు అవసరమని ఇది గుర్తు చేసింది.

నేను డిజిటల్ యుగంలో నిజాన్ని కనుగొనడం : తప్పుడు సమాచారం, మీడియా మార్పులతో ఘర్షణ (ఎంబ్రేసింగ్ ట్రూత్ ఇన్ ఎ డిజిటల్ ఏజ్ : కాన్‌ఫ్రాంటింగ్ డిస్‌ఇన్ఫర్మేషన్ అండ్ మీడియా



హవానాలో జరిగిన నాలుగవ అంతర్జాతీయ జర్నలిస్టుల సమావేశంలో పాల్గొన్న పాత్రికేయులతో వ్యాసకర్త

షిఫ్ట్స్) అనే అంశంపై పత్రాన్ని సమర్పించాను. ఈ సందర్భంగా క్యూబా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్ కానెల్ బెర్ముడెజ్‌తో కలిసి, చర్చించే అవకాశం లభించింది.

### అమెరికా నకిలీ వార్తలను ఎదుర్కొనేందుకు స్పానిష్ ఛానల్

ప్రపంచవ్యాప్తంగా స్పానిష్ మాట్లాడే ప్రజలను, ప్రత్యేకించి దక్షిణ అమెరికా, మెక్సికో దేశాలలోని వారికి చేరుకోవాలనే ఆలోచనతో స్పానిష్ భాషలో 'టెలిసూర్' అనే టివి ఛానెల్‌ను ప్రారంభించారు. ఇది వెనిజులా అధ్యక్షుడు చావెజ్, క్యూబానేత ఫిడెల్ కాస్ట్రో ఆలోచనకు అనుగుణంగా 20 సంవత్సరాల క్రితం క్యూబా ఆచరణలోకి తీసుకువచ్చింది. అమెరికా ప్రజలను గందరగోళానికి గురిచేయడానికి యుఎస్ ప్రభుత్వం సృష్టించిన బూటకపు సామ్రాజ్యవాద అనుకూల వార్తలు, ప్రచారాన్ని ధీటుగా ఎదుర్కోవడంలో ఇది విజయవంతంగా పనిచేస్తోంది. అమెరికా దిగ్బంధం కారణంగా అనేక కష్టాలను ఎదుర్కొంటున్న క్యూబా ప్రజలు స్వేచ్ఛ, గౌరవం కోసం పోరాడటానికి, అమెరికా దాడుల నుండి చాలా భిన్నమైన సామ్యవాద ఆర్థిక వ్యవస్థను పరిరక్షించడానికి దృఢంగా ఉండడాన్ని మనం అభినందించాలి.

ఎవరైనా క్యూబాను సందర్శించినప్పుడు వినిమయ సంస్కృతి అసలే కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అక్కడ విద్య, వైద్యం అందరికీ ఉచితం. హవానా నగరంలో ఒక్క భిక్షాటన చేసే వ్యక్తి లేదా నిరాశ్రయుడు మాకు కనిపించలేదు. ప్రజలు సామాన్య జీవితాన్ని గడుపుతూ సంతోషంగా జీవిస్తున్నారు. హవానా విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో మేము మాట్లాడినప్పుడు మరో 100 సంవత్సరాలు కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామే తప్ప స్వేచ్ఛ, గౌరవాన్ని మాత్రం వదులుకోలేమని మాతో సూటిగా చెప్పారు. దిగ్బంధం కారణంగా విద్యుత్ కొరత ఉంది. చాలా మౌలిక సదుపాయాలకు మరమ్మతులు లేదా మార్చడం అవసరం. ఆ పని దిగ్బంధం కారణంగా చేయలేకపోతున్నారు. అయితే, చైనా సహాయంతో క్యూబన్లు రెండు మూడేళ్ళలో సౌరశక్తి నుండి తమ విద్యుత్ అవసరాలలో 40 శాతానికి పైగా తీర్చుకోవాలని యోచిస్తున్నారు. ఇది ఆ ప్రజలకు గొప్ప ఉపశమనం కలిగిస్తుంది.

### సగానికి పైగా పార్లమెంటు సభ్యులు మహిళలే!

జాత్యాహంకారం లేకపోవడం అభినందించదగిన విషయం. ఎందుకంటే జనాభాలో60 శాతానికి పైగా నల్ల జాతీయులే. మేము వెళ్ళిన ప్రతిచోటా తెల్లవారు, నల్లవారు కలిసి తిరుగుతూ, కలిసి తింటూ, ఆనందంగా, స్నేహంగా ఉండటాన్ని గమనించాము. మహిళా సాధికారతలో క్యూబా అత్యంత ముందున్నది. మహిళలు క్యూబాలో అనుభవించే భద్రత,స్వేచ్ఛ సాటిలేనివి. మొత్తం 630 మంది పార్లమెంటు సభ్యులలో 54 శాతానికి పైగా మహిళలే. అలాగే 51 శాతానికి పైగా యువత ఉన్నారు. మహిళలకు క్యూబా అత్యంత సురక్షితమైన దేశమని మాకు చెప్పారు. క్యూబాలో 100 శాతం అక్షరాస్యత ఉంది. వాస్తవానికి 1959లో విప్లవం సంభవించిన వెంటనే, కళాశాల విద్యార్థులందరినీ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. దాని ఫలితమే నూరు శాతం అక్షరాస్యత. హవానా విశ్వవిద్యాలయంలో 50,000 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. వాస్తవానికి లాటిన్ అమెరికా దేశాల నుండి వచ్చిన చాలామంది స్పానిష్ మాట్లాడే విద్యార్థులు హవానాలో చదవడానికి ఇష్టపడతారు. ఎందుకంటే అక్కడ విద్య ఉచితం. లాటిన్ అమెరికా నుండి వచ్చి చదువుకోవడానికి క్యూబా ప్రభుత్వం కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

వైద్యరంగంలో క్యూబా సాధించిన పురోగతి ప్రపంచం నలుమూలల నుండి ప్రజలను ఆకర్షిస్తోంది. క్యూబా వైద్యులు అవసరమైన వారికి, సంక్షోభ సమయంలో సహాయం చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్తారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం నెలకొన్నప్పుడు, క్యూబా వైద్యులు గొప్ప సహాయం చేశారు. క్యూబా వైద్యులు వెనిజులాలోని గ్రామీణ ప్రాంతాల్లో చమురు కోసం సహాయం చేయడానికి 'డాక్టర్స్ ఫర్ ఆయిల్' అనే పథకాన్ని నిర్వహిస్తున్నారు. ఇది క్యూబాకు చాలా అవసరం. యునెస్కో, ప్రపంచ ఆరోగ్య సంస్థ వైద్యంలో క్యూబా సాధించిన పురోగతిని ప్రశంసించాయి. సంక్షోభ సమయంలో అమెరికాకు సైతం క్యూబా సహాయం చేసింది. ఇంతచేసినప్పటికీ కరోనా సమయంలో అవసరమైన శ్వాసకోశ యంత్రాల ఎగుమతిని అమెరికా దిగ్బంధం నిరోధించింది.

### భారతదేశంపై అభిమానం

క్యూబా విప్లవం ప్రాథమికంగా జాతీయవాద విప్లవం. కానీ ఆ సమయంలో ప్రబలంగా ఉన్న అంతర్జాతీయ పరిస్థితి కారణంగా అమెరికా సామ్రాజ్యవాద పథకాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ విప్లవ ప్రక్రియలో భాగమైంది. తద్వారా సామ్యవాద కూటమిలో భాగమైంది. సోషలిస్టు సోవియట్ కూటమి పతనం చెందడంతో క్యూబా కూడా పతనం అవుతుందని అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది భావించారు. కానీ అది సంభవించలేదు. అనంతరం ఫిడెల్ కాస్ట్రో మరణం తర్వాత అది పతనం అవుతుందని చాలా మంది భావించారు, కానీ అది కూడా జరగలేదు. దీనికి కారణం క్యూబా ప్రజల సాహసోపేత ప్రతిఘటన, స్వేచ్ఛ పట్ల ప్రేమ. అలీన ఉద్యమంలో క్యూబా, భారతదేశం సత్సంబంధాలను కలిగి ఉన్నాయి. వాస్తవానికి 1982లో ఫిడెల్ కాస్ట్రో ఢిల్లీలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీకి అలీన ఉద్యమ అధ్యక్ష పదవిని అప్పగించారు. క్యూబా ప్రజలు ఇప్పటికీ దానిని గుర్తు చేసుకుంటారు. ప్రజలు మమ్మల్ని కలిసినప్పుడల్లా ఆ సంబంధం గురించి మాకు గుర్తు చేశారు. క్యూబాకు అంతర్జాతీయ మద్దతు, సహకారం అవసరం. అంతర్జాతీయ మద్దతు ద్వారా క్యూబన్లు ఇప్పటివరకు అమెరికా దురాక్రమణను ప్రతిఘటించారు. అధ్యక్షుడు ఒబామా పాలనలో పది లక్షల మందికి పైగా అమెరికన్ పర్యాటకులు క్యూబాను సందర్శించారు. నిజమైన క్యూబా గురించి తెలుసుకున్నారు. అయితే డొనాల్ ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఇదంతా ఆగిపోయింది. క్యూబాపై కఠినమైన విధానాన్ని అవలంభిస్తున్నారు. సంక్షోభంలో ఉన్న క్యూబాకు సహాయం చేయడానికి అనేక భారతీయ ప్రజా సంఘాలు నిధులను సేకరిస్తున్నాయి. క్యూబన్‌ల సగటు ఆయుర్దాయం సుమారు 79.5 సంవత్సరాలు, పురుషులు సగటున 76 సంవత్సరాల వరకు, మహిళలు 81 సంవత్సరాల వరకు జీవిస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను పరిగణనలోకి తీసుకుంటే ఇది ఆకట్టుకుంటుంది. తలసరి ఆదాయం విషయానికొస్తే, క్యూబా సగటు ఆదాయం సంవత్సరానికి 9,010 డాలర్లు. అయితే, క్యూబాలో జీవనవ్యయం చాలా తక్కువగా ఉంటుందని గమనించడం ముఖ్యం.

అమెరికాతో సంబంధాల విషయానికొస్తే, క్యూబా, యునైటెడ్ స్టేట్స్ మధ్య సంబంధాల చరిత్ర సంక్లిష్టమైంది. 1959లో క్యూబా విప్లవం నాటి నుంచి ఉభయ దేశాలు ఘర్షిస్తున్న ధృవాలు. ఇది అమెరికా వాణిజ్య దిగ్బంధానికి దారితీసింది. గత ప్రభుత్వం చివరి రోజుల్లో సడలించిన ఆంక్షలను ట్రంప్ అధ్యక్షుడయ్యాక రద్దు చేసి,



క్యూబా అధ్యక్షుడు మిగ్యూల్ డియాజ్-కానెల్ బెర్ముడెజ్‌తో కె.శ్రీనివాస్ రెడ్డి

క్యూబాపై కఠినమైన ఆంక్షలు విధించారు. ఇక్కడ కీలకమైన పరిణామాలు ఉన్నాయి. ఉగ్రవాద ప్రాయోజిత రాజ్యంగా క్యూబాను తిరిగి జాబితాలో చేర్చారు. దీంతో అమెరికా ఎగుమతులపై కఠినమైన నియంత్రణలు, విదేశీ సహాయంపై ఆంక్షలు, అమెరికా వీసాకు కఠినమైన నిబంధనలు , క్యూబా అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలపై స్తంభన వంటివి జరిగాయి. 'పరిమిత జాబితా' పునరుద్ధరణ ద్వారా



231 సంస్థలతో లేదా ప్రభుత్వ సంబంధిత సంస్థలతో వ్యాపారం చేయడం నుండి అమెరికా కంపెనీలు, వ్యక్తులను నిషేధిస్తుంది. క్యూబాలో, కనీసం 16 ఏళ్ళు వయస్సు ఉన్న పౌరులకు ఓటు హక్కు లభిస్తుంది. అంటే క్యూబన్ లు 16 సంవత్సరాలు నిండిన తర్వాత, తమ దేశ ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాల్గొనడానికి అర్హులు. వివాహ వయస్సు విషయానికొస్తే, ఇది కొంచెం సంక్లిష్టంగా ఉంటుంది. క్యూబా చట్టం ప్రకారం, అమ్మాయిలు 14 సంవత్సరాల వయస్సులోనే వివాహం చేసుకోవచ్చు. అయితే అబ్బాయిలు కనీసం 16 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. వారు ఉభయపక్షాల తల్లిదండ్రుల సమ్మతిని పొందాలి. కొన్ని సందర్భాల్లో న్యాయపరమైన ఆమోదం కూడా అవసరం కావచ్చు!

### 66 ఏళ్ళుగా కమ్యూనిస్టు పాలనలోనే

క్యూబా చరిత్రలో ఈ ప్రాంతాన్ని వివిధ శక్తులు పాలించాయి. 1492లో క్రిస్టోఫర్ కొలంబస్ రాకపూర్వం ఈ ద్వీపంలో టైనో, సిబోనీ సహా స్వదేశీ ప్రజలు నివసించారు. కొలంబస్ రాకతో, క్యూబాను స్పెయిన్ జయించి హవానాలో స్పానిష్ గవర్నర్లను నియమించింది. 1898లో స్పానిష్–అమెరికన్ యుద్ధం వరకు స్పెయిన్ దాదాపు నాలుగు శతాబ్దాల పాటు క్యూబాను పాలించింది. యుద్ధం తరువాత స్పెయిన్ ఆ ద్వీపం నుండి వైదొలిగింది! స్పెయిన్ వైదొలిగిన తర్వాత, 1902లో అధికారిక స్వాతంత్ర్యం పొందే వరకు క్యూబా మూడున్నర సంవత్సరాలు అమెరికా సైనిక పాలనలో ఉంది. 1959లో ఫిడెల్ క్యాస్ట్రో నేతృత్వంలోని విప్లవం నియంత ఫుల్జెన్సియో బాటిస్టా పాలనను కూలద్రోసి సోవియట్ యూనియన్ సహకారంతో సామ్యవాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నాటి నుండి క్యూబాను క్యూబా కమ్యూనిస్ట్ పార్టీ పరిపాలిస్తున్నది. ఫిడెల్ కాస్ట్రో ప్రధానమంత్రిగా, తరువాత అధ్యక్షుడిగా, ఆ తరువాత అధ్యక్షుడిగా ఆయన సోదరుడు రాల్ కాస్ట్రో , ప్రస్తుతం మిగ్యూల్ డియాజ్ కానెల్ ఉన్నారు. క్యూబా స్వదేశీ ప్రజలు, స్పానిష్ వలసవాదులు, ఆఫ్రికన్ బానిసలు, అమెరికన్ పెట్టుబడిదారుల ప్రభావాలతో కూడిన సంక్లిష్టమైన చరిత్రను కలిగి ఉంది. క్యూబా సంస్కృతి ఆఫ్రికన్, స్పానిష్, స్వదేశీ సంస్కృతుల ప్రత్యేక సమ్మేళనం. క్యూబా విప్లవం జరిగిన వెంటనే పౌరుల శ్రేయస్సు, అభివృద్ధికి విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యతను గుర్తించి వాటికి ప్రాధాన్యతనిచ్చింది. క్యూబా తన వైద్య పరిశోధనలకు, ముఖ్యంగా బయోటెక్నాలజీ , ఔషధాల రంగాలలో కూడా గుర్తింపు పొందింది.

## బిజెపి కట్టడికి 'లౌకిక కూటమి' తప్పదా?



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

కమ్యూనిస్టు పార్టీలకు,మావోయిస్టుల కార్యకలాపాలకు, ప్రజాఉద్యమాలకు,సాయుధ పోరాటాలకు దేశంలోనే తెలంగాణ భూభాగానికి ఒక ప్రత్యేకత ఉన్నది. కానీ ఈ ప్రాంతాల్లో 'కరసేవకులు' పెరిగిపోతుండటం ప్రజాస్వామికవాదులందరినీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆర్‌ఎస్ఎస్ తదితర సంస్థలు కాలికి బలపం కట్టుకొని విస్తృతంగా క్షేత్రస్థాయిలో ప్రచారం సాగిస్తున్నవి. 'హిందుత్వ' వాదాన్ని, దేశభక్తిని జనంలోకి తీసుకువెడుతున్నవి. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ప్రత్యామ్నాయమని ప్రత్యక్షం గా, పరోక్షంగా జనంలో బలంగా నాటుతున్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు ప్రతి ఓటరును టచ్ చేస్తున్నట్టు గ్రామీణప్రాంతా ల నుంచి సమాచారం అందుతున్నది. సంపన్న వర్గాల పార్టీగా, అగ్రవర్ణాల ప్రతినిథిగా, మతతత్వ పార్టీగా ముద్ర ఉన్న బిజెపి ఎస్.సీ, ఎస్.టి, బిసి వర్గాల ఓటర్లను ఆకట్టుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఉత్తర భారతదేశంలో ఫలించాయని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నవి. ఇక దక్షిణాది వైపు బిజెపి 'ట్రిగ్గర్' కనిపిస్తోంది.

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పలు చోట్ల ఇంటి గోడల పై 'జై శ్రీరామ్' నినాదం కనిపిస్తోంది. సంఘ్ పరివార్, బిజెపి పుంజుకునేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. బిజెపిని కట్టడి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదలతో కనిపిస్తున్నారు. గుజరాత్ ఎఐసిసి సమావేశాల్లోనూ ఆయన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పట్టాయి. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే బిజెపితో తలపడడం వల్ల అంతగా ప్రయోజనం చేకూరకపోవచ్చు.లెఫ్ట్ పార్టీలు, ఇతర ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో 'ఐక్య సంఘటన' నిర్మించవలసిన అవసరమున్నది. ఇప్పటికీ తెలంగాణలో బిజెపిని అధికారంలోకి తీసుకురాగల నాయకత్వాన్ని ఆ పార్టీ ఏర్పర్చుకోలేకపోతోంది. రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడంవల్లనో, భావోద్వేగాలను సృష్టించడంవల్లనో లభించే విజయాలు ఎప్పటికైనా తాత్కాలికమే. బిజెపి విషయంలో బిఆర్ఎస్ పార్టీలో అంతర్గతంగా విభేదాలున్నట్టు ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ వర్గాలు చెబుతున్నవి.

కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని ప్రధాన శత్రువుగా ఖరారు చేసుకున్నందున, బిజెపి వ్యవహారంలో 'గోడ మీది పిల్లి' వలె బిఆర్ఎస్ పనిచేస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు బిజెపి తమ ప్రత్యర్థి అని కెసిఆర్ భావించారు. కానీ పరిస్థితులు అనూహ్యంగా మారిపోయి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ శరవేగంగా పుంజుకొని బిజెపిని 'ఓవర్ ఓవర్ చేసి కెసిఆర్‌తో ముఖాముఖి తలపడింది. అలాగే 2028 నాటికి రాజకీయ పరిణామాలు ఎటువంటి మలుపు తీసుకుంటాయో, ఎవరు ఎవరితో జట్టు కడతారో, ఎవరు ఏ బృందంలో చేరతారో ఇప్పుడే నిర్ధారణకు రాలేం.

''మేము వచ్చే ఎన్నికల్లో సింగిల్ గానే అధికారంలోకి వస్తాం'' అని పదిహేను రోజుల కిందట కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు కాకతాళీయం కాదు. 'సింగిల్' అనే మాట వాడడంలోనే ఏదో గూఢార్థం ఉన్నది. బిజెపితో అవగాహన కుదుర్చుకునే అవకాశం ఉందనో, రెండు పార్టీల మధ్య పొత్తు ఖాయమనో గడచిన ఏడాదికాలంగా ప్రచారం జరుగుతోంది. ఆ ప్రచారాన్ని తోసిపుచ్చడానికే, 'ఒంటరిగా'నే అధికారంలోకి వస్తామని కెసిఆర్ అంటున్నారు. కానీ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు ఎక్కువ. ఆంధ్రప్రదేశ్ లో టిడిపి, బిజేపీ, జనసేన కూటమి ఏర్పడుతుందని ఎవరు ఊహించారు? తెలంగాణలో రేవంత్ రెడ్డి వంటి వ్యక్తి కెసిఆర్ లాంటి పర్వతాన్ని పడగొడతారన్నది ఊహించని సంగతి. కనుక ఏ క్షణాన రాజకీయాల్లో ఎలాంటి 'ఉపద్రవం' వచ్చిపడుతుందో, అది ఏ రూపంలో ఉంటుందో ఊహించలేం.

ఉత్తర తెలంగాణ ఒకప్పుడు మావోయిస్టుల కోట. ఉద్యమాల పురిటి గడ్డ. జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి వంటివి ఎన్నో చారిత్రక సన్నివేశాలు మన కండ్లముందు ప్రత్యక్షమవుతాయి. అయితే కమ్యూనిజం స్థానంలో కాషాయ దళం చిగురు తొడుగుతోంది! ఉత్తర తెలంగాణ 'కాషాయ రంగు' పులుముకుంటున్నట్టు కనబడుతున్న దృశ్యాలు వామపక్ష భావజాల వ్యక్తులు, శక్తులను, ప్రజాస్వామిక వాదులను కలవరపరుస్తోంది.క్రమక్రమంగా బిజెపి పట్టు సాధిస్తోందన్న ఒక వాతావరణం ఏర్పడుతోంది. తెలంగాణ అవతరణ తర్వాత 2014ఎన్నికల్లో టిడిపితో పొత్తు పెట్టుకొని బిజెపి పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో ఐదు స్థానాలను గెలుచుకుంది. ఇవన్నీ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే.

2018 ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా 119 స్థానాల్లోనూ బిజెపి ఒంటరిగా బరిలోకి దిగింది.105 స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కలేదు. హైదరాబాద్ గోషామహల్‌లో మాత్రమే విజయం సాధించింది. అప్పటివరకూ హైదరాబాద్, చుట్టుపక్కల మాత్రమే ప్రాబల్యం కలిగిన బిజెపి పరిస్థితి 2023 ఎన్నికలనాటికి మారిపోయింది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపి విజయం సాధించింది. మరో 18 అసెంబ్లీ స్థానాల్లో

> ఉత్తర తెలంగాణ ఒకప్పుడు మావోయిస్టుల కోట. ఉద్యమాల పురిటి గడ్డ. జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి వంటివి ఎన్నో చారిత్రక సన్నివేశాలు మన కండ్లముందు ప్రత్యక్ష మవుతాయి. అయితే కమ్యూనిజం స్థానంలో కాషాయ దళం చిగురు తొడుగుతోంది! ఉత్తర తెలంగాణ 'కాషాయ రంగు' పులుముకుంటున్నట్టు కనబడుతున్న దృశ్యాలు వామపక్ష భావజాల వ్యక్తులు, శక్తులను, ప్రజాస్వామిక వాదులను కలవరపరుస్తోంది.


రెండో స్థానంలో, మరికొన్ని స్థానాల్లో మూడో స్థానంలో నిలిచింది.40 అసెంబ్లీ స్థానాల్లో డిపాజిట్లు దక్కించుకుంది. 2023 ఎన్నికల్లో అత్యధికం ఉత్తర తెలంగాణలో గెలిచారు. సిర్పూర్, ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, ఆర్మూర్, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల్లో కాషాయ జెండా ఎగరడం కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు దిగ్భ్రాంతి కలిగించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఒక్క గోషా మహల్‌లో మాత్రమే గెలిచింది. ఈసారి బిజెపి తన ఓటు బ్యాంకును కూడా గణనీయంగా పెంచుకుంది. 2018లో కేవలం 6.98 శాతం ఓట్లు సాధించిన బిజెపి, 2023 ఎన్నికల్లో 13.90 శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది. బిజెపి అభ్యర్థులు గెలుపొందిన నిర్మల్‌లో 44 శాతం ఓటింగ్, ఆర్మూర్‌లో 31 శాతం, సిర్పూర్‌లో 30 శాతం వచ్చాయి. హుజూరాబాద్, గజ్వేల్ సహా మరో 12 నియోజకవర్గాల్లో బిజెపి 20 శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది.

గిరిజన ప్రాంతాల్లో బిజెపి పాగా వేయడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గతంలో మావోయిస్టులకు బాగా పట్టున్న ప్రాంతాల్లో బిజెపి, దాని అనుబంధ సంస్థలు చాప కింద నీరులా విస్తరించాయి. ఊరూరా ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. బిసి సామాజిక వర్గాలను,యువతను తమ వైపు తిప్పుకోవడంలో బిజెపి సక్సెస్ అవుతోంది. ప్రతి గ్రామంలో హనుమాన్ ఆలయాలు, వ్యాయామ శాలలను ఏర్పాటు చేశారు. ఆర్‌ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ పూర్వీకుల స్వస్థలం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి కావడంతో గత దశాబ్దకాలంలో చాలామంది యువత ఆర్‌ఎస్ఎస్ భావజాలం పట్ల ఆకర్షితులవుతున్నట్టు తెలిసింది.

2014కు ముందు తెలంగాణలో ఆర్‌ఎస్ఎస్ శాఖలు 1600 దాకా ఉండగా ప్రస్తుతం 3 వేలకు పైగా పెరిగినట్టు ఆర్‌ఎస్ఎస్ సభ్యులు చెబుతున్నారు. హిందుత్వ భావజాల వ్యాప్తిలో సరస్వతి విద్యామందిర్‌లు, శిశుమందిర్‌లు కీలక పాత్రను పోషిస్తున్నాయి. అడవుల్లో విశ్వ హిందూ పరిషత్ కు అనుబంధంగా పనిచేస్తున్న వనవాసీ కల్యాణ పరిషత్ సంఘాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి. ముస్లిం మైనారిటీలు ఎక్కువగా ఉండే హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో బిజెపి బలపడుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నవి. క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమావేశాలు తరచూ నిర్వహిస్తూ 'క్యాడర్'ను బలోపేతం చేస్తున్నారు. కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉండటం పార్టీ విస్తరణలో తమకు సానుకూల పరిస్థితులు ఏర్పడినట్టు బిజెపి నాయకులంటున్నారు.

దేశమంతటా హిందూత్వ ప్రయోగం ముందుకు సాగుతున్నట్లు కనపడుతున్నప్పటికీ కర్ణాటకలో మాత్రం లింగాయత్‌ల అదుపులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్టీలో ఉన్న అంతర్గత పోరాటాన్ని అధిష్ఠానం అరికట్టలేకపోతోంది. యడ్యూరప్పను, ఆయన కుమారుడు విజయేంద్రను మచ్చిక చేసుకునేందుకుగాను బలమైన ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్‌ను పార్టీ నుంచే బహిష్కరించారు. బిజెపికి కర్ణాటకలో భవిష్యత్ లేదని త్వరలో ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని యత్నాల్ ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అప్రతిష్ఠపాలు చేసేందుకు ముడా కుంభకోణాన్ని లేవనెత్తి, ఇడిని ప్రయోగించినా బిజెపి విజయవంతం కాలేకపోయింది. సంఘ్ హేమాహేమీలు దత్తాత్రేయ హోసబలె, సిఆర్ ముకుంద్, ప్రస్తుతం జాతీయ స్థాయిలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్, హెచ్‌వి శేషాద్రి, పద్మనాభాచార్య తదితరులు ఆ రాష్ట్రానికి చెందినవారే. ఒకప్పటి సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ కూడా మైసూరుకు చెందినవారే. నిజానికి మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అగ్రశ్రేణి సంఘ్ నేతలు కర్ణాటక నుంచే వచ్చారు. కాని అదే కర్ణాటకలో ఇప్పుడు బిజెపి రాజకీయ భవిష్యత్తు డోలాయమాన పరిస్థితిలో ఉన్నది. సంతోష్ జీ వల్లే దక్షిణాదిలో బిజెపి దెబ్బతిన్నదని విమర్శలున్నాయి.

1947లోనే గోల్వాల్కర్ హైదరాబాద్‌కు రహస్యంగా వచ్చారు.1949లో శ్రీరాంసాథే ఆర్‌ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రారంభించారు. నృపతుంగ, కేశవ మెమోరియల్ లాంటి విద్యాసంస్థలను సంఘ్ అభిమానులను ప్రారంభించారు. నక్సల్బరీ ఉద్యమానికి పోటీగా 1967లోనే ఎబివిపి ఏర్పడింది. తొలి ఎబివిపి విద్యార్థి సదస్సు 1967 జూలైలో జరిగింది. క్రమంగా ఎబివిపి తెలంగాణలోని అనేక కాలేజీల్లో బలపడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ భావజాలం బలంగా ఉండడం వల్ల జనసంఘ్ ఉనికి ఏర్పర్చుకోలేకపోయింది.1983 నుంచి తెలుగుదేశం బలమైన ప్రాంతీయ పార్టీగా ఏర్పడడంతో బిజెపి నిలదొక్కుకోలేకపోయింది. తెలంగాణలో ప్రతిపక్ష స్థానంలోకి వెళ్ళిపోయిన బిఆర్ఎస్ త్వరలోనే పూర్తిగా ''బలహీనపడిపోతుంద''ని ఇటీవల తెలంగాణ బిజెపి నాయకులతో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా అన్నారు.''మీరంతా కలిసికట్టుగా పనిచేస్తే తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడం తథ్యం'' అని కూడా షా వ్యాఖ్యానించినట్టు వార్తలు వచ్చాయి.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఆటోను ఢీకొన్న బస్సు.. ఆరుగురు మృతి

**పటాన్ (గుజరాత్) :** గుజరాత్‌లోని పటాన్ జిల్లాలో గురువారం రాష్ట్ర రవాణా బస్సును ఆటో ఢీకొనడంతో ఆటోరిక్షాలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. సమీరధన్‌పూర్ హైవేపై సమీ గ్రామ సమీపంలో ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఒక అధికారి తెలిపారు. రాష్ట్ర రవాణా బస్సు హిమ్మత్‌నగర్ నుండి కచ్ వైపు వెళ్తుండగా, ఆటో ఎదురుగా వస్తోందని పటాన్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వికె నయా తెలిపారు. డ్రైవర్‌తో సహా ఆటోరిక్షాలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారని నయా చెప్పారు. ప్రాథమిక వివరాల ప్రకారం మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో బస్సు అదుపుతప్పి ఆటోను ఢీకొన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు విచారణ ప్రారంభించినట్లు నయాం తెలిపారు. ప్రమాదం గురించి తెలియగానే ఘటనా స్థలానికి చేరుకున్న రాధన్‌పూర్ ఎమ్మెల్యే, బీజేపీ నేత లవింగ్‌జీ ఠాకూర్, ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు.

# బెంగాల్ టీచర్లకు స్వల్ప ఊరట

## నూతన నియామకాలు చేపట్టేవరకూ ఉద్యోగాల్లో కొనసాగడానికి ‘సుప్రీం’ గ్రీన్‌సిగ్నల్

### మే 31 నాటికి కొత్త నియామకాలు చేపట్టాలని బెంగాల్ ప్రభుత్వానికి ఆదేశం



**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్న 25,753 మంది టీచర్లు, ఇతర సిబ్బంది నియామకం చెల్లుబాటు కాదంటూ ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యవహారంలో కొందరు టీచర్లకు స్వల్ప ఊరట లభించింది. నియామక ప్రక్రియ ద్వారా ఎంపికై, ఎలాంటి ఆరోపణలు లేని, 9–12 తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను కొనసాగించడానికి అనుమతించింది. కొత్త నియామక ప్రక్రియ పూర్తయ్యేవరకు వారు బోధన కొనసాగించొచ్చని చెప్పింది. విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు ఒక డెడ్‌లైన్ విధించింది. మే 31లోగా కొత్త రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం ప్రకటన ఇవ్వాలని ఆదేశించింది. అలాగే ఎంపిక ప్రక్రియ డిసెంబర్ 31లోగా పూర్తికావాలని స్పష్టంచేసింది. దీనికి సంబంధించి మే 31లోగా రాష్ట్ర ప్రభుత్వం, కమిషన్ అఫిడవిట్ దాఖలు చేయాలి అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశాలు జారీ చేశారు. ఇక ఈ స్వల్ప ఊరట గ్రూప్ – సి, గ్రూప్ –డి ఉద్యోగులకు వర్తించదు. టీచర్ల నియమకాన్ని రద్దు చేస్తూ ఈనెల ప్రారంభంలో సుప్రీం తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీరి నియామక ప్రక్రియ యావత్తూ అక్రమాలతో కూడుకొని ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. టీచర్లు, ఇతర సిబ్బంది నియామకాన్ని రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు గత సంవత్సరం ఏప్రిల్‌లో వెలువరించిన తీర్పును సుప్రీం ధర్మాసనం సమర్థించింది. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు, సిబ్బంది ఇప్పటివరకూ తాము పొందిన జీతభత్యాలను తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. మానవీయ కారణాలరీత్యా కొందరు దివ్యాంగులకు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ తీర్పు నుంచి మినహాయింపు ఇచ్చి వారు ఉద్యోగంలోనే ఉంటారని స్పష్టంచేసింది. వివాదాస్పదంగా మారినఈ నియామకాలు 2016లోనే జరిగాయి. అయితే సుప్రీం ఆదేశాలతో పలు పాఠశాలల్లో టీచర్ల కొరత ఏర్పడింది. విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతుందంటూ బెంగాల్ ప్రభుత్వం పిటిషన్ వేసిన నేపథ్యంలో ఈ తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

### తీర్పును స్వాగతించిన మమత

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను స్వాగతించారు. గతంలో నియామకాలు రద్దు చేయబడిన కళంకం లేని ఉపాధ్యాయుల సేవలను పొడిగించడం ఉపశమనం కలిగిస్తుందన్నారు. విద్యావేత్తలు ఆందోళన చెందవద్దని కోరారు. సమస్య పరిష్కారం అవుతుందనిహామీ ఇచ్చారు.

## ‘నరేగా’ కార్మికుల అణచివేత

### మోదీ ప్రభుత్వం పేదల వ్యతిరేకి : ఖర్గే

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా మండిపడ్డారు. మోదీ సర్కార్ పేదల వ్యతిరేకి అని, జాతీయ ఉపాధి హామీ పథకం కార్మికులను అణచితవేతకు పాల్పడుతోందని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ. 400 కూలీ చెల్లించడంతో పాటు, సంవత్సరానికి 150 రోజులు పని కల్పించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను ఖర్గే పునరుద్ఘాటించారు. రెండు ప్యానళ్లు సిఫార్సు చేసినప్పటికీ సాధారణ వార్షిక పెంపుతో పాటు రోజువారీ వేతనం ఈ ప్రభుత్వం గణనీయంగా పెంచే అవకాశం లేదని మీడియా వచ్చిన కథనాలను ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనిబట్టి ఈ పేదల వ్యతిరేక మోదీ ప్రభుత్వం నరేగా వేతనాలను పెంచేందుకు నిరాకరిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. ఈ చర్య ఉపాధి హామీ కార్మికుల హక్కులపై దాడిలాంటిదేనన్నారు. ఇటీవల పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఉపాధిహామీ పథకం కార్మికులకు రోజు వారీ వేతనం రూ. 400లకు పెంచాలని సిఫార్సు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఖర్గే గుర్తుచేశారు. అమర్‌జీత్ సిన్హా నేతృత్వంలో 2023లో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కూడా నరేగా పథకానికి బడ్జెట్‌ను పెంచాలని, వేతనాలు పెంచాలని సూచించింది. కానీ, పేదల వ్యతిరేక మోదీ ప్రభుత్వం నరేగా కార్మికులను అణచివేతకు పాల్పడుతోందని ఖర్గే ఆరోపించారు. ఆధార్ ఆధారిత చెల్లింపు షరతు విధించి దాదాపు ఏడు కోట్ల మంది నమోదిత కార్మికులను పథకం నుండి మినహాయించడం, గత 10 సంవత్సరాలలో మొత్తం బడ్జెట్‌తో పోలిస్తే నరేగాకు అతి తక్కువగా బడ్జెట్‌ను కేటాయించారన్నారు. దీంతో మోడీ ప్రభుత్వం నరేగాపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని ఆయన అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ మన దేశంలోని అత్యంత పేద కుటుంబాల కోసం తీసుకువచ్చిందన్నారు. అయితే ఇప్పుడు కార్మికులకు రోజుకు కనీస వేతనం రూ. 400 నిర్ణయించాలని, వారికి సంవత్సరానికి కనీసం 150 రోజులు పని కల్పించాలనే డిమాండ్లకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

## చోక్సీ అప్పగింతపై బెల్జియంతో భారత్ చర్చలు

**న్యూఢిల్లీ:** ఆర్థిక నేరస్తుడు మెహుల్ చోక్సీని భారత్‌కు అప్పగించే విషయంలో బెల్జియం అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణదీర్ జైశ్వాల్ గురువారం తెలిపారు. ‘భారత ప్రభుత్వ అధికారిక విజ్ఞప్తి మేరకు చోక్సీని బెల్జియం, ఆట్వెప్‌లో శనివారం అరెస్టు చేశారు. అతనిని భారత్‌కు అప్పగించడంపై చర్చలు జరుగుతున్నాయి’ అని జైశ్వాల్ చెప్పారు. దిల్లీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చోక్సి నిర్బంధంలో ఉన్నట్లు బెల్జియం ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ ఆఫ్ జస్టిస్ ధ్రువీకరించిందని చెప్పారు. కాగా, చోక్సీని తమకు అప్పగించాలని భారత్ కోరినట్లు బెల్జియం అధికారులు వెల్లడించారు. చోక్సీ 2018, జనవరి 2న విదేశాలకు తప్పించుకుపోగా, పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.13,850 కోట్ల కుంభకోణానికి సంబంధించిన ఆర్థిక నేరస్తుడిగా అతను ఉన్నాడు. చోక్సీ అరెస్టు తర్వాత అతని తరపు న్యాయవాది విజయ్ అగర్వాల్ స్పందించారు. చోక్సీని భారత్‌కు అప్పగిస్తే ఆయన మానవ హక్కులను ఉల్లంఘించినట్లు అవుతుందని అన్నారు.

# రాహుల్‌గాంధీ మండిపాటు

## లోకో పైలట్ల అమానవీయ పరిస్థితులపై

**న్యూఢిల్లీ :** లోకో పైలట్ల పని పరిస్థితులపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గురువారం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ‘అమానవీయ‘ పరిస్థితుల్లో పనిచేయిస్తూ వారికి అన్యాయం చేయడమే కాకుండా రైళ్లలో ప్రయాణించే కోట్లాది మంది ప్రయాణికుల భద్రతతో ఆడుకుంటున్నారన్నారు. రైల్వేలు విరామం డిమాండ్‌ను తిరస్కరించాయని, మహిళా సిబ్బంది టాయిలెట్ సౌకర్యం లేకుండా ఎనిమిది గంటల డ్యూటీ చేయాల్సి వచ్చిందనిమీడియాతో వచ్చిన కథనాలను రాహుల్‌గాంధీ ఎక్స్‌లో షేర్ చేశారు. గత సంవత్సరం తాను రైల్వే లోకో పైలట్లను కలిసినప్పుడు 14 గంటల షిఫ్టులు, నిరంతర రాత్రి డ్యూటీ, తగినంత విశ్రాంతి లేకపోవడం, ఆహార విరామం లేకపోవడం, టాయిలెట్ సౌకర్యాలు లేకపోవడం వంటి వారి పరిస్థితులు తెలిసి తనకు ఆందోళన కలిగించిందన్నారు.ప్రమాదాలతర్వాతరైల్వేదానిని మానవ తప్పిదం అంటూ పేర్కొని బాధ్యత నుండి తప్పించుకుంటుందని, కానీ ఉద్యోగులను అమానవీయ రీతిలో ఎలా పని చేయిస్తారో వివరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి ప్రాథమిక డిమాండ్లు స్థిర పని గంటలు, మెరుగైన వాతావరణమని, కానీ ప్రభుత్వం నామమాత్రంగా ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, పరిష్కారం కనుగొనే ఉద్దేశం లేదని ఆరోపించారు. ఇప్పుడు ఆహారం, టాయిలెట్ బ్రేక్ వంటి డిమాండ్లను కూడా ఆచరణాత్మకంకాదుఅంటూ తిరస్కరించిందన్నారు.ఈ చర్య లోకో పైలట్లకు అన్యాయం చేయడమే కాకుండా, రైళ్లలో ప్రయాణించే కోట్లాది మంది ప్రయాణికుల భద్రతతో ఆటలాడుకోవడమేనని రాహుల్ ఉద్ఘాటించారు. న్యాయం కోసం పోరాటంఅని,తామువారికిఅండగా ఉంటామని, ప్రభుత్వం వారి డిమాండ్లను పెడచెవిన పెట్టకుండా అమలుపరిచేంతవరకుతమగళాన్ని వినిపిస్తూనే ఉంటామన్నారు.

### అమెరికా పర్యటనకు వెళ్లనున్న రాహుల్ గాంధీ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈనెల 21, 22 తేదీల్లో యుఎస్‌లో పర్యటించనున్నారు. ఆ పార్టీ నేత పవన్ ఖేరా గురువారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. తన పర్యటనలో రాహుల్ రోడ్ ఐలాండ్‌లోని బ్రౌన్ యూనివర్సిటీని సందర్శిస్తారని తెలిపారు. అక్కడ విద్యార్థులు, అధ్యాపకులతో చర్చలో పాల్గొననున్నట్లు చెప్పారు. ఎన్నారై సంఘాలు, ఇండియా ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులతో రాహుల్ సమావేశం కానున్నట్లు తన పోస్ట్‌లో వెల్లడించారు. కాగా, గతంలో రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటించిన సమయంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. గత పర్యటనల్లో రాహుల్.. భారత్‌లో మత స్వేచ్ఛ, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో తాజా పర్యటనలో ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారో అన్న చర్చ జరుగుతోంది.

## అడిగిందే.. అడుగుతున్నారు...!

### ‘ఇడి’పై రాబర్డ్ వాద్రా అసహనం

**న్యూఢిల్లీ :** హర్యానాలోని భూ ఒప్పందానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపి ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా గురువారం మూడోరోజు ఇడి విచారణకు హాజరయ్యారు. ఆయన ఓ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇడి కొత్త ప్రశ్నలేవీ అడగటం లేదంటూ అసహనం వ్యక్తంచేశారు. ‘ఇడి అదే ప్రశ్నలు వేస్తోంది. 2019లోనూ దర్యాప్తు సంస్థ అధికారులు ఇవే ప్రశ్నలు అడిగారు. కొత్తగా ఏమీ లేదు. ఇది ఈ ప్రభుత్వం మమ్మల్ని తప్పుగా చూపించే ప్రచార శైలి. దీన్ని తట్టుకునే శక్తి మాకు ఉంది’ అని వాద్రా పేర్కొన్నారు. ఈసందర్భంగా ఇడి చర్య తనపై తన కుటుంబంపై జరుగుతున్న రాజకీయ ప్రతీకారంగా పేర్కొన్నారు. ఈ రోజు విచారణకు కూడా వాద్రా వెంట ఆయన సతీమణి ప్రియాంక వచ్చారు. ఈ కేసుకు సంబంధించి వాద్రాకు ఇడి మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. గత రెండు రోజుల్లో పది గంటల పాటు ఆయన వాంగ్మూలాన్ని అధికారులు రికార్డు చేశారు. బుధవారం విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను గాంధీ కుటుంబంలో భాగం కావడం వల్లే తనను లక్ష్యంగా చేసుకున్నారన్నారు. అదే తాను బిజెపిలో చేరి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. అలాగే తాను త్వరలోనే రాజకీయాల్లోకి వస్తానని తెలిపారు.

## బిజెడి అధ్యక్ష పదవికి నవీన్ పట్నాయక్ నామినేషన్


**భువనేశ్వర్ :** బిజెడి అధ్యక్ష పదవికి ఒడిశా అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ గురువారం శంఖా భవన్‌లో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటివరకు ఈ పదవికి ఆయన ఒక్కరే నామినషన్ దాఖలు చేశారు. 1997లో పార్టీ స్థాపించినప్పటి నుండి పట్నాయక్ వరుసగా ఎనిమిది సార్లు బిజెడి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన చివరిసారిగా ఫిబ్రవరి 2020లో ఈ పదవికి ఎన్నికయ్యారు. పట్నాయక్ తన తండ్రి బిజు పట్నాయక్ 28వ వర్ధంతి సందర్భంగా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన పేరు మీదే ప్రాంతీయ పార్టీ బిజు జనతాదళ్ అని పెట్టారు. 2000 నుండి 2024 వరకు బిజెడి ప్రభుత్వం ఒడిశాకు గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిందని అన్నారు. బిజెపి పేరును నేరుగా పేర్కొనకుండా, పట్నాయక్ మాట్లాడుతూ ఇప్పుడు కొంతమంది మన వారి సహకారం, త్యాగాలను కించపరచడానికి ఉద్దేశపూర్వకంగా ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. చరిత్రను మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ చరిత్ర కాలక్రమేణా దేశం అనుసంధాన అనుభవాన్ని ప్రతిబింబిస్తుందని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

## 22మంది నక్సలైట్ల అరెస్ట్

**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మూడు చోట్ల 22 మంది నక్సలైట్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. కోబ్రా, స్థానిక పోలీసుల సంయుక్త బృందం ఏరియా ఆపరేషన్‌లో ఉన్నప్పుడు ఉసూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్మెట్ల సమీపంలోని అడవి నుండి ఏడుగురు దిగువ స్థాయి క్యాడర్‌లను మంగళవారం పట్టుకున్నారని అధికారి తెలిపారు. జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్చర్‌లోని కోటల నుండి మరో ఆరుగురు నక్సలైట్లను అరెస్టు చేయగా, నెల్నార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కందకర్కలోని అడవి నుండి తొమ్మిది మంది క్యాడర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న నక్సలైట్ల నుంచి టిఫిన్ బాంబులు, జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, విద్యుత్ వైర్లు, బ్యాటరీలు, మావోయిస్టుల కరపత్రాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# 2026 నాటికి నక్సలిజం.. ఇక చరిత్రే


### సిఆర్‌పిఎఫ్ 86వ ‘రైజింగ్ డే’లో అమిత్ షా



**నీముచ్ :** నక్సలైట్లు కేవలం నాలుగు జిల్లాలకే పరిమితమై ఉన్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నక్సల్స్ అంతం అవుతారని ఆయన పేర్కొన్నారు. నక్సల్స్‌ను రూపుమాపడంలో.. సిఆర్‌పిఎఫ్ వెన్నుముఖగా నిలిచినట్లు ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో గురువారం సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌కు చెందిన 86వ రైజింగ్ డే ఫంక్షన్ జరిగింది. అమిత్‌షా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంనుంచి నక్సలైట్లను ఏరివేయడంలో సిఏపిఎఫ్(సెంట్రల్ ఆర్మ్డ్ పోలీసు ఫోర్సెస్) తోపాటు సిఆర్‌పిఎఫ్‌కు చెందిన కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. కమాండో బెటాలియన్ ఫర్ రిజల్యూట్ యాక్షన్(కోబ్రా) యూనిట్.. భద్రతా దళాల్లో ప్రత్యేకంగా పనిచేస్తున్నది. గెరిల్లా, జంగిల్ యుద్ధాల్లో ఆ దళం ఆరితేరి ఉన్నది. నక్సల్స్‌ను ఎదుర్కోవడంలో కోబ్రా దళం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నదన్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో సుమారు 400 ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లను ఏర్పాటు చేసినట్లు షా వెల్లడించారు. దీని వల్లే ఈ ప్రాంతాల్లో హింస తగ్గిందన్నారు. సుమారు 70 శాతం హింస తగ్గినట్లు చెప్పారు. ఇప్పుడు చివరి దశకు చేరుకున్నట్లు ఆయన తెలిపారు. దేశ భద్రత కోసం సీఆర్పీఎఫ్ చేసిన సేవలు అసాధారణమైనవని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడటంలోనైనా, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొల్పాలన్నా, నక్సలైట్లను ఎదుర్కోవాలన్నా.. సిఆర్‌పిఎఫ్ చేస్తున్న పోరాటం అసామాన్యమైందన్నారు. ప్రతి అచీవ్‌మెంట్‌లో సిఆర్‌పిఎఫ్ జవాన్ల పాత్ర కీలకంగా ఉన్నట్లు చెప్పారు. సిఆర్‌పిఎఫ్ సాధించిన అతి గొప్ప విజయాల్లో.. నక్సలిజాన్ని పారద్రోలడమే అని తెలిపారు. కోబ్రా కమాండోల గురించి విన్నప్పుడు నక్సల్స్ వణికిపోతున్నారన్నారు. ధైర్యానికి ప్రతీకగా కోబ్రా బెటాలియన్ నిలిచిందన్నారు. 86వ రైజింగ్ డే సందర్భంగా కోబ్రా యూనిట్ జవాన్లకు కంగ్రాట్స్ చెబుతున్నట్లు షా వెల్లడించారు. మీ నేతృత్వంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లు .. నక్సలిజం రూపుమాపడంలో ముందుకెళ్లినట్లు చెప్పారు. 2026 మార్చి 31వ తేదీ నాటికి దేశం నుంచి నక్సలిజం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని షా తెలిపారు. దేశం ఈ ప్రతిజ్ఞ తీసుకున్నదని, ఇక సిఆర్‌పిఎఫ్ వెన్నుముఖగా ఉందన్నారు. వాస్తవానికి ప్రతి ఏడాది మార్చి 19వ తేదీన సిఆర్‌పిఎఫ్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1950వ సంవత్సరంలో ఈ రోజునే కేంద్ర హోంమంత్రి వల్లభాయ్ పటేల్ జెండాను దళానికి అందజేశారు. అయితే ఈ ఏడాది సంబరాలను పొడిగించిన నేపథ్యంలో ఏప్రిల్ 17వ తేదీన పరేడ్ నిర్వహించారు. మధ్యప్రదేశ్ సిఎం మోహన్ యాదవ్ కూడా ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు. అయితే మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలో 1939, జూలై 27వ తేదీన బ్రిటీష్ పాలకులు క్రౌన్ రిప్రజెంటేటివ్ పోలీసు శాఖను ఏర్పాటు చేశారు. దాన్నే 1949, డిసెంబర్ 28వ తేదీన సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌గా హోంమంత్రి పటేల్ మార్చేశారు.

### 1961 ఎన్నికల నియమావళికి తాజా సవరణలపై స్పందించేందుకు

# ఇసికి ‘సుప్రీం’ మూడు వారాల గడువు



### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్, ఇతరులు పిటిషన్లు దాఖలు

**న్యూఢిల్లీ :** 1961 ఎన్నికల నియమావళికి ఇటీవల చేసిన సవరణలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్ అభ్యర్థనలపై స్పందించేందుకు గురువారం సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికి మూడు వారాల గడువు ఇచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం జైరామ్ రమేష్ పిటిషన్‌పై జనవరి 15న కేంద్రానికి, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసి స్పందన కోరింది. సీనియర్ అడ్వకేట్ మనీందర్ సింగ్ ఎన్నికల సంఘం తరపున హాజరై దీనికి సమాధానం ఇచ్చేందుకు మూడు వారాల గడువు ఇవ్వాలని అత్యున్నతన్యాయస్థానాన్ని కోరారు. కాగా, మనీందర్‌సింగ్ అభ్యర్థనపై స్పందించిన ధర్మాసనం పిటిషన్ విచారణకు జులై 21ను ఖరారు చేసింది. జైరామ్ రమేష్‌తో పాటు, మరో ఇద్దరు శ్యామ్‌లాల్ పాల్, హక్కుల కార్యకర్త అంజలి భరద్వాజ్ దాఖలు చేసిన రెండు ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు (పిల్స్) కూడా పెండింగ్‌లో ఉన్నాయి. జైరామ్ రమేష్ తరపున సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ ప్రాతినిథ్యం వహించారు.1961 ఎన్నికల నియమావళికి సవరణలు చాలా తెలివిగా చేశారని, ఓటరు గుర్తింపును బహిర్గతం చేస్తుందని పేర్కొంటూ సిసిటివి ఫుటేజీకి ప్రాప్యతను నిషేదించిందని పిటిషనర్లు చెప్పారు. సిసిటివి ఫుటేజీలు ఓట్లను బహిర్గతం చేయలేవని, ఓటింగ్ ఎంపికలు ఎప్పుడూ వెల్లడించలేదని అభిషేక్ సింఘ్వీ ఇంతకుముందు చెప్పారు. ఎన్నికల సంఘాన్ని, కేంద్రాన్ని తదుపరి తేదీ విచారణ ముందు వారి ప్రతిస్పందనలను దాఖలు చేసేలా చూడాలని ధర్మాసనాన్ని కోరారు. జైరామ్ రమేష్ అభ్యర్థన డిసెంబరులో దాఖలు చేయబడింది.ఎన్నికల ప్రక్రియకు సంబంధించి వేగంగా క్షీణిస్తున్న సమగ్రత’ను పునరుద్ధరించడానికి సహాయపడుతుందని రమేష్ తన అభ్యర్థనలో ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. దుర్వినియోగాన్ని నిరోధించడానికి అభ్యర్థుల వీడియో రికార్డింగ్స్ సహా సిసిటివి కెమెరా, వెబ్ కాస్టింగ్ ఫుటేజీ వంటి కొన్ని ఎలక్ట్రానిక్ పత్రాలను తనిఖీ చేయకుండా నిరోధించడానికి ప్రభుత్వం ఎన్నికలనియమావళిని సవరించింది.ఎన్నికల ప్రక్రియ సమగ్రత వేగంగా క్షీణిస్తున్నదని, దానిని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుసహాయపడుతుందనిజైరామ్‌రమేష్ చెప్పారు. ఎన్నికలసంఘం సిఫారసుఆధారంగా కేంద్రన్యాయ మంత్రిత్వశాఖడిసెంబరులో1961నియమావళికి సంబంధించినరూల్ (93)(2)(a)సవరణలు చేసింది. సంబంధిత పత్రాలు, డాక్యుమెంట్ల రకాన్ని బహిరంగ తనిఖీ కోసం ఓపెన్‌చేయడాన్ని నియంత్రించింది. పిటిషనర్ తన అభ్యర్థనలో సవరణ గురించి తెలియజేస్తూ ఎన్నికల నియమావళి కండక్ట్ రూల్ 93(2) (a) ప్రకారం ఎన్నికల సంబంధిత రికార్డులను పబ్లిక్ యాక్సెస్‌ను నియంత్రించి, కుదించాలని అభ్యర్థించింది. ఎన్నికలకు సంబంధించిన కొత్త సవరణ నిబంధనలలో పేర్కొన్న విధంగా ఇతర పత్రాలనుబహిరంగతనిఖీకోసం సవరించినట్లు పేర్కొంది. ఈ సవరణ ఎన్నికల రికార్డుల బహిరంగ స్క్రూటినీలో పారదర్శకత తగ్గడానికి దోహదపడిందని పిటిషన్ ఆరోపించింది. ఎన్నికల పత్రాలకు ప్రాప్యతను పరిమితం చేయడం ద్వారా ఈ సవరణ సమాచార హక్కు చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా ప్రభుత్వ జవాబుదారీతనాన్ని, పారదర్శకతను బలపరుస్తుందని వెల్లడించింది.

# లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం

**ప్రజాపక్షం/చర్ల :** మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోతే పునరావాసం కల్పిస్తామని ఎస్‌పి రోహిత్‌రాజ్ అన్నారు. గురువారం చర్ల మండలం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దున ఉన్న పూసుగుప్ప గ్రామం నుండి ఛత్తీస్‌గఢ్ బోర్డర్ వరకు రూ.3 కోట్లతో నిర్మించిన అంతరాష్ట్ర రహదారిని ఆయన ప్రారంభించారు.ఎస్‌పి విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో నెలరోజులపాటుభద్రతాబలగాల పహారా నడుమ 1.9కి.మీదూరంవరకు రహదారి నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ రహదారి పూర్తి కావడంతో తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు పెరిగి సమీప అటవీ గ్రామాల ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. క్రమంగా మావోయిస్టుల ప్రభావం తగ్గుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరెండర్ పాలసీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ప్రవేశపెట్టిన చేయూత పథకం పట్ల ఆకర్షితులై ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 220 మంది మావోయిస్టులులొంగిపోయినట్లు ఎస్‌పి చెప్పారు. లొంగిపోయిన వారికి పునరావాస పథకం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి రెండేళ్ల క్రితం 44 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉండగా చేయూత పథకానికి ఆకర్షితులై పెద్ద సంఖ్యలో లొంగిపోయారని, ఇకా ఆరుగురు మాత్రమే అడవుల్లో ఉన్నారన్నారు. వారిని కూడా జనజీవన స్రవంతి లోనికి తీసుకొచ్చే ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పూసుగుప్ప, చెన్నాపురం వంటి మారుమూల గ్రామాల్లో అతిత్వరలో సకల సౌకర్యాలతో ఆస్పత్రులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎస్‌పి రాక సందర్భంగా చర్ల సిఐ రాజువర్మ ఆధ్వర్యంలో పోలీస్, సిఆర్‌పిఎఫ్ బలగాలు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ తోపాటు ఎస్‌బి సిఐ శ్రీనివాస్, చర్ల సిఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డితో పాటు సిబ్బంది ఉన్నారు.


SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS12UA 8875 | Srilatha Illendala | EIDHER 11.10 FBT | 2010 |
| 2 | TG261072 | Ravi Kodi | KUBOTA MU4501 | 2023 |
| 3 | TS02UA 3901 | Veeranna Vankudothu | MAHINDRA 475 DI | 2014 |
| 4 | TS26T 2010 | Gugulothu Sunitha | MAHINDRA BOLLERO MAXI TRUCK PLIS | 2017 |
| 5 | MACH 4241 | Anusha Nomula | KUBOTA DC 68G COMBINE HARVESTER | 2020 |

AUCTION DATE:19-04-2025

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి ఖండి అమ్మకు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Opp : L B College, Mulugu Road, Cell : 9000230006, 8008900443

## ప్రభుత్వ పాఠశాలలోనే చదివించండి

ప్రజాపక్షం/ మోటకొండూరు: పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చదివించి, ద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని మోటకొండూరు మండల విద్యా శాఖాధికారి కేతిరెడ్డి రఘురాం రెడ్డి అన్నారు. ఆయన గురువారం ప్రోపేసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో బాగంగా 2025/26 విద్యా సంవత్సరంనకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోటకొండూర్, మోటకొండూర్ మండలంలో ఆరెగూడెం, మహబూబ్ పేట, వర్టూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తరగతిలో నూతనంగా సుమారు 20మంది విద్యార్థులు పాఠశాలలలో అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు, విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్సు, 6,7 తరగతులు బాల బాలికలకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తున్నామని, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ప్రతి విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు, రుచికరమైన భోజనం, రాగి జావా విద్యార్థులు అందరికి అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు కలకోట రాజగోపాల్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అండాలు, ఆచంట భాగ్యశ్రీ ,రాజశేఖర్ రెడ్డి, మంచాల భవాని, సుధారాణి, శ్రీలత, రమేష్ పాల్గొన్నారు.

## లబ్ధిదారుడి ఇంట్లో ఎమ్మెల్యే భోజనం



ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం) : సన్న బియ్యం లబ్ధిదారుడు కూరెళ్ళ అనిల్ ఇంట్లో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, తహసిల్దార్ లావణ్య, ఎంపీడీవో రాములు నాయక్, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్, మాజీ జెడ్పీటీసి నరేందర్ గుప్తా, యాస లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



## సుందరీమణుల ఆతిథ్యానికి విజయ విహార్ ముస్తాబు

### శరవేగంగా ఆధునికీకరణ పనులు

ప్రజాపక్షం/నందికొండ: మే7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగనున్న 72 వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వేదిక అవుతున్న సందర్భంగా ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లోని విజయవిహార్ ని ఆధునీకరిస్తున్నారు.అందాల పోటీలకు సమయం సమీపిస్తున్న సందర్భంగా ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి హైదరాబాదులో జరగనున్న పోటీలకు 140 దేశాల నుండి వస్తున్న సుందరీమణులు మే 12 న నాగార్జున సాగర్ ని సందర్శించనున్నారు. భారతదేశం నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఈ పోటీలలో పాల్గొననున్నారు దీంతో నాగార్జున సాగర్లో విడిది చేయడానికి అంతర్జాతీయ స్థాయి లో విజయవిహార్ లోని గదులను ఆధునీకరిస్తున్నారు. రూ.5కోట్ల వ్యయంతో 38 గదులను ఆధునీకరణ చేస్తున్నారు. ప్రస్తుత మిస్ వరల్డ్ చెక్ రిపబ్లిక్ కు చెందిన క్రిస్టినా పిస్కోవా ఈ ఈవెంట్ ముగింపులో ఎన్నికైన వారిని తన వారసురాలిగా పట్టాభిషేకం చేయనున్నారు.

## మంత్రులు కష్టపడుతుంటే అసత్యపు ఆరోపణలా?

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రజాపక్షం/చిట్యాల : ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు అహర్నిశలు కృషి చేస్తుంటే వారిపై అసత్యపు ఆరోపణలు చేయడం జిల్లా మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డికి పరిపాటిగా మారిందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం విమర్శించారు. నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల యాజమాన్య బోర్డు జలాల విషయంలో జగదీష్ రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ పార్టీ కృష్ణా జలాల వాటాలు తేల్చలేలని అసమర్థులని విమర్శించారు. బ్రాహ్మణ వెల్లంల, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువ, డిండి, నక్కలగండి లాంటి ఒక్క ప్రాజెక్టును కూడా మంత్రిగా పూర్తి చేయించలేక పోయాడని అన్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను పట్టించుకోలేదన్నారు. మ్మడి జిల్లాలలో ప్రాజెక్టుల పనులన్నీ వేగంగా నడుస్తున్నాయని అన్నారు. జగదీష్‌రెడ్డి మా ప్రభుత్వం పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని లేని పక్షంలో కార్యకర్తలు చూస్తూ ఊరుకోబోరని వీరేశం అన్నారు.

## బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు విస్తరింపచేసేందుకు కృషి




ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: మారుమూల గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు నేటికీ అందక వినియోగదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అటి గ్రామాలలో 4జి సేవలు విస్తరింపచేసేందుకు కృషి చేస్తామని లోక్ సభ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర లు అన్నారు.బిఎస్ఎన్ఎల్ ఉమ్మడి నల్లగొండ,ఖమ్మంజిల్లాల బిజినెస్ ఏరియా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశం గురువారం పానగల్ రోడ్లు లో గల ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగింది. నల్లగొండ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం ఈ ఉమ్మడి జిల్లాలలో బిఎస్ఎన్ఎల్ చేపడుతున్న తాజా అభివృద్ధి, ప్రగతిపై సమగ్రంగా వివరించారు. 4జిసాచురేషన్ ప్రాజెక్ట్ మరియు ప్రస్తుతం ఉన్న 2జి 3జి టవర్లను 4జి సాంకేతికతతో ఆధునీకీకరించడంపై విస్తృతంగా చర్చించడం జరిగింది. నల్లగొండ ఖమ్మం ఉమ్మడి జిల్లాల పరిధిలో 4జి సేవలు అందని గ్రామాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని కమిటీ సభ్యులు సూచించారు, తద్వారా అవసరమైన చర్యలు తీసుకుని బీఎస్ఎన్ఎల్ ద్వారా టవర్లు ఏర్పాటు చేయగలిగేలా కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు రాగలమని తెలిపారు. ఈ సమావేశంలో డిజిఎంలు రవి ప్రసాద్,శ్రీనివాస రావు,ఏజిఎంలు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గుండె సంబంధిత వ్యాధులకు ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులో

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ జ్యోతి ఆసుపత్రిలో గుండె సంబంధిత వ్యాదులకు ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయని రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నట్లు ఆసుపత్రి ఎండి డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైద్రాబాద్‌లో లభించే అత్యున్నత స్థాయి కార్డియాలజి వైద్య సేవలు ఇప్పుడు మిర్యాలగూడలో అందుబాటులో తీసుకొచ్చామని, గుండెపోటుకు గురైన వారిని తమ ఆసుపత్రికి తీసుకొస్తే 20 నిమిషాల వ్యవధిలోనే స్టంట్లు వేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద ఈ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేష్, జీవనజ్యోతి, మువ్వా శ్రీహర్ష, ఆదిల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



# భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### పేద ప్రజల భూ సమస్యల పరిష్కారానికి నాంది





ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న భూభారతి పోర్టల్ ద్వారా రాష్ట్రంలోని భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజల సమస్యలన్నీ పరిష్కారం అవుతాయనే దానికి భూభారతి ముఖ్య ఉదాహరణ అని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పరిపాలనలో ధరణి పోర్టల్ ద్వారా రెవెన్యూ శాఖలో అనేక చిక్కులు ఏర్పడ్డాయని విమర్శించారు. అధికారులు భూ సమస్యలను పరిష్కరించడంలో ధరణి పోర్టల్ ద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భాలు ఉన్నాయన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లేసి, జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, తహసిల్దార్ లావణ్య పాల్గొన్నారు.

### రైతుల మేలు కోసమే భూ భారతి చట్టం..ఎంఎల్‌ఏ బాలునాయక్

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; రైతుల మేలు కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం 2025ను రూపొందించిందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో అన్నారు. పేదల రైతుల మేలుకు కోసం ప్రభుత్వం ధరణీ స్థానంలో భూ భారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. ఈ చట్టంతో 80 శాతం సమస్యలు తహశీల్దార్ ద్వారా 20 శాతం సమస్యలు ఆర్డీవో, జిల్లా కలెక్టర్ల ద్వారా పరిష్కారం అవుతాయని అన్నారు. గత ప్రభుత్వం ధరణీ పేరుతో రైతులకు తీవ్రమైన అన్యాయం చేసిందని విమర్శించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ధరణీలో 35 మాడ్యుల్స్ ఉండగా భూ భారతిలో ఆరు షెడ్యూల్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల చివరి వరకు అన్ని మండల కేంద్రాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి భూ భారతి గురించి ప్రతి ఒక్క రైతుకు అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, అడిషనల్ ఎస్పి మౌనిక, డిపిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఏడిఏ శ్రీలక్ష్మి , తహశీల్దార్ అన్వర్ హుస్సేన్, ఎంపిడివో బాలరాజురెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### భూ భారతి చట్టం పేదలకు వరం : కలెక్టర్

ప్రజాపక్షం/నేరేడుచర్ల: భూ భారతి చట్టం2025 నిపుణులు, మేధావులు, విశ్రాంత ఉద్యోగులు, అందరి సలహాలతో సరణంగా సులభంగా రూపొందించిందని ఇది పేదలకు వరం లాంటిదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫ్రైడ్ కన్వెన్షన్ హాల్‌లో భూ భారతి చట్టం 2025పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని ప్రభుత్వం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున ప్రారంభించిందన్నారు. రైతుల భూ సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కారమవు తాయన్నారు. నాలుగు మండలాల్లో ఒక ఫైలెట్ ప్రాజెక్టు కింద దీనిని అమలు చేయడం జరుగుతుందన్నారు. నేరేడుచర్ల మండలంలో 1126 సాదాబైనామా దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సైదులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ విజయలక్ష్మి , మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





## కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక అక్రమ కేసులు



ఎమ్మెల్సీ శంకర్ నాయక్



ప్రజాపక్షం /నల్లగొండ: కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీపై ఈడి అక్రమంగా చార్జ్ షీట్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని గడియారం సెంటర్లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి ఈడి ఏఐసీసీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.కాంగ్రెస్, పార్టీ బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పాటు పడే పార్టీ అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, నాయకులు కేసాని వేణుగోపాల్ రెడ్డి, జూలకంటి శ్రీనివాస్, సమద్, బొజ్జ శంకర్, ఇంతియాజ్ హుస్సేన్, అల్లి సుభాష్ యాదవ్, గాలి నాగరాజు, మామిడి కార్తీక్, ఇటికాల శ్రీనివాస్, ఇంతియాజ్ అలీ, గురిజ వెంకన్న, కత్తుల కోటి, వంగాల అనిల్ రెడ్డి,దుబ్బ రూప, నాగమణి రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/సూర్యాపేట: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విపక్షాల గొంతును అణిచివేయాలనే దొరణిలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై నేషనల్ హెరాల్డ్ పత్రికలో మానిలాండరింగ్ జరిగిందని కేసులో వేసిన చార్జీషీటును వెంటననే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోస్టాపిస్ సమీపంలో కేంద్ర ప్రభుత్వం సోనియా, రాహుల్‌పై కేసులు నమోదు చేసి చార్జీషీట్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ మహాధర్నా నిర్వహించచారు. ఈ కేసును చట్టపరంగా ఎదుర్కొంటామని, బిజెపి ప్రేరిత ఈడి, ఐటి శాఖల అక్రమ చార్జీషీటులు తమను ఏమి చేయలేవని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్, నాయకులు నూకల సుదర్శన్ రెడ్డి, పోలగాని బాలు గౌడ్, ధరావత్ వీరన్న నాయక్ పాల్గొన్నారు.

## మట్టి రోడ్డు పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



ప్రజాపక్షం/మానవపాడు :జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం మానవపాడు మండలం ఈ మండల కేంద్రం నుండి సందాపురం రైల్వే స్టేషన్ కు వెళ్లే మట్టి పొలాలకు వెళ్లే రోడ్లును జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా చేపడతున్న రోడ్డు పనులను పరిశీలించేందుకు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు విజిట్ చేశారు. ఈ విజిట్‌లో అడిషనల్ కలెక్టర్ మానవపాడు మండలం ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ కూలీల పని వేళలు, కూలి డబ్బులు, పని తీరు వంటి అంశాలను పరిశీలించారు. అంతేకాకుండా ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున చెపట్టేందుకు తగిన లేబర్ సరుకులను మొబైలైజ్ చేయాలని ఎంపీడీవో కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల ఉపాధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరుతూ ప్రతి గ్రామంలో ఉన్న యాక్టివ్ వేజఖ సీకర్స్‌లో కనీసం 50శాతం మందికి ఉపాధి పనులు కల్పించేలా ప్రణాళికలు ఉండాలని మండల పరిషత్ ప్రభుత్వ అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి




ప్రజాపక్షం/దేవరకొండ : ఏప్రిల్ 21, 22 రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్లో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని భవన నిర్మాణ కార్మికుల బోర్డులో దళారుల బెడదను అరికట్టాలని బోగస్ కార్డులు ఏరివేయాలన్నారు. తంబు సిస్టం తీసేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేయాలన్నారు. శంషాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభలలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వారి యొక్క ఇబ్బందులు పై చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు రామస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ డివిజన్ కోశాధికారి వెంకటరాములు, మండల కార్యదర్శి మల్లయ్య, అధ్యక్షులు సైదులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీ నారాయణ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


## పెండింగ్ కేసుల పరిష్కారానికి నూతన కోర్టు

### హైకోర్టు న్యాయమూర్తి,జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధారాణి




ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి నూతన కోర్టు ఎంతగానో ఉపయోగపడుతుందని హైకోర్టు న్యాయమూర్తి,సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధా రాణి ఆకాంక్షించారు. హుజూర్‌నగర్‌కు నూతనంగా మంజూరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గురువారం హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధా రాణి,హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్,జస్టిస్ లక్ష్మ ణ్, జస్టిస్ సుజన లతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో పెండింగ్ కేసుల సంఖ్య అధికంగా ఉందని కేసుల పెండింగ్ భారాన్ని తగ్గించడానికి నూతన కోర్టులను మంజూరీ చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రాంరెడ్డి పదే పదే విన్నవించగా ఆయన అభ్యర్థన మేరకు నూతన కోర్టును మంజూరీ చేశామని తెలిపారు. ఈ కోర్టును ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నూతన కోర్టును కేటాయిస్తే తప్ప జడ్జిని నియమించడం సాధ్యం కాదని అందువల్ల ఈ కోర్టును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నూతన కోర్టుల సముదాయాన్ని అలాగే న్యాయమూర్తుల వసతి గృహాల నిర్మాణాల కొరకు బార్ అసోసియేషన్ సభ్యులు రాంరెడ్డి ఆధ్వర్యంలో నిరంతర కృషి చేసి ప్రభుత్వం నుండి నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయింపు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. జస్టిస్ లక్ష్మ ణ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయవాదుల చిరకాల వాంఛ ఈనూతన కోర్టు ప్రారంభోత్సవంతో నెరవేరినట్లుగా భావిస్తున్నానన్నారు. పాలకవీడు,మఠంపల్లి,మేళ్ళచెర్వు,చింతలపాలెం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని క్రిమినల్ కేసులు ఆయా మండలాల లోని సివిల్ కేసులు మొత్తం 3067 కేసులను నూతన కోర్టుకు కేటాయించామని ఆ కేసులను నూతన కోర్టులో విచారించనున్నట్లు ఆయన తెలిపారు. న్యాయమూర్తుల ఎంపిక కొరకు పరీక్షలు రాసిన అభ్యర్థులలో అనుకున్న స్థాయిలో న్యాయమూర్తులుగా సెలెక్ట్ కాకపోవడం మూలంగా ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయలేక పోతున్నామన్నారు. సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయవాదుల అభ్యర్థన మేరకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరీ చేయడం పట్ల హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్,ఎస్.పి కె.నరసింహా,హుజూర్‌నగర్,కోదాడ, సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జిలు జిట్టా శ్యామ్‌కుమార్,సురేష్,పర్వీన్ కౌసర్,జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



ప్రజాపక్షం/చందంపేట: నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని పోలేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద పార్వతీ పుత్ర హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పిసిసి సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేపల్లి మరియు పరిసర ప్రాంతం ప్రజలు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఒక్కరు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి పార్వతి, శివ, తిరుపతయ్య, శ్రీను, ఆంజనేయులు, మహేష్, అంజి, సతీష్, పార్వతిపుత్ర హెల్పింగ్ హాండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.6వేల పింఛన్ కోసం పోరాటం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: వికలాంగుల హక్కుల పోరాట సమితి మిర్యాలగూడ నియోజకవర్గం స్థానిక ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో విహెచ్పిఎస్ సీనియర్ నాయకులు ఎండి అహ్మద్ ఖాన్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త వెంకన్న యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫల అయిందన్నారు. వికలాంగుల పెన్షన్ 6వేల చేయూత పెన్షన్ 4వేల చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 19న హైదరాబాదు నడిబొడ్డులో మందకృష్ణ మాదిగ తలపెట్టిన ముఖ్య కార్యకర్తల సమావేశం జరగనున్నదని ఈ సమావేశంలో విహెచ్‌పిఎస్ ముఖ్య నాయకులు హాజరయ్యి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వానికి వికలాంగుల సంక్షేమ శాఖ స్వతంత్రంగా ఏర్పాటుచేయాలని,వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలనీ,ఇందిరమ్మ ఇళ్లలో మొదట ప్రాధాన్యత ఇవ్వాలనీ, వికలాంగులకు స్థానిక ఎన్నికల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.ఈ సమావేశాన్ని సమావేశంలో చర్చించి తదుపరి కార్యాచరణకు సిద్ధపడతామని వికలాంగుల అందరూ ప్రభుత్వానికి సవాలుగా నిలవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కసిరెడ్డి చైతన్య రెడ్డి,జిల్లా నాయకులు రాచూరి సైదులు,గుగులోతు మదన్ నాయక్, పొలం దాస్ శీను,రత్నకుమారి,ఎండి కలీం,సుధాకర్,సైదిరెడ్డి,కిషన్ నాయక్,షర్ఫుద్దీన్,గౌస్,నజీర్ బాబా పాల్గొన్నారు.

## భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ : సిపి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: సిపి సాయిచైతన్య బుధవారం భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర్‌రెడ్డి, భీమ్‌గల్ సిఐ పొన్నం సత్యనారాయణ, ఎస్సైలు మహేష్, అనిల్‌రెడ్డి, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడి.. న్యాయవాదుల నిరసన



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : సూర్యాపేటలో న్యాయవాదిపై దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవడాలని గురువారం మంచిర్యాల జిల్లా కోర్టు భవనం ముందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు భుజంగరావు మాట్లాడుతూ, న్యాయవాదిపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని సూర్యపేటలో అడ్వకేట్‌పై దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులకు రక్షణ కల్పించేటువంటి చట్టాలను త్వరలో అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు చకినారపు దత్తాత్రేయ, తుల ఆంజనేయులు, గోపతి రవి, శ్రీరాములు, జాడి తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను రాజులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మళా రెడ్డి



ప్రజాఫక్షం /కొండాపూర్ : రైతులను రాజులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మళా రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని గొల్లపల్లి సోసైటీ చైర్మేన్ శ్రీకాంత్ రెడ్డి ఆద్వర్యంలో కొండాపూర్‌లో సోసైటీ చైర్మన్ మాణిక్య రెడ్డి, ఆద్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మళా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో రైతులను రాజులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతులు పండించిన దాన్యానికి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రూ. 500 లు బోనస్ గా చెల్లించి దాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వము కొనుగోలు చేస్తుందని రైతుల అందోళన చెందవలదన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించి అధిక లాబాలు పొందాలన్నారు. రైతులు తెస్తున్న దాన్యాన్ని సకాలంలో సేకరించాలని ,రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మేన్ వై ప్రభు, సిడిసి చైర్మేన్ గడీల రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చెర్మేన్ కుమార్, సోసైటీ సీఈఓలు రాజశేఖర్ , సిరాజ్ స్టాప్ అసిస్టెంట్ ప్రవీణ్, గొల్లపల్లి ,కొండాపూర్ సోసైటీ డైరెక్టర్లు, గొల్లపల్లి పంచాయతీ కార్యదర్శి నౌషద్ ఫాతిమా, గణేష్, కాంగ్రెస్ నాయకులు నర్సింహా రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్వర్, వెంకట్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ,ప్రభుదాస్, లక్ష్మి కాంత్ రెడ్డి, రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# భూ వివాదాల పరిష్కారానికి ‘భూ భారతి’ చట్టం

అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు






ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం భూవివాదాల శాశ్వత పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండల కేంద్రాలతో పాటు ఏర్గట్ల మండలం బట్టాపూర్‌లో భూభారతి నూతన చట్టంపై రైతులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని భూభారతి చట్టంపై అందులోని అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన ద్వారా వివరిస్తూ రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్‌ఓఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా ఈ నూతన ఆర్‌ఓఆర్ చట్టం ఉపకరిస్తుందని, రైతుల భూములకు భరోసా లభిస్తుందని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించే ఈ చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, భూ సమస్యలు కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో దీనిని ఈ నెలాఖరు వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తారని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి వచ్చే ఇతర ఏవైనా అంశాలు సమస్యలను కూడా పరిశీలించి ఈ చట్టంలో చేర్చటం జరుగుతుందని తెలిపారు. అనంతరం మే మొదటివారం నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తారన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి నూతన చట్టంపై సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించటం జరుగుతుందన్నారు. రెవెన్యూ అధికారులే గ్రామాలకు భూభారతి నూతన చట్టంపై సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూసమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించటం జరుగుతుందన్నారు. రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరిస్తరని, నిర్ణీత కాల వ్యవధిలోపు వాటిని పరిష్కరిస్తారన్నారు. భూవివాదాల విషయంలో అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం సమకూరుస్తారని సూచించారు. . ఈ సదస్సులలో ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య



ప్రజాపక్షం/ఆర్మూర్: మునిసిపల్ పట్టణ కేంద్రంలోని కోటార్మూర్ (పెర్కిట్) ఏరియాకు చెందిన చిట్యాల రాజన్న మంజుల దంపతుల మూడో కుమార్తె చిట్యాల నీత (17) బుధవారం రాత్రి మహాలక్ష్మి అపార్టుమెంటుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బందువులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల నీత ఆర్మూర్ మండలంలోని చేపూర గ్రామంలోని క్షత్రియ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను అభ్యసిస్తుందన్నారు. బుధవారం రాత్రి నీత వారి బాబాయ్ చిట్యాల మహేశ్ ఇంటికి ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళిందన్నారు. అక్కడే తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక అపార్టుమెంటులోని ఐదవ అంతస్తుకు ఎక్కి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుందని కుటుంబీకులు తెలిపారు. అపార్టుమెంటుపై నుంచి నీత దూకిన సమాచారం తెలుసుకుని వెంటనే ఆమెను ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు దృవీకరించారన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

## పోలీస్ అధికారి తనకు సన్నిహితుడంటూ అమాయకులకు బెదిరింపులు



ప్రజాపక్షం/చెన్నూరు: మంచిర్యాల జిల్లాలోని ఓ పోలీస్ కీలక అధికారి తనకు సన్నిహితుడంటూ, ఆయనతో భూ దందాలకు సంబంధించి ఆఫీషియల్ మీటింగులు కూడా నిర్వహిస్తారని చెన్నూరు పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం సామాజిక మాధ్యమం ద్వారా ఆలస్యంగా వెలుగు చూసింది. గత కొంత కాలంగా చెన్నూరు పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు ఓ ముఠాగా ఏర్పడి భూ భాదితులనే లక్ష్యంగా చేసుకొని, జిల్లా పోలీస్ అధికారి పేరును వాడుతూ సెటిల్మెంట్లు నిర్వహిస్తున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల, చెన్నూరు పట్టణానికి చెందిన ఓ బాధితుడు అట్టి ముఠా సభ్యులు ఓ పోలీస్ అధికారి పేరు చెప్పి బెదిరించిన ఓ వీడియోను సామాజిక మాధ్యమంలో విడుదల చేయడంతో స్థానికంగా దుమారం లేపింది. జిల్లా పోలీసు అధికారి మంచి ప్రతిష్టతో ఉండటంతో, ఇలాంటి అక్రమార్కులు ఆయన పేరును వాడుతూ ఆయన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ ఆగడాల వల్ల నిజాయితీగల పోలీస్ అధికారి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, వారి స్వలాభాల కోసం అమాయకులను బెదిరించి అక్రమ దందాలు నిర్వహించరాదని ప్రజలు చెప్తున్నారు. వారు ఇంకోసారి ఇలా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## దేశంలో కాంగ్రెస్ ఎదుగుదల చూసి ఓర్వలేకనే అక్రమ కేసులు



ప్రజాపక్షం/బాన్సువాడ : దేశంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కేంద్ర ప్రభుత్వం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై నేషనల్ హెరాల్డ్ అక్రమ కేసులు నమోదు చేయడం అన్యాయమని కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కాలేక్, మధుసూదన్ రెడ్డి, జంగం గంగాధర్, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ నార్ల సురేష్ గుప్తా, అలిబిన్ అబ్దుల్లా, నాయకులు గురువినయ్, ఎజాస్, అజీమ్, జహీర్, రహీస్, నరసన్న చారి, రెంజర్ల సాయిలు, అందె రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ‘ఇక్రిసాట్’లో చిరుత పట్టివేత

ప్రజాఫక్షం/సంగారెడ్డి ప్రతినిధి: రాంచంద్రపురం వద్ద ఉన్న అంతర్జాతీయ పంటల పరిశోదనా కేంద్రం (ఇక్రిసాట్) పరిసర్లాలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. చిరుతను చూశామని ఇక్రిసాట్ అధికారులకు ,స్థానికులు తెలపడంతో అటవీశాఖ తక్షణమే స్పందించి అదికారులు అక్కడ బోన్లు ఏర్పాటు నిఘా పట్టారు. అత్యాధునిక టాప్ కెమెరాల ద్వారా చిరుత కదిలికలను గుర్తించిన అధికారులు గురువారం తెల్లవారుజామున బోనులో చిరుతను విజయవంతంగా బందించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు ఆ చిరుతను జాగ్రత్తగా హైదరాబాదులోని నెహ్రూ జూ పార్కకు తరలించారు. చిరుత ఆరోగ్యంగా ఉందని ప్రస్తుతానికి జు పార్క్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నమనిఅటవీ అధికారి శ్రీదర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## భూభారతి ద్వారా భూ సమస్యల సత్వర పరిష్కారం

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



ప్రజాపక్షం/వాంకిడి: భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టం కీలకమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. గురువారం వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి నూతన ఆర్‌ఒఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా హక్కుల రికార్డులలో తప్పుల సవరణ, భూ సమస్యల పరిష్కారం సత్వరంగా సాధ్యమవుతుందని, ధరణి స్థానంలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టడం ద్వారా నిజమైన భూమి యజమానికి న్యాయం జరుగుతుందని తెలిపారు. తహసిల్దార్ జారీ చేసిన ఆర్డర్‌పై రాజస్వ మండల అధికారికి, ఆయన ఆర్డర్‌పై కలెక్టర్‌కు అప్పీల్ చేసే వెసులుబాటు ఉందని చెప్పారు. విరాసత్, కొనుగోలు, దానం, తనఖా, పాలు పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసి, రికార్డులలో మార్పు చేసి, పాసుపుస్తకాన్ని జారీ చేస్తారని వివరించారు. ఈ ప్రక్రియ ఒకేరోజులో పూర్తయ్యేలా చట్టంలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భూభారతి చట్టం రైతులకు సులభంగా ఉపయోగపడేలా రూపొందించామని, ప్రతి రైతు ఇందులోని హక్కులు, అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రియాజ్ అలీ, మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి..

కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలోని కూచారం కస్తూర్బా బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆర్డిఓ జై చందర్ రెడ్డి,తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి,పంచాయతీ రాజ్ ఈఈ నరసింహులు తో కలిసి గురువారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కేజీ.బీవీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలోని వంట గదులు, వాష్ రూమ్ లలో పరిశుభ్రతను, స్టోర్ రూమ్, స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మినరల్ వాటర్ అందుబాటులో ఉందా.? మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా.? అంటూ ప్రశ్నించారు. విద్యార్థులు సానుకూలంగా సమాధానం చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు రుచి శుచికరమైన భోజనం అందిస్తూ, వారికి నాణ్యమైన గుణాత్మక విద్యను అందించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు



ప్రజాపక్షం/శ్రీరాంపూర్: చట్టాన్ని అతిక్రమించిన వారిపైన కఠిన చర్యలు తప్పవని, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్ హెచ్చరించారు. గురువారం శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, రాత్రి వేళలో పని లేకుండా తిరుగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మైనర్లను, వారి తల్లిదండ్రులను పిలిచి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, మార్పు రాకపోతే పిడి యాక్ట్ అమలు చేస్తామని, మైనర్లు నేరాలకు పాల్పడితే వారి తల్లిదండ్రులపైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలను భయపెట్టే, గుంపులుగా తగాదాలు పెట్టుకునే, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చట్టాన్ని అతిక్రమించే వారిని జైలులో వేయకుండా వదలమని స్పష్టం చేశారు. చెడు స్నేహితుల మాటలు విని తాత్కాలిక ఆనందాల కోసం మత్తు పదార్థాలకు బానిసలుగా మారవద్దని, నేరాల దారిలోకి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోరాదని సూచించారు. మంచి జీవనోపాధి ఎంచుకుని కుటుంబంతో సంతోషంగా జీవించాలని కోరారు. ఎలాంటి సమస్యైనా, ఎవరి నుండి అయినా ముప్పు ఉన్నా వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మేకల సంతోష్ పాల్గొన్నారు.

## పోలీసుల మెరుపు దాడులు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: భీమ్‌గల్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో ఫైనాన్స్ వ్యాపారులపై గురువారం పోలీసులు మెరుపు దాడులు చేశారు. జిల్లా సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు దాడులు జరిపారు. ఇతర మండలానికి చెందిన పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. అధిక వడ్డీలకు ఇంట్రెస్ట్ డబ్బులు ఇచ్చి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారనే ఫిర్యాదుల మేరకు దాడులు నిర్వహించామన్నారు. పట్టణంలోని ఇద్దరు, బెజ్జొరా గ్రామానికి చెందిన మరోక వడ్డీ వ్యాపారుల ఇంట్లో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. సోదాల్లో వడ్డీలకు ఇచ్చిన వారి ప్రాంసరీ నోట్స్ ఇతర డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకోవటం జరిగినట్లు సమాచారం. పోలీసుల మెరుపు దాడులతో వడ్డీ వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొందరు వడ్డీ వ్యాపారులు దాడుల విషయం తెలుసుకుని ఇళ్లలో దాచి పెట్టుకున్న డాక్యుమెంట్లను రహస్యప్రదేశానికి తరలించినట్లు సమాచారం.

## భూ నిర్వాసితులకు అన్ని విధాలా సౌకర్యాలు

ఎంఎల్ఎ గడ్డం వినోద్



ప్రజాపక్షం/కాసిపేట: భూ నిర్వాసితులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తాం అని, ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేసి బడి, గుడి నిర్మాణం త్వరలోనే చేపడతాం అని బెల్లంపల్లి ఎంఎల్ఏ గడ్డం వినోద్ కుమార్ అన్నారు. గురువారం. కాసిపేట మండలం దబ్బగూడెం గ్రామంలో కళ్యాణి ఖని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ సంబంధిత భూమి నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ సెంటర్ స్థలాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 299 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ కాలనీలో వచ్చే ఏడాది వరకు వాటర్ ట్యాంక్, బడి, గుడి, గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్వాడి కేంద్రంతో పాటు అన్ని రకాల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి లో భూములు కోల్పోయిన మిగత భూనిర్వాసితులను గుర్తించి, పూర్తి స్థాయిలో సర్వే చేసి వారికి కూడా స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓ హరికృష్ణ, మందమర్రి సింగరేణి జిఎం దేవేందర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ జెడ్పిటిసి రైతు సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్, గోలేటి స్వామి, సింగరేణి అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారం

సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి



ప్రజాపక్షం/బెల్లంపల్లి: సింగరేణి పాత క్వార్టర్స్ నివాసితులకు పట్టాలు ఇప్పించి, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా మెరుగుపరచాలని బెల్లంపల్లి పట్టణ సిపిఐ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను తెలియజేస్తూ గురువారం బెల్లంపల్లి ఎంఎల్ఏ గడ్డం వినోద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు సింగరేణి పాత క్వార్టర్స్‌లో కొంతమందికి జీవో నెంబర్ 76 ప్రకారం పట్టాలు అందించినప్పటికీ, ఇంకా చాలా మంది పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు. అర్హులందరికీ జిఒ నెంబర్లు 58, 59 ప్రకారం పట్టాలు అందించడంలో ప్రభుత్వం వాగ్దానాలను నెరవేర్చాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉన్నందున, చెత్త తొలగింపు చర్యలు తీసుకోవాలని, డంపు యార్డు ఏర్పాటుకు తగిన స్థలాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను ప్రతి రెండు రోజులకు ఒకసారి అందించాలని, ప్రజల నీటి కష్టాలు తగ్గించాలని అన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని రక్షించడంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు బొంతల లక్ష్మీ నారాయణ, మేకల రాజేశం, కొంకుల రాజేష్, అంబాల ప్రభుదాసు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/సోన్: గురువారం సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు.పాఠశాలలోని ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ ప్రయోగశాలలో విద్యార్థులకు ఖగోళ శాస్త్రం,భౌతిక శాస్త్ర ప్రయోగాలు,మానవ శరీర ధర్మ శాస్త్రానికి సంబంధించి పరిజ్ఞానం పెంపొందించేలా వివిధ రకాల సమూనాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈ ప్రయోగశాలలో ఏర్పాటు చేసిన నమూనాల వల్ల ఆచరణాత్మక విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు అన్ని అంశాలు సులువుగా అర్థమవుతాయని తెలిపారు.ఈ ప్రయోగశాలను ఉపయోగించి పాఠశాలలోని విద్యార్థులందరికి నైపుణ్యాలు పెంపొందించేలా ఆచారనాత్మక విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.జిల్లాలోని ఏ ప్రైవేటు పాఠశాలల్లో కూడా ఇటువంటి ప్రయోగశాల లేదని అన్నారు.ఇటువంటి సదుపాయాలను కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతుందని తెలిపారు.అంతేకాకుండా విద్యార్థులో పఠనాసక్తి,నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు.కాగా జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించేలా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రత్యేక చొరవతో సుమారు 19 లక్షల 50వేల రూపాయల ఖర్చుతో మొదటగా జిల్లాలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ప్రయోగ కేంద్రాలను ఏర్పాటు చేశారు.సోన్ మండల కేంద్రాలను ఏర్పాటు చేశారు.సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్,కేజీబీవీ,మామడ మండల పొన్కల్ ప్రభుత్వ పాఠశాల,తాండూరు,మండలం బోసి ప్రభుత్వ పాఠశాలలో ఒక్కొ పాఠశాలకు సుమారు 5లక్షల చొప్పున వ్యయంతో ఈ ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో డీఈఓ పి.రామారావు,సెక్టొరల్ అధికారి రాజేశ్వర్,జిల్లా సైన్స్ అధికారి వినోద్,తహసిల్దార్ మల్లేష్,ఎంఈఓ పరమేశ్వర్,ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన,ఉపాధ్యాయులు,ఇతర అధికారులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## కుంటాలలో వెలిగిన సెంట్రల్ లైటింగ్

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/కుంటల: కుంటాల మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సమస్యపై అంధకారంలో కుంటాల కాలనీ అనే శీర్షికన ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.గురువారం ట్రాన్స్ కో ఏ ఈ మధు ఆధ్వర్యంలో సిబ్బంది సెంట్రల్ లైటింగ్ సేవలను పునరుద్ధరించారు.ఇటీవల ఓ నిర్మాణ కాంప్లెక్స్ వద్ద విద్యుత్ స్తంభం మార్పు లో గ్రౌండ్ లో ఉన్న వైరింగ్ తెగిపోయినట్లు గుర్తించారు.ప్రత్యేక టెక్నీకల్ టీమ్ మరమ్మతులు చేపట్టారు.కుంటాల లో గత వారం రోజులుగా చీకట్లో ఉన్న ప్రధాన కాలనీ లో తిరిగి వెలుగు లు ప్రసరించేలా చేసిన ప్రజాపక్షంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## శ్రీరాజరాజేశ్వర ఆలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ పూజలు

ప్రజాపక్షం/వేములవాడ: శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, వీటి డి వైస్ చైర్మన్, సిఇఒ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ఇఒ వినోద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాజన్న ఆలయం, పార్కిం గ్,ఆలయ పరిసరాలు పరిశీలించారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు.



## ఉత్తమ ప్రతిభకు గుర్తింపు..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన దుంపెటి గౌరిశంకర్ కూతురు చైతన్య స్కూల్ నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. అందుకు వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం ల్యాప్‌ట్యాప్, ఉత్తమ ప్రశంశా పత్రాన్ని అందచేశారు. లాస్యతో పాటుగా ఆమె తల్లిదండ్రులను పలువురు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మెన్ శ్రీధర్, ప్రిన్సిపల్ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.




## అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గ పంచాయతీ రాజ్, వెటర్నరీ, హెల్త్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మంజూరైన పల్లె దావకాన, బస్తీ దావాఖానల పనుల పురోగతిపై చర్చించనున్నట్లు తెలిపారు. జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్, జగిత్యాల, వెల్దుర్తి, తుంగూర్, రెచపల్లి గ్రామాల్లో పశు దవాఖానలు నూతన, అదనపు పనుల విషయంలో చర్చ, జగిత్యాల పట్టణ టి.ఆర్ నగర్‌లో 3 కోట్ల తో నిర్మిస్తున్న బాలసదన్ నిర్మాణ పనులను అదనంగా ఉన్న 75 లక్షల నిధులు పనుల సద్వినియోగం తదితర విషయాలపై చర్చించినట్లు తెలిపారు. జగిత్యాల మున్సిపల్ లో5 కోట్ల నిధులు ఉండగా పనుల కేటాయింపు పై, పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు డంపింగ్ యార్డు , డంపింగ్ యార్డు నిర్వహణ, తడి పొడి చెత్త నిర్వహణ పై ప్రజలలో చైతన్య పరచడం, అమలు చేసే వాటి గురించి సమీక్ష సమావేశంలో పలు విషయాలను అధికారులనుజగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ ప్రమోద్, ఈఈ లక్ష్మ ణ్ రావు, జిల్లా సంక్షేమ అధికారి డా.నరేష్, కమిషనర్ స్పందన, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన బోధనకు కృషి

* జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/అంతర్గాం : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను, పాఠశాలలో టాయిలెట్స్, కిచెన్ షెడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యార్థులకు మెరుగైన పద్ధతులలో విద్యా బోధన జరగాలని, పాఠ్యాంశాలు సులువుగా అర్థం చేసుకునేలా వినూత్నంగా బోధించాలన్నారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు ఉండే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట అధికారి నాగార్జున, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

## ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, గుల్లపేట ఐకేపీ సెర్ప్ కొనుగోలు కేంద్రాలను గురువారం రోజున జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బి. ఎస్.లత ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది. కేంద్రాల్లో వచ్చిన ధాన్యం వివరాలు, తేమ శాతం, రైతు నమోదు తదితర అంశాలను పరిశీలించడం జరిగింది. జగిత్యాల అడిషనల్ కలెక్టర్ బి. ఎస్.లత మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోయాగానే రైతులు తప్పనిసరిగా అరబెట్టుకుకోవాలని, కుప్పగా ఉంచడం వల్ల రంగు మారే అవకాశం ఉంటుందని, కమిటీ సభ్యులు రైతులకు ఈ విషయంపై రెగ్యులర్‌గా తెలియజేయాలని, సంబంధిత డాక్యుమెంట్లు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్, వ్యక్తి గత బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ పత్రాలు తప్పనిసరిగా తీసుకొని టాబ్‌లో నమోదు చేయాలన్నారు.మౌలిక సదుపాయాలు ఉండాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేయాలని కేంద్రం నిర్వాహకులకు, సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా డిఆర్‌డిఒ రఘువరణ్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ ఏ. శ్రీనివాస్, జగిత్యాల రూరల్ ఎంపిడిఒ రమాదేవి, నాయబ్ తహసీల్దార్ కార్తీక రెడ్డి, సివిల్ సప్లయ్ డి.టి. వరప్రసాద్, ఫుడ్ ఇన్స్పెక్టర్ ఎపిఎం వి.గంగాధర్, జిపి సెక్రటరీలు గ్రామ సంఘ సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాపక్షం/మల్యాల : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కేంద్ర ప్రభుత్వమని స్థానిక ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల మండలంలోని రామన్నపేట, నూకపెల్లి, మల్యాల ఐకెపి, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం ప్రారంభించారు.ఈ సందర్బంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో ఎన్నడు లేని విధంగా ఈసారి సాగుకు సకాలంలో నీరు అందించి అధిక దిగుబడికి రావడానికి కృషి చేశామన్నారు.ఈ కార్యక్రమంలో మల్యాల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బత్తిని మల్లేశ్వరిశ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ మునీం ధర్, ఎంపిడిఒ స్వాతి, ముత్యంపేట కార్యదర్శి స్వప్న, మాజీ ఎంపిపి దారం ఆదిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దొంగ ఆనంద రెడ్డి, ముత్యాల రాం లింగారెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, మల్యాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శనిగారపు తిరుపతి, నల్లపు మల్లేశం, కంచర్ల లక్ష్మ ణ్ చారి, తాల్ల హరినాథ్, నక్కల అనిల్ , కోరేపు వెంకటేష్ పాల్గొన్నారు

# భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా

# భూ భారతి చట్టం






**చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ**

**పెండింగ్ సాదాబైనామాలకు మోక్షం**

**30 రోజుల్లో భూమి మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారం**

**అవగాహన కార్యక్రమాల్లో కలెక్టర్ పమేలా సత్పతి**

ప్రజాపక్షం/తిమ్మాపూర్/గన్నేరువరం : భూ సమస్యల పూర్తి పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్ఒఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భూ భారతిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం కానున్నాయన్నారు. గురు వారం తిమ్మాపూర్ మండలంలోని తిమ్మాపూర్ రైతు వేదికలో, గన్నేరువరంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్‌హాలులో నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమాల్లో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్‌తో కలిసి పాల్గొన్నారు. భూభారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు ఒక్కొక్క సెక్షన్, అంశం వారీగా వివరించారు. ముందుగా రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు కరీంనగర్ జిల్లాలో ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భూ భారతి చట్టం ప్రకారం ఏ సమస్యను ఏ అధికారి.. ఎన్ని రోజుల్లో పరిష్కరించాలి? అది పరిష్కారం కాకుంటే ఎవరికి అప్పీల్ చేయాలనే దానిపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసిందని తెలిపారు. సిసిఎల్‌ఏకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని తెలిపారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం సరికాదని భావిస్తే కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చన్నారు. భూభారతి చట్టంపై ఏమైనా సందేహాలుంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. ధరఖాస్తు దారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి , తహసీల్దార్లు, ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/గోదావరిఖని-అంతర్గాం : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం రామగుండం మండలంలోని ఎన్‌టిపిసి మిలీనియం హాల్‌లో, అంతర్గాం మండలంలోని బ్రహ్మణపల్లి రైతు వేదిక వద్ద వేర్వేరుగా నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుల్లో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి(రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025 అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు పెద్దపల్లి జిల్లాలో ఈనెల 17 నుంచి 28వ తేదీ వరకు ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహించి విస్తృత ప్రచారం చేపట్టనున్నామన్నారు.

### భూ భారతితో- రైతులకు పూర్తి భరోసా

**- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : రైతుల భూములకు భరోసా కల్పించేది భూభారతి చట్టమని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. గురువారం బుగ్గారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని రైతు వేదికల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం)2025 పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు భూముల పై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా దొరుకుతుందని, జూన్ 2 నుండి ఆన్లైన్లో భూభారతి చట్టం పోర్టల్ పనిచేస్తుందని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏదైనా సమస్య పరిష్కారానికి దరఖాస్తు చేస్తే నిర్దేశించిన సమయంలో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ధరణిలో వ్యవసాయ సబ్ డివిజన్ పై ఎలాంటి ప్రస్తావన లేదని , భూభారతి చట్టంలో సబ్ డివిజన్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న భూభారతి చట్టం లోని నిబంధనల ప్రకారం రికార్డులను అప్డేట్ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఇకపై బ్యాంకు రుణాలకు వెళ్ళినప్పుడు భూములకు సంబంధించిన కాగితాలను సమర్పించాల్సిన అవసరం లేదని, భూభారతి పోర్టల్ లో నమోదైన రికార్డుల ఆధారంగానే బ్యాంకు రుణాలు ఇస్తారని తెలిపారు.




## నేడు కరీంనగర్‌లో సిపిఐ నగర 11వ మహాసభ

**సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు**




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : సిపిఐ కరీంనగర్ నగర 11వ మహాసభ నగరంలోని గణేష్‌నగర్‌లో గల బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఈ నెల 18 శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరగనుందని, అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు పిలుపునిచ్చారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామిలు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ నగర మహాసభలో కరీంనగర్‌లోని 60 డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సుధీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యచరణను రూపొందించడం జరుగుతుందని, రా నున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ పోటీ చేయుటకు కార్యకర్తలను సంసిద్ధం చేయడం జరుగుతుందన్నారు. నగరంలో గత రెండు సంవత్సరాలుగా అభివృద్ధి పనులు అటకెక్కాయని, గత ప్రభుత్వం ఆగమేఘాలపై అనేక పనులను శంకుస్థాపనలు చేసి వదిలేసిందని, చాలా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని ఎన్నికల ముందు చెప్పి పూర్తిగా మరిచిపోయారని ఆరోపించారు. నగరంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డుల కోసం, అర్హులైన వారికి పింఛన్ల కోసం భవిష్యత్ కార్యచరణ రూపొందించుకుని ముందుకెళ్లటానికి ఈ మహాసభ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం, ఆరు గ్యారంటీలు, అర్హులైన వారికి అందే వరకు ఉద్యమాలతో ఒత్తిడి తీసుకువచ్చి పేద ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందే వరకు పోరాట కార్యచరణ చేస్తామని వారు తెలిపారు. ఈ మహాసభ నగర ప్రజల దశదిశ మార్చేందుకు ఉపయోగపడుతుం దన్నారు. అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## గులాబీ దండు కదం తొక్కాలి

**మాజీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపు**



ప్రజాపక్షం/అంతర్గాం: గులాబీ దండు కదం తొక్కాలని, ఓరుగల్లు దద్దరిల్లాలని, కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని, 25 వసంతాల గులాబీ జాతరను విజయవంతం చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గురువారం అంతర్గాం, పాలకుర్తి మండలాల పార్టీ ముఖ్య నాయకులతో మూర్మూర్ పంపుహౌజ్ వద్ద మాజీ ఎమ్మెల్యే చందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ ఎన్నో అవమానాలు, మరెన్నో అవహేళనలు, అన్నింటిని అధిగమించి, తొలి సిఎం కెసిఆర్ నాయకత్వంలో స్వరాష్ట్రాన్ని సాధించి, 4 కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి, సగర్వంగా నిలిపింది గులాబీ జెండా అన్ని అన్నారు. పార్టీ 25వ సంవత్సరంలో అడుగెడుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకల్లో భారీ బహిరంగ సభకు రామగుండం నియోజకవర్గంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరు కూడ వేలాదిగా తరలిరావాలన్నారు. ప్రభుత్వంపై రోజు రోజుకు ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందన్నారు. ప్రజలు మళ్లీ కెసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో రెండు మండలాల పార్టీ అధ్యక్షులు కోల సంతోష్‌గౌడ్, ఇంజపురి నవీన్, సీనియర్ నాయకులు నడిపెల్లి ముళీధర్‌రావు, గోపు అయిలయ్య యాదవ్, నాయకులు కోల లత, బండారి ప్రవీణ్ కుమార్, మెరుగు పోషం, కొల్లూరి సతీష్, ఆర్శనపల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు.

## సుందరీకరణ పనుల పరిశీలన : మంత్రి పొన్నం



ప్రజాపక్షం/హుస్నాబాద్ : హుస్నాబాద్ పట్టణంలోని జరుగుతున్న సర్కిల్ల సుందరికరణ అభివృద్ధి పనులను గురువారం తెలంగాణ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభకర్ పరిశీలించారు. పట్టణంలోని అరెపల్లిచౌరస్తా , ఎల్లమ్మ చెరువు కట్ట అధునికరణ, పోలీస్ స్టన్ ముందు సర్కిల్లను స్థానిక నాయకులతో కలసి పరిశీలించి పనుల నత్తనడకన సాగుతండడం గమనించి పనుల పట్ల పట్ల కొంత అ సంతృప్తిని వ్యక్తం చేశారు. పట్టణంలోని అభి వృద్ధితోయపాటు సర్కిల్ల అభివృద్ధి చెందితేనే పట్టణలోని పట్టణంలోని వ్యాపారస్తులకు గాని బాట సారులకు, వాహనదారులకు ఎంతో ఉపయోగకంగా ఉం టుందన్నారు. అభివృద్ధిపనుల్లో జాప్యం లేకుండ త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదాలరును కోరారు. పనుల్లో జాప్యం లేకుండ తగు చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని స్థానిక నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింమూర్తి, సహకార సంఘం చైర్మెన్ బొల్లిశెట్టి శివయ్య, మండలాధ్యక్షుడు చందు, తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు

**30 వరకు అన్ని మండలాల్లో రైతులకు అవగాహన**

**సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**




ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : భూ సమస్యల పరిష్కారం దిశగా ధరణిస్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూభారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో భూ భారతి చ ట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అ గర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించేలా భూ భారతీ లా ంటి చారిత్రాత్మక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. భూభారతి చట్టం గురించి సంపూర్ణ అవగా హన ప్రజలకు కల్పించే దిశగా ఇదే తరహా అవగాహన సదస్సులను ఏప్రిల్ 17 నుండి 30 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. గతంలో భూమి విషయంలో తహశీల్దార్, ఆర్డీఒ వద్ద తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, భావించిన పక్షంలో నేరు గా అప్పిలు చేసుకునే అవకాశం లేకపోగా సివిల్ కోర్టుకు ఆశ్రయించవల్సి వచ్చేదన్నారు. కాని ఇప్పుడు తహశీల్దార్ వద్ద మ్యూటేషన్ అభ్యంతరాలు ఉన్నట్లయితే వాటిని 7 రోజుల్లోగా దరఖాస్తులు చేసినట్లయితే అక్కడివారు నోటీసు జారీ చేసి పూర్తి విచారణ జేసి నిర్ణయం తీసుకుంటారన్నారు. మ్యూటేషన్ జరిగిపోయిన పక్షంలో ఆర్డీఒ వద్దకు వెళ్లవచ్చన్నారు. దానిపై కూడ అభ్యంతరాలు ఉన్నట్లయితే జిల్లా కలెక్టర్ వద్దకు అక్కడే నిర్ణ యం తీసుకుంటారని, అక్కడ కూ డ అభ్యంతరం ఉంటే ల్యాండ్ ట్రిబ్యానల్‌కు వెళ్లవచ్చునన్నారు. ప్రతి భూమికి జియో భూదార్ కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రికార్డులను సైతం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడేం లింగమూర్తి, అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, ఆర్‌డిఒ సదానందం, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వేములవాడ రాజరాజేశ్వర ఆలయ అభివృద్ధికి చర్యలు

**జూన్ నుంచి ఆలయ పునర్నిర్మాణం పనులు**

**దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్**



ప్రజాపక్షం/ వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ గురువారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి వేములవాడ దేవాలయ ఆలయ అభివృద్ధి కోసం రూ.38 కోట్ల ప్రకటించారని, ఆగమ శాస్త్రం, వాస్తు అంశాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా ఆలయం పునః నిర్మాణం చేపట్టాలని కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తీర్ణం అభివృద్ధి కోసం ప్రభుత్వం 76 కోట్ల , అన్నదాన సూత్రానికి 35 కోట్ల మంజూరు చేసిందని అన్నారు. వేములవాడ దేవాలయ అభివృద్ధి, పట్టణ అభివృద్ధి సమాంతరంగా జరగాలని లక్ష్యంతో రోడ్డు వెడల్పు పనులకు 47కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అన్నదానం సత్రం నిర్మాణ పనులకు టెండర్ పూర్తి చేసామన్నారు. శృంగేరి పీఠాధిపతుల అనుమతి, ఆశీర్వాదం తీసుకొని ఆలయ అభివృద్ధి పనులు చేపడ్తున్నామన్నారు. స్వామి దర్శనం వేగంగా కల్పించేందుకు మెరుగైన వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శృంగేరి పీఠం అనుమతులు తీసుకున్న తర్వాత ఆలయ అభివృద్ధి పనులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి జూన్‌లో ఆలయ పునర్నిర్మాణం పనులు ప్రారంభించాలనేలక్ష్యంతోముందుకు వెళ్తున్నామన్నారు.

**రాజన్న భక్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు...**ఈ సందర్భంగా భీమేశ్వరాలయంలో భక్తులకు దర్శనం కల్పించే స్థలాలను పరిశీలించారు. ఆలయ ఆవరణలో కళ్యాణ మండపం, అభిషేకం మండపం, కోడె కట్టుట, క్యూ లైన్ తదితరు ఆర్జిత సేవల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో స్థపతి వల్లినాయగం, ఆర్కిటెక్ సత్యనారాయణ, ఈఓ వినోద్, ఈఈ రాజేశ్, డీఈ రఘు నందన్, ఆర్అండ్ బీ సీఈ బిల్డింగ్స్ రాజేశ్వర్ రెడ్డి, ఆర్ అండ్ బీ సీఈ ఎలక్ట్రికల్ లింగారెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ బి.లక్ష్మ ణ్, జిల్లా ఇఇ వెంకట రమణయ్య, ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ, శరత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం మార్చేందుకు బిజెపి కుట్ర

**కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్**



ప్రజాపక్షం/కొత్తపల్లి : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి భారత రాజ్యాంగం మార్చేందుకు కుట్ర చేస్తోందని కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్ ఆరోపించారు. జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను గురువారం కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన పురమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐసిసి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాలు అనుభవించే రిజర్వేషన్లు తొలగించేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను ఎండగడుతూనే మరో వైపు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ సంధర్భంగా ఎలగందల్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో కొత్తపల్లి మండల కోఆర్డినేటర్ సత్య ప్రసన్న, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల స్వామి గౌడ్, ఎలగందల్ గ్రామశాఖ అధ్యక్షులు ఆరె మల్లేశం, మాజీ సర్పంచ్ నిమ్మల అంజయ్య, గుండ మల్లేశం, మడుపు మోహన్, శ్రావణ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# నేల లేని 'హైడ్రోపోనిక్' వ్యవసాయం!



## వ్యవసాయం ప్రయోజనాలు..

అధిక జనాభాకు అధికంగా ఆహారాన్ని ఉత్పత్తి చేయడం. హైడ్రోపోనిక్ వాతావరణంలో, పెంపకందారులు పురుగుమందులను ఉపయోగించరు. ఎందుకంటే ఇండోర్ స్థానం కారణంగా తెగుళ్ళ ముట్టడి ప్రమాదం తక్కువగా ఉంటుంది. అదనంగా, మొక్కలు అవసరమైన పోషకాలను నేరుగా ద్రావణంలో పొందుతాయి. ఇది వాటిని వేగంగా అభివృద్ధి చేయడానికి, వ్యాధుల నుండి విముక్తి పొందటానికి వీలుకల్పిస్తుంది. ఉత్పత్తి మంచి నాణ్యతతో ఉండటమే కాకుండా, హైడ్రోపోనిక్ సెటప్ నగర ప్రాంతాల్లోని అధిక జనాభాకు అనుగుణంగా ఉంటుంది, అంటే నగరాల్లో స్థానిక ఆహారం లభ్యతను సూచిస్తుంది. తగ్గిన నీటి వినియోగం సాంప్రదాయ వ్యవసాయంతో పోలిస్తే హైడ్రోపోనిక్ వ్యవసాయం చాలా తక్కువ నీటిని ఉపయోగిస్తుంది. దీనికి కారణం నీటి ద్రావణాన్ని తిరిగి ఉపయోగించడం... పైపుల ద్వారా హైడ్రోపోనిక్ సెట్టింగ్‌లో తిరిగి ప్రసరణ చేయడం. అదనపు నీటిని పోషక ద్రావణ జలాశయానికి తిరిగి తీసుకువెళతారు. ఇది కరువు కారణంగా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో హైడ్రోపోనిక్స్‌ను మంచి వ్యవసాయ సాంకేతికతగా చేస్తుంది. సాంప్రదాయ వ్యవసాయంలో దీనికి విరుద్ధంగా, పెద్ద మొత్తంలో నీరు ఉపయోగించబడుతుంది, దీనిలో ఎక్కువ భాగం బాష్పీభవనం, సరైన నీటిపారుదల లేకపోవడం వల్ల వృథా అవుతుంది. చివరికి, చాలా తక్కువ శాతం నీరు మాత్రమే మొక్కలకు చేరుతుంది. హైడ్రోపోనిక్స్‌లో మొక్కలను పెంచడానికి నేల అవసరం లేదు. ఇది నేల ద్వారా సంక్రమించే వ్యాధులను తగ్గిస్తుంది. అదనంగా, ఈ వ్యవసాయ పద్ధతి ఇంటి లోపల జరుగుతుంది. ప్రతిదీ నియంత్రిత సెటప్‌లో ఉంటుంది కాబట్టి, తెగుళ్ల వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. మెరుగైన దిగుబడిహైడ్రోపోనిక్స్ మొక్కలను పెరగడానికి నియంత్రిత, పర్యవేక్షించబడిన వాతావరణాన్ని అందిస్తుంది. అదనంగా, అవసరమైన పోషకాలను నేరుగా వేర్లకు సరఫరా చేయడం వల్ల అవి వేగంగా పెరగడానికి సహాయపడుతుంది. సాగుదారులు రుతువులపై ఆధారపడాల్సిన అవసరం లేదు కాబట్టి ఇంటి లోపల వాతావరణం కూడా దిగుబడిపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. దీని అర్థం పంటలను ఏడాది పొడవునా పండించవచ్చు, తెగుళ్ళ జీవన, వాతావరణ మార్పులు, నేలపై జంతువులు, పక్షుల నుండి ఇబ్బందులు వంటి బాహ్య కారకాల వల్ల పంటలను కోల్పోయే సమస్య తగ్గుతుంది. ప్రాంతం లేదా ప్రాంతీయ వైవిధ్యానికి అనుగుణంగా ఇందులో మార్పులుచేర్పులు చేసుకునే అవకాశం ఉంది. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ఉత్తమ ప్రయోజనాల్లో ఒకటి అది స్థలాన్ని ఆదా చేస్తుంది. సాంప్రదాయ వ్యవసాయంలో, మొక్కలు నేలలో పోషకాల కోసం వెతకాలి, దీని కారణంగా మొక్కల లోతైన వేర్లు పెరుగుతాయి. మరోవైపు, హైడ్రోపోనిక్స్‌లో, పోషకాలు నేరుగా వేర్లకు సరఫరా చేయబడతాయి, కాబట్టి అవి వాటి కోసం వెతకాల్సిన అవసరం ఉండదు. తక్కువ దట్టమైన వేర్లు కలిగిన మొక్కలు తక్కువ స్థలాన్ని తీసుకుంటాయి, దీని వలన క్లోజ్ ప్రాంతాలు, ఎడారి పీడిత ప్రాంతాలు, అతి శీతల ప్రాంతాలలో నివసించే నగరవాసులకు హైడ్రోపోనిక్స్ అనువైన ఎంపిక. హైడ్రోపోనిక్స్ వ్యవసాయం పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి అనుమతిస్తుంది. ఎందుకంటే మొత్తం వాతావరణం దాదాపుగా నియంత్రణలో ఉంటుంది. మొక్కలకు అవసరమైన స్థూల, సూక్ష్మ పోషకాలు మాత్రమే అందుతాయి. పెరుగుదలకు అవసరమైన సరైన పోషకాలను అందించడం ద్వారా, హైడ్రోపోనిక్స్ ద్వారా పెరిగిన మొక్కలు సాంప్రదాయ వ్యవసాయం ద్వారా పెరిగిన మొక్కలతో పోలిస్తే మెరుగైన దిగుబడి, అధిక వృద్ధి రేటును సాధిస్తాయి. ఇక్కడ మొక్కలు వివిధ పర్యావరణ పారామితులపై ఆధారపడిన నేలలో ఉండే పోషకాలపై ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు, తేమ, ఉష్ణోగ్రత, నీటి నాణ్యతతో వైవిధ్యం మొక్కలను ఒత్తిడికి గురి చేస్తుంది, ఇది వాటి జీవరసాయన నిర్మాణాన్ని ప్రభావితం చేస్తుంది, ఇది పెరుగుదల, ఉత్పత్తుల నాణ్యతను ప్రభావితం చేస్తుంది. 6. సమయం ఆదా చేసే వ్యవసాయసాంప్రదాయ వ్యవసాయంలో దున్నడం, కలుపు తీయడం, నీరు పెట్టడం వంటి పనులకు పర్యవేక్షించండానికి రైతుల నుండి చాలా శ్రమ, సమయం అవసరం. ఇవన్నీ నాణ్యత, పరిమాణం పరంగా ఎల్లప్పుడూ తగినంత లేదా సంతృప్తికరంగా ఉండకపోవచ్చు. దీనికి విరుద్ధంగా, హైడ్రోపోనిక్స్‌లో, మీకు కావలసిందల్లా మీకు నచ్చిన స్థలంలో దానిని ఏర్పాటు చేసి, మీ మొక్కలు పెరగడాన్ని చూడటం. దీనికి ప్రారంభ పెట్టుబడి, సమయం అవసరం కావచ్చు కానీ, సరిగా నిర్వహించినట్లయితే, ఇది దీర్ఘకాలిక అధిక రాబడిని హామీ ఇస్తుంది. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ప్రతికూలతలు సాంప్రదాయ వ్యవసాయంతో పోలిస్తే హైడ్రోపోనిక్ వ్యవసాయం సులభం మరియు మరింత ప్రభావవంతంగా ఉంటుంది.

దేశంలో భూసార విలువలు తగ్గుతున్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఫలితంగా నేల లేకుండానే వ్యవసాయ విధానాల ఆవశ్యకత తెరపైకి వస్తున్నాయి. వివిధ అధ్యయనాల అభిప్రాయం ప్రకారం, ఇటీవలి కాలంలో వ్యవసాయం పురుగుమందులు మరియు రసాయనాలపై ఎక్కువగా ఆధారపడుతున్నది. ఈ రసాయనాలు, నేలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. కాలుష్యం పెరుగుతున్నది. పెద్ద ఎత్తున నేల క్షీణతతో పాటు, వాతావరణ మార్పుకూ కారణమవుతున్నది. ఈ అంశాలు పంటలను పండించే భూమి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి, ఇది ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరతకు దారితీస్తున్నది. ఇటీవలి సంవత్సరాలలో, వ్యవసాయ పద్ధతులు శాశ్వత సంస్కృతి , పంటల భ్రమణ, పాలీ కల్చర్, హైడ్రోపోనిక్ వ్యవసాయం వంటి స్థిరమైన ఆహార పెంపకం పద్ధతుల వైపు ప్రధాన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వీటిలో హైడ్రోపోనిక్ వ్యవసాయం ప్రధానమైనది. గ్రీకు పదాలైన "హైడ్రో" (నీరు), "పోనోస్" (శ్రమ) నుండి ఉద్భవించిన హైడ్రోపోనిక్స్ అంటే "నీటితో పనిచేయడం" అని అర్థం. ఈ పదం ముఖ్యంగా నేల లేకుండా పంటలను పండించే పద్ధతిని సూచిస్తుంది. ఇది విరుద్ధమైనదిగా అనిపించవచ్చు. ఎందుకంటే మొక్కలు వాటి పెరుగుదలకు అవసరమైన పోషకాలను నేల నుండి పొందుతాయి, అవి లేకుండా అవి చనిపోయే అవకాశం ఉంది. అయితే, హైడ్రోపోనిక్ మొక్కలు నీటి ద్రావణ మాధ్యమం నుండి అవసరమైన అన్ని పోషకాలను పొందుతాయి, అందువల్ల నేల ఉనికి దాని మనుగడకు అనవసరం అవుతుంది. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి, ఈ పద్ధతిని చిన్న, పెద్ద తరహా వ్యవసాయంలో ఉపయోగించవచ్చు. అపార్ట్‌మెంట్లలో నివసించేవారు లేదా తోట లేనివారు వంటి పెద్ద స్థలం లేని వ్యక్తులు మొక్కలను పెంచడానికి హైడ్రోపోనిక్‌లను విజయవంతంగా ఉపయోగించవచ్చు. స్థిరమైన ఆహార సాగు పద్ధతిని అందించడం పట్ల హైడ్రోపోనిక్స్ సాగుదారులలో సానుకూల ఆకర్షణను పొందుతున్నప్పటికీ, హైడ్రోపోనిక్ వాతావరణంలో సరిగ్గా పెరగని కొన్ని మొక్కలు ఉన్నాయి. వీటిలో బంగాళాదుంపలు, పొడవుగా పెరిగే మొక్కలు మరియు తీగలు వంటి లోతైన వేర్లు ఉన్నవి ఉన్నాయి. ఒక మొక్క పెరగాలంటే, మూడు విషయాలు చాలా ముఖ్యమైనవి: సూర్యరశ్మి, నీరు మరియు పోషకాలు. సాంప్రదాయ వాతావరణంలో, మొక్కలను నేలలో పెంచుతారు, ఇది వాటికి అవసరమైన పోషకాలు, నీటిని పొందే మాధ్యమంగా పనిచేస్తుంది. హైడ్రోపోనిక్ మొక్కలు వివిధ రకాల పరికరాల ద్వారా వేర్లకు చేరే ద్రావణం ద్వారా అన్ని అవసరమైన పోషకాలను పొందుతాయి. హైడ్రోపోనిక్ వాతావరణంలో రెండు రకాల సాగు పద్ధతులు ఆధిపత్యం చెలాయిస్తాయి... యాక్టివ్ సిస్టమ్‌మొక్కల వేర్లు పంపుల నుంచి ప్రసరించే నీటి ద్రావణం ద్వారా పోషకాలను నేరుగా పొందే వ్యవస్థను యాక్టివ్ సిస్టమ్ అంటారు. ఈ వ్యవస్థ మరింత క్లిష్టంగా ఉంటుంది, కాబట్టి కొంతమంది సాగుదారులు దీనిని సంక్లిష్టంగా భావించవచ్చు. యాక్టివ్ సిస్టమ్ పోషక ద్రావణాన్ని రిజర్వాయర్ నుండి వేళ్లకు తరలించే పంపులను ఉపయోగిస్తుంది. వేర్లు గ్రహించలేని అదనపు ద్రావణం తిరిగి జలాశయంలోకి ప్రయాణిస్తుంది. నిష్క్రియాత్మక వ్యవస్థనిష్క్రియాత్మక వ్యవస్థకు ద్రావణాన్ని ప్రసరింపజేయడానికి పంపు అవసరం లేదు. బదులుగా, మొక్కలను దావణంలో వేలాడదీస్తారు. తరువాత గురుత్వాకర్షణ, వరదలు లేదా కేశనాళిక వ్యవస్థలపై ఆధారపడే వివిధ పద్ధతుల ద్వారా మూలాలను చేరుతాయి. ఈ రకమైన హైడ్రోపోనిక్ వ్యవసాయం పంపుల ప్రమేయం లేనందున ఉపయోగించడం సులభం. అయితే, రైతు తరచుగా నీటిని మార్చాల్సి ఉంటుంది. అంతేకాకుండా, పంపులు లేకపోవడం వల్ల ఆల్గే పెరగడం సులభం అవుతుంది, ఇది నీటి నాణ్యతను దిగజార్చవచ్చు. హైడ్రోపోనిక్ వ్యవసాయం యొక్క ప్రయోజనాలు మొక్కలను పెంచడానికి హైడ్రోపోనిక్స్ ఒక ప్రభావవంతమైన వ్యవస్థ, మరియు రాబోయే భవిష్యత్తులో, ఇది ఆహార ఉత్పత్తికి అత్యంత ఉపయోగకరమైన స్థిరమైన మార్గాలలో ఒకటిగా మారే అవకాశం ఉంది.



## సమస్యలు..



హైడ్రోపోనిక్ వ్యవసాయం కూడా కొన్ని లోపాలను కలిగి ఉంది. మొదటగా, అధిక సెటప్ ఖర్చుహైడ్రోపోనిక్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ఖరీదైనది. అనుకూలీకరించిన డిజైన్‌ను ఉపయోగించే పెద్దస్థాయి వ్యవస్థకు ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. హైడ్రోపోనిక్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఉపయోగించే యాంత్రికీకరణ, సాంకేతికత ఆధారంగా, నీటి శుద్ధి కర్మాగారం, పోషక ట్యాంక్, లైటింగ్, ఎయిర్ పంప్, రిజర్వాయర్, ఉష్ణోగ్రత నియంత్రిక, ఆమ్లత్వ నియంత్రణ, ప్లంబింగ్ వ్యవస్థలు వంటి వాటి ప్రారంభ సంస్థాపనకు భారీ ప్రారంభ బడ్జెట్ అవసరం కావచ్చు. స్థిరమైన విద్యుత్ సరఫరా/వ్యవస్థపై ఆధారపడటంమరో సమస్య.హైడ్రోపోనిక్ వ్యవసాయ వ్యవస్థ దాని వివిధ భాగాలను నిరంతరం పని చేయడానికి విద్యుత్తుపై ఎక్కువగా ఆధారపడుతుంది. విద్యుత్తు అంతరాయం ఏర్పడితే, మొత్తం వ్యవస్థ విఫలమయ్యే ప్రమాదం ఉంది, ఇది మొక్కలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. బోవరీ ఫార్మింగ్ వంటి కొత్త తరం పొలాలు సౌరశక్తితో నడిచే హైడ్రోపోనిక్ వ్యవస్థలను ఉపయోగిస్తున్నప్పటికీ , సౌరశక్తిని ప్రధాన విద్యుత్ సరఫరాగా ఉపయోగించే ఇండోర్ వర్టికల్ హైడ్రోపోనిక్ గార్డెన్‌లు విద్యుత్ వనరుల కొనసాగింపును నిర్వహించడానికి ప్రారంభ కార్యాచరణ ఖర్చుల గురించి ఇప్పటికీ సవాళ్లు ఉన్నాయి. పునరుత్పాదక శక్తి వనరుల వాడకం ఖచ్చితంగా పెరుగుతున్నప్పటికీ, శిలాజ శక్తిపై ఆధారపడటం ఇప్పటికీ ప్రతికూలతగా ఉంది. కాగా, ఉన్నత స్థాయి నిర్వహణ, పర్యవేక్షణ హైడ్రోపోనిక్ వ్యవస్థలోని వివిధ భాగాలు కలిసి పనిచేస్తాయి, తద్వారా మొక్కలకు పోషకాలు సజావుగా సరఫరా అవుతాయి. ఈ భాగాలలో దేనిలోనైనా వైఫల్యాన్ని నివారించడానికి, పెంపకందారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. పంపులు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా ఉష్ణోగ్రత, వెలుతురు సరిపోతాయో లేదో తనిఖీ చేయడానికి నిరంతరం పర్యవేక్షణ అవసరం. నీటి ద్వారా వచ్చే వ్యాధులకు గురయ్యే అవకాశంహైడ్రోపోనిక్ వ్యవస్థలో మొక్కలను పెంచడం వల్ల నేల ద్వారా సంక్రమించే వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది, అయితే వ్యవస్థ ద్వారా నీటి నిరంతర ప్రసరణ మొక్కలను కొన్ని నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందికొ న్నిసార్లు, ఈ వ్యాధులు ఒక మొక్క నుండి మిగిలిన మొక్కకు నీటి ద్రావణం ద్వారా వ్యాపిస్తాయి. ఇది వ్యవస్థలోని అన్ని మొక్కలను నాశనం చేసే అవకాశం ఉంది. అంతేగాక, ప్రత్యేక నైపుణ్యం అవసరం.హైడ్రోపోనిక్ వ్యవస్థలో చాలా సాంకేతిక అంశాలు ఉంటాయి. ఈ వ్యవస్థలో ఉండే పరికరాలు, సాంకేతికతలకు వాటిని ఎలా ఉపయోగించాలో సరైన జ్ఞానం మరియు నైపుణ్యం ఉన్న వ్యక్తి అవసరం. తగిన నైపుణ్యం లేకుండా మొక్కలు పెరగకపోవచ్చు, ఇది దిగుబడిని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది, దీనివల్ల భారీ నష్టం జరుగుతుంది. సేంద్రీయ లేబుళ్ల చర్చనీయాంశ స్వభావంహైడ్రోపోనిక్ వ్యవసాయంలో పురుగుమందులు ఉపయోగించరు కాబట్టి, హైడ్రోపోనిక్ మొక్కలను సేంద్రీయంగా ధృవీకరించడానికి అది తగినంత కారణం అవుతుందా? సేంద్రీయ వ్యవసాయం అంటే నేల నాణ్యతను మెరుగుపరచడం. దాని సారాన్ని మెరుగుపరచడం అనే లక్ష్యంతో పనిచేయడం కాబట్టి కొంతమంది సేంద్రీయ రైతులు ఈ ఆలోచనను వ్యతిరేకిస్తున్నారు. ఏదిఏమైనా, ప్రతి అంశంలోనూ లాభనష్టాలు ఉంటాయి. సానుకూల పరిస్థితులను పరిగణలోకి తీసుకొని, ముందుకు వెళ్లడం మంచిది. స్థూలంగా చూస్తే, హైడ్రోపోనిక్ వ్యవసాయం అనేది ఇంటి లోపల మొక్కలను పెంచడానికి ఒక ప్రభావవంతమైన పద్ధతి. దీనికి వివిధ మార్గాల్లో దాని స్వంత ప్రయోజనాలు ఉన్నాయి. ఇది పెంపకందారులు పురుగుమందుల వాడకం లేకుండా పోషకాలు అధికంగా ఉండే మొక్కలను చాలా వేగంగా ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. ఇది కొన్ని ప్రతికూలతలతో వచ్చినప్పటికీ, దాని ప్రయోజనాలు లోపాల కంటే ఎక్కువగా ఉంటాయి. పునరుత్పాదక ఇంధన వనరుల సరైన జ్ఞానం మరియు వినియోగంతో, వ్యక్తులు, సంస్థలు, సమాజాలు ఏడాది పొడవునా వ్యాధి రహిత మొక్కలను పెంచడానికి హైడ్రోపోనిక్స్‌ను ఉపయోగించవచ్చు.

---

## అకాల వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** రాజాపూర్ మండల పరిధిలో గల గుండ్ల పొట్లపల్లి గ్రా మంలో గురువారం అకాల వడగళ్ల వర్షానికి నష్టపోయిన మొక్కజొన్న, వరి, కూరగాయల తోటలు సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ పరిశీలించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు భారీగా వనగండ్ల వర్షం కురవడం వల్ల నష్టపోయిన పంటలను పరిశీలిచిన ఆయన మాట్లాడుతూ ఒక ఎకరానికి మొక్కజొన్నకు పెట్టుబడి ఖర్చు 25 నుంచి 30 వేల వరకు, వరి ఎకరానికి పెట్టుబడి ఖర్చు 30 వేల వరకు వస్తుంది ఇప్పుడు వనగండ్ల వర్షం వల్ల పూర్తిగా పంట నష్ట పోవడం జరిగినది కావున ప్రభు త్వం పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక ఎకరానికి మొక్కజొన్నకు రూ.40 వేలు, వరికి రూ.50వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బి.కృష్ణ యాదవ్, వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా అధ్యక్షులు జి.సత్యనారాయణ రెడ్డి, మాడెమోని ఆంజనేయులు, రైతులు, యాదగిరి, ఎం.గోవర్ధన్, కే.మహేష్, ఆకుల నర్సింలు, హనుమం తు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## 29న ఎఐవైఎఫ్ యాదాద్రి జిల్లా 2వ మహాసభలు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా 2వ మహాసభల కరపత్రాన్ని బొమ్మలరామారం మండల కేంద్రంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబొయిన మహేందర్ మాట్లాడుతూ యాదగిరి గుట్ట పట్టణంలోని లక్కీ పంక్షన్ హాల్‌లో ఈనెల 29న జరిగే 2వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ దేశంలో పెరుగుతున్న మత ఛాందసవాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తుల ఐక్యత కొరకు యువత పనిచేయాలని ఈ దేశ సమగ్రత సమైక్యతను కాపాడుట కొరకు యువత ఉద్యమాలు నిర్వహించాలన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించడానికి ఈ మహాసభలు నాంది కావాలని యువతకు సూచించారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ఎఐవైఎఫ్ అని, ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలన్నారు. ఈ నెల 29న యాదగిరిగుట్టలో జరిగే జిల్లా మహాసభకు యువకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేష్, కల్లెపల్లి మహేందర్, గోపాగని రాజు, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ తుమ్మల జ్యోతి, శ్రీను నాయక్, ప్రశాంత్ నాయక్, టి.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కేంద్ర ఆస్పత్రిని.. వెయ్యి పడకలకు పెంచాలి

### సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : ఎఐటియుసి డిమాండ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాలని, మెడికల్ కళాశాల నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షులు సుధాకర్ అన్నారు. గురువారం ప్రభుత్వ ఆస్పత్రి నిజామాబాద్‌లో రాష్ట్ర డిఎంఇ నరేంద్ర కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాల్సిన అవసరముందని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాల్సిన అవసరముందని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ప్రతిరోజు నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు చెందిన రోగులు రోజుకు సుమారు 2500 మంది అవుట్ పేషన్స్, 1200 మంది ఇన్ పేషంట్స్‌లకు పైగా రోగులు చికిత్స కోసం వస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిని మరింత మెరుగ్గా తయారుచేయాల్సిన అవసరముందన్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వారిపై పని భారం పెరుగుతున్నందున రెగ్యులర్ సిబ్బందితో పాటు శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీని పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి స మాన వేతనం చెల్లించాలని కోరారు. మెడికల్ కళాశాలలో గత టెండర్ కంటే బడ్జెట్ తగ్గించి టెండర్ వేయటంతో కార్మికులపై పని భారం పెరుగుతుందని బడ్జెట్‌ను పెంచి కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. డిఎంఇ స్పందిస్తూ ప్రభుత్వ ఆ స్పత్రికి రోగులకు పెరుగుతున్నారని చెబుతున్నందున పెంచే ప్రయత్నం చేస్తామని సిబ్బంది కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారని తెలిపారు. డిఎంఇని కలిసిన వారిలో యూనియ న్ నాయకులు భాగ్యలక్ష్మి , అహ్మది, స్వరూప, వెంకటేష్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించుకునేందుకు కార్మికులందరూ ఏకం కావాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఈనెల 21,22 తేదిలలో జరిగే తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు రమేష్ అన్నారు. వరంగల్ శివనగర్ తమ్మెరభవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేష్ మాట్లాడుతూ దేశంలో ఉత్పత్తిలో కీలకమైన కార్మికులకు సంపదను పంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి విఫలమయ్యాయన్నారు. ఈ దేశ నిర్మాణ రంగంలో ప్రముఖ పాత్ర కార్మికుల దేనని, అయినా పాలక ప్రభుత్వాలు కార్మికుల కోసం ఉన్న చట్టాలను అమ్మలు పరచకుండా నిర్వీరం చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు కార్మిక సోదరులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి యూనియన్ సమక్షంలో సంఘటితమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ 21,22న శంషాబాద్ రంగారెడ్డి జిల్లాలో జరగబోయే 4వ మహాసభలకు వరంగల్ జిల్లా భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలు కార్మికులు హాజరై విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు గుండె భద్రి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మియాపురం గోవర్ధన్, జిల్లా అధ్యక్షులు ఎండి యాకుబ్, జిల్లా కోశాధికారి దండు లక్ష్మ ణ్, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఉప్పుల రవి, యోగానంద చారి, నల్ల తీగల కుమార్, గజవెల్లి చిరంజీవి, జన్ను రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం : దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చందంపేట:** నల్గొండ జిల్లా చందంపేట మండలం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చా రు. గురువారం మండల సిపిఐ కౌన్సిల్ సమావేశం జూలూరు మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ధర 50 పెంచి పేద ప్రజలపై భారం వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ ఫలాలు ప్రజలకు అందకుండా బిజెపి అడ్డుకుంటుందని ఆరోపించారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ఆయన కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం ప్రజలకు అండగా నిలిచి పోరాడుతుందని దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, సహాయ కార్యదర్శి వెంగలయ్య, కృష్ణారెడ్డి, మహేష్, కిష్టయ్య, లాలయ్య, హనుమంతు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం 20న యువ కార్మికుల సదస్సు

### ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం, కార్మికుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం, ఉద్యోగ భద్రత కోసం, కొత్త గనులు రావడం కోసం ఈ నెల 20న గోదావరిఖనిలో యువ కార్మికుల సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని, అట్టి సదస్సును విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు పేర్కొన్నారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్‌లో వారు కార్మికులను కలిసిన అనంతరం మాట్లాడుతూ, సింగరేణిలో బొగ్గు నిలువలు ఐదు సంవత్సరాల వరకు ఉన్నాయని, కొత్త గనులు వస్తనే సింగరేణికి మనుగడ కొనసాగుతుందని లేకుంటే యువ కార్మికులకు ఉద్యోగ భద్రత కొరవడుతుందని వారు అన్నారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి యూసఫ్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ శంకర్ నారాయణలు పాల్గొని సింగరేణి భవిష్యత్తు, దశదిశ, యువ కార్మికుల భవిష్యత్తు గురించి ప్రసంగించెదరని వారు పేర్కొన్నారు. ఇట్టి సదస్సులో యువ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఎఐటియుసి డిపార్ట్మెంట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, బ్రాంచి ఆఫీస్ బేరర్ ఆకునూరి శంకరయ్య, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ గౌస్, ఎఐటియుసి డిపార్ట్మెంట్ సలహా దారులు బిట్టి వెంకటేశ్వర్లు, నాయకులు బి.ఆర్.కె.రెడ్డి, జెరిపోతుల దేవయ్య, బొల్లి శ్రీనివాస్, తోట చెంద్రయ్య, సునీల్, రామకృష్ణ, శంకరయ్య, లక్ష్మ య్య, మేకల లింగయ్య, వీరేశం, సతీష్, హరికాంత్, రవిందర్, బిక్షపతి, ప్రేమలత, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/శంకరపట్నం :** మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్క్ అండ్ యూనియన్ మహాసభల వాల్ పోస్టర్‌ను కరీంనగర్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య ముఖ్య అతిధిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీలలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో జరిగే మహాసభలకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొజ్జ సదానందం, మేకల పరమేష్, గోదారి లక్ష్మ ణ్, రమేష్, శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఎంఎల్‌ఎ కూనంనేని సుడిగాలి పర్యటన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు నేడు కొత్తగూడెం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. ఉ.10 గం.లకు పాల్వంచ పట్టణం, మండల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నారు. 11 గం.లకు కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం టౌన్, లక్ష్మీ దేవిపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారు. 11.30 గం.లకు కొత్తగూడెం క్లబ్‌లోనే 170 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తారు. మ.12.30 గం.లకు లోతువాగులో ఐటిడిఏ నిర్మించిన సబ్‌సెంటర్ ప్రారంభించనున్నారు. మ.1.30 గం.లకు రామాంజనేయ కాలనీలో ఐటిడిఏ నిర్మించిన గ్రామపంచాయితీ కార్యాలయాన్ని, 2 గం.లకు వెంకటేశ్వర కాలనీలో గ్రామపంచాయితీ కార్యాలయం, సా. 4.30 గం.లకు విద్యానగర్ కాలనీలో సబ్‌సెంటర్ ను ప్రారంభిస్తారు.

## పేదల పెన్నిధి .. సిఎం సహాయ నిధి



**ప్రజాపక్షం/ మధిర :**ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు పెన్నిదని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మధిర మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన రూ.6లక్షల విలువ గల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు వైద్య సహాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు దారా బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, మండల కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వరరెడ్డి, బిసిసెల్ అధ్యక్షులు చిలివేరు బుచ్చిరామయ్య, నాయకులు , పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐటిలో అరోహన్ 'ఫెస్ట్ పోస్టర్'ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 25న నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్ అరోహన్ 2025కు సంబంధించిన పోస్టర్, థీమ్ సాంగ్‌ను కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వినోదం కూడా అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ ఈ ఫెస్ట్‌లో కల్చరల్‌తో పాటు టెక్నికల్ ఈవెంట్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న ఫెస్ట్‌కు అరోహన్ అనే టైటిల్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, శ్రీనివాసరావు, హెచ్ ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వడగండ్ల వానకు కుదేలైన మామిడి రైతు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:**అన్నపురెడ్డిపల్లి మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్నటువంటి వడగండ్ల వాన ఈదురుగాలులతో మామిడి తోటలో కాయలు నేలరాలి..అకాల వర్షంతో మామిడి రైతు కుదేలైపోయాడు. రాళ్ల వానతో రెండు పద్దాడు. మండలంలో ఉన్నటువంటి మామిడి తోటలలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం మామిడి రేటు ఆకాశాన్నంటింది. అదే సమయంలో ప్రకృతి వైపరీత్యం వలన వడగండ్ల వాన కురవడంతో కాయలు ఒక్కసారిగా కాయలు నేలరాలి ఒక్కసారిగా మామిడి ధర కుప్పకూలిపోయింది. మార్చి నెలలో ఉన్న 90వేలు ఉండగా, వడగండ్ల వర్షం తర్వాత ఒక్కసారిగా 30 నుండి 40 వరకు చేరుకుంది. ఎన్నో ఆశలు పెట్టుకున్న మామిడి తోటలలో అక్కడక్కడ చెట్లు కూకటివేళ్లతో పెకిలి కూలి పోయాయి. ఒక ప్రక్క ధర లేక మరో ప్రక్క చెట్లు కూలిపోయి రైతులు రంది పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం తప్పకుండా రైతులను ఆదుకోవాలని మండలంలోని మామిడి తోటల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


## హిమోఫిలియాపై అవగాహన

డిఎంఅండ్‌హెచ్‌ఒ కళావతిభాయి



**ప్రజాపక్షం/మధిర:** హిమోఫిలియా కొన్ని కుటుంబాల్లో మేనరిక వివాహ సంబంధాల ద్వారా పుట్టిన పిల్లలకు వస్తుందని, దీనిపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కళావతిభాయి అన్నారు. గురువారం మధిర ప్రభుత్వాత్రిలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హిమోఫిలియా వ్యాధిపై అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిమోఫిలియా వ్యాధి వలన తీవ్ర రక్తస్రావం ఉంటుందని, రక్తం గడ్డ కట్టకపోవడం లాంటి సమస్యలు ఉన్న వారు వెంటనే ప్రభుత్వాసుపత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఆరోగ్య సిబ్బంది హిమోఫిలియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.కార్యక్రమంలో మాటూరుపేట, దెందుకూరు పి హెచ్‌సి యూనిట్ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నా రు.

## ఆల్ ఇండియా నేషనల్‌కు ఎంపికైన శైలజ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**పట్టణంలోని ద్వారకాపురి కాలనీకి చెందిన డోజర్ డ్రైవర్ నడ్డి నాగరాజు, నాగేశ్వరమ్మ దంపతుల కుమార్తె శైలజ సాఫ్ట్ బాల్ ఆల్ ఇండియా నేషనల్ కి ఎంపికైంది. శైలజ ఉన్నత చదువులు చదువుతునే కరాటే పై ఉన్న ఆసక్తితో ముందుకు వెళ్తూ, ఆటల్లో రాణిస్తుంది. 10 వ తరగతి నుండే తండ్రి కోరిక మీద కరాటేలో రాణిస్తూ బ్లాక్ బెల్ట్ స్థాయికి చేరుకుంది. కరాటే శిక్షకుడు పిచ్చయ్య, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏప్రిల్ 15న జరిగిన ఉమెన్ సాఫ్ట్ బాల్ సెలక్షన్స్ లో ఆల్ ఇండియా నేషనల్ కి సెలక్ట్ అయింది. ఆర్మీలో ఉద్యోగం సాధించటమే తన లక్ష్యమని, ఆర్మీలో ఉద్యోగం సాధించి తల్లిదండ్రుల కోరిక నెరవేర్చుతానంటుంది. శైలజ ప్రస్తుతం ఖమ్మంలోని ఎస్.సి డిడి గర్ల్స్ హాస్టల్లో బిపిఈడి మొదటి సంవత్సరం చదువుతుంది. సాఫ్ట్ బాల్ నేషనల్ శిక్షణ నిమిత్తం 10 రోజులు వరంగల్ క్యాంపస్ లో శిక్షణకు వెళ్ళనుంది.

# వానాకాలం పంటల ప్రణాళిక ఖరారు

6,03,124 ఎకరాల్లో సాగు అంచనాలు

స్వల్పంగా తగ్గిన వరి, మొక్కజొన్న





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో వానా కాలం పంటల ప్రణాళికల సిద్ధమైంది. ఇందుకు సంబంధించి జిల్లా వ్యవసాయాధికారులు అంచనాలు తయారు చేశారు. ఈ ఏడాది 6 లక్షల 3 వేల 124 ఎకరాల్లో సాగుకు అనుకూలమైన భూమి ఉన్నట్లు అంచనాలు తయారు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 10860 ఎకరాల్లో సాగు పెరిగింది. కాగా వరి, మొక్కజొన్న సాగు మాత్రం గత ఏడాది కంటే ఈ ఏడాది స్వల్పంగా తగ్గే అవకాశాలు ఉన్నట్లు అధికారులు లెక్కలు కట్టారు.

గత వానా కాలం సీజన్లో 5,92,264 ఎకరాల్లోనే సాగు విస్తీర్ణం ఉండగా ఈ సారి మాత్రం 6,03,124 ఎకరాల్లో సాగు ఉండనుంది. ఇందు తగిన ప్రణాళికలతో పాటు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలోసేకరించిన అచనాల ప్రకారం ఈ సాగుకు రైతులు సమాయత్తం కానున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది వరి 1,64,663 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి 1,60956 ఎకరాల్లో మాత్రమే సాగు చేయనన్నట్లు అంచనాలు తయారు చేయడంతో గత ఏడాది పోలిస్తే 3707 ఎకరాల్లో వరి సాగు తగ్గింది. అదే విధంగా మొక్కజొన్నలు సైతం గత ఏడాది 85825 ఎకరాల్లో సాగు చేస్తే ఈ ఏడాది మాత్రం 85544 ఎకరాల్లో మాత్రమే సాగు చేయనుండటంతో 281 ఎకరాల్లో సాగు తగ్గే అవకాశం ఉన్నట్లు అంచనాలు కట్టారు. కాగా పట్టాలు వచ్చిన పోడుభూముల్లో కూడా ఈ సారి అధిక మొత్తంలో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. దీంతో ఏటేటా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది.

**సాగువిస్తీర్ణం ఇలా:**వ్యవసాయ అటవీ ఉత్పత్తులు289 82 ఎకరాలు, వరి 160986, మొక్కజొన్న85544,పత్తి 204632, వేరుశనగ2791,పండ్ల పంటలు10195, జీడిపప్పు11903, కోకో652,కొబ్బరి1805, పామాయిల్ 75000 ఎకరాలు, మినుములు857 ,పెసలు131,కందులు1159,మిర్చి10489, కూరగాయలు501,ఇతరపంటలు5025,మునగ2500ఎకరాలుకలిపిమొత్తంగా 603124 ఎకరాల్లో సాగు చేయనున్నారు. ఇందు కు సంబంధించి మండల వ్యవసాయాధికారులు ఇప్పటి నుండే రైతులతో మమేకమై వానాకాలం పంటల సాగు కు తీసుకోవాల్సిన చర్యలు, యాజమాన్య పద్ధతులు, భూ సార పరీక్షలు, పంటమార్పిడి విధానాలు, ఎరువులు ,పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కూడాప్రణాళికలుసిద్ధంచేస్తున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పొలాలను చదును చేసుకున్న రైతులు మే నెల్లో వేసవి దుక్కులు దున్నేందుకుసమాయత్తంఅవుతున్నారు.

## మునగ, ఆయిల్ పామ్‌తో లాభాలు

మునగ, ఆయిల్ పామ్ క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**మునగ ఆయిల్ ఫామ్‌తో రైతుల లాభాలు చేకూరుతాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మద్దెల వెంకటేశ్వర్లు వ్యవసాయ క్షేత్రంలో ఆయన పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే మునగ, ఆయిల్ ఫామ్ వైపు రైతులు మొగ్గు చూపాలని వారు సూచించారు. మునగ తో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. మద్దెల వెంకటేశ్వర్లు రైతుని, రైతులు ఆదర్శంగా తీసుకొని మండలంలో అధిక విస్తీర్ణంలో మునగ ఆయిల్ ఫామ్ సాగు చేసుకోవాలని సూచించారు. వీటితో పాటు చేపల పెంపకం, పందిరి పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ, ఎఇఒ,ఎపిఒలను కలెక్టర్ అభినందించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఒ, ఎంపిడిఒ శ్రీను, ఆర్‌ఐ రామయ్య, డాక్టర్ సంఘమిత్ర, ఎఒ అనిల్‌కుమార్, ఎఇఒ , టిఎలు, మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మండల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

కలెక్టర్‌ను సన్మానించిన సిపిఐ శ్రేణులు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**మండల సమస్యలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మాజీ వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య కోరారు. గురువారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో భూ భారతి2025 అవగాహన సదస్సుకు హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ని సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో పట్టు శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మండల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. మండలంలోని ఆళ్లపల్లి మసీదు దగ్గర నుండి అంబేద్కర్ నగర్ అంగన్వాడీ మీదుగా ఆర్‌అండ్‌బి రోడ్ వరకు సిసి రోడ్ మంజూరు చేయాలని, ఆళ్లపల్లి నుండి అనిశెట్టిపల్లి వరకు డబుల్ రోడ్డు రహదారి మంజూరు చేయాలని, రాయిగూడెం అంతర్గత సిసి రోడ్, బాటననగర్ వరకు రోడ్డు మంజూరు చేయాలని, మండల కేంద్రంలో ఒక రెసిడెన్షియల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా మర్కోడు టూ కరకగూడెం వరకు, ఆళ్లపల్లి నుండి పెద్ద వెంకటాపురం మీదుగా సింగారం వరకు ఫారెస్ట్ పర్మిషన్ ఇప్పించి రోడ్డు మంజూరు చేయాలని, గుండా ల వెళ్లే మార్గంలో కిన్నెరసాని నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జికి ఫారెస్ట్ అనుమతులను ఇప్పించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన మండలమైనందున ఆళ్లపల్లిలో అన్ని శాఖల మండల సముదాయ భవనాలు నిర్మించాలని, మండలానికి ఎస్‌సి, లేదా బిసిహాస్టల్ మంజూరు చేయాలని తదితర ప్రధాన సమస్యలను కలెక్టర్‌కి వ్రాతపూర్వకంగా విన్నవించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి గొగ్గల లక్ష్మి, మాజీ ఎంపిటిసికొమరం హనుమంతు, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే రహీం, మాజీ ఉప సర్పంచ్ లాజర్, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు పరమ ఇమ్మానియేల్, మండల నాయకులు కుంట సహదేవ్, మద్దెల వెంకటేశ్వర్లు, దీకొండ మల్లేష్, రేసు సురేందర్, కసనబోయిన నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ప్రజాపక్షం/కల్లూరు:**మహిళలను కోటీశ్వరులుగా లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుకుందని స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరు లోని గురువారం మార్కెట్ కమిటీ ఆవరణలో కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల పేరిట ఇందిరమ్మ గృహాలు, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా క్యాంటీన్లు ,స్త్రీ శక్తి రుణాలతో పాటు రైతులకు బోనస్ రుణమాఫీ అన్ని సంక్షేమ పథకాలను అన్ని సామాజిక వర్గాలకు అందించడమే లక్ష్యంగా పెట్టుకుందని , అతి తక్కువ కాలంలో ఎక్కువ రాయితీతో సంక్షేమ పథకాలను అందరికి అందుబాటులోకి ఈ ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర సీనియర్ నాయకులు దయానంద్ మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక రంగాలలో ముందుకెళ్తుందని అన్నారు.కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్ర, తహసీల్దార్ పులి సాంబశివుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ దేవి, పంచదార పరిశ్రమ కేన్ చైర్మన్ కష్టాల నరేందర్, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భూ భారతితో సమస్య సత్వర పరిష్కారం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**భూ భారతితో సమస్య సత్వర పరిష్కారం అవుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన భూ భారతి చట్టం 2025ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతిలోని కీలక అంశాలుగా ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూ భారతి అని, హక్కుల రికార్డులు తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్ మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే మ్యాప్ తయారీ, పెండింగ్ సాదా బైనామ దరఖాస్తుల పరిష్కారం, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేయడం, అదే విధంగా భూమి హక్కుల ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు, పాసు పుస్తకాలలో భూమి పటం, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, భూదార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు, హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డు మార్చి ప్రభుత్వం భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు, పట్టాలు పొందితే రద్దు చేసే అవకావం ఉందని ఈ కీలక అంశాలపై రైతులకు సుదీర్ఘంగా వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ,ఎంపిడిఒ,ఎఒ, ఆర్‌ఐ, ఎఇఒలు, ఎస్‌ఐ, పాల్గొన్నారు.

## తుదిశ్వాస వరకు పేదల పక్షాన నిలిచిన భాస్కర్



కమ్యూనిస్టులే పేదలకు అండ

దండి భాస్కర్ వర్ధంతి సభలో వక్తలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు పేదల పక్షాన నిలిచిన దండి భాస్కర్ నిబద్ధత గల కమ్యూనిస్టు అని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన భాస్కర్ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సీనియర్ జర్నలిస్టు, సిపిఐ నాయకులు దండి భాస్కర్ తొమ్మిదవ వర్ధంతి సభ గురువారం ఏదులాపురంలో జరిగింది. భాస్కర్ స్మారక స్తూపం వద్ద అరుణ పతాకాన్ని మహ్మద్ మౌలానా ఆవిష్కరించగా రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి భాస్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో మహ్మద్ మౌలానా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అభ్యుదయ భావజాలంతో సమాజ చైతన్యం కోసం కృషి చేశారన్నారు. ధైర్యశాలి, ఆలోచనపరుడైన భాస్కర్ ఏదులాపురం గ్రామాన్ని కంచుకోటగా తయారు చేయటంలో కీలక భూమిక పోషించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని, అమరుల ఆశయ సాధనలో ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని మౌలానా పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు అజ్మీర రామ్మూర్తి, సిపిఐ నాయకులు, ఐఎల్ జిల్లా కార్యదర్శి , టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిపి మెళ్లచెరువు లలిత, దండి రంగారావు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్, ఎఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమంలో మాస్టారు అరాచకాలు

'పోక్సో' కేసు ఉన్నా అరెస్టు చేయరా?



**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంగా విధుల ను నిర్వహిస్తూ చేస్తున్న అ రాచకాలపై ఇప్పుడు ప్రజ ల్లో కోసం ఉప్పొంగుతోం ది. ఫోక్స్ కేసు నమోదై ఉండగానే ఆయనను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయక పోవడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక వైపు న్యాయ వ్యవస్థ, మరో వైపు పోలీసు వ్యవస్థలపై నమ్మకం లేకుండా పోతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హాజరు వేసుకొని పిల్లలు లేనప్పటికీ రేషన్, మనీ డ్రా, స్కూల్ సమయంలో చేపల కొనుగోలు లాంటి ఇష్టారాజ్యాన్ని మాస్టారు సాగిస్తూ, వ్యవస్థను తలకిందులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు స్కూల్‌లో ఎంత మంది పిల్లలు హాజరయ్యారో, ఎవరికీ చదువు చెప్పారో తెలియని పరిస్థితి నెలకొంది. ఫోక్సో కేసులో ఉన్నవారిని చట్టం ముందు సమానంగా చూస్తే, మరెంత మంది బాధితులు ఊహించదగిన ప్రమాదంలో పడతారో ఎవరికీ అర్ధం కాదనీ పరిస్థితి. ఈ మాస్టారుపై తక్షణమే సస్పెండ్ చేసి, దర్యాప్తును వేగవంతంగా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒక వేళ సామాన్యుడైతే ఇప్పటికీ జైలు లో ఉండేవాడు, కానీ ఇక్కడ మాత్రం అధికారిక దుర్వినియోగం చేయడమే అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలపై ఐటిడిఏ పీవో ప్రత్యేక దృష్టి సాకించి, అక్రమాలపై విచారించి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రపంచ సుందరీమణుల పోటీలను రద్దు చేయాలి

వామపక్ష మహిళా 'యువజన' విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్న ప్రపంచ సుందరీమణుల పోటీలను రద్దు చేయాలని, జిల్లాలో విదేశీ మిస్ వరల్డ్ సుందరి పర్యటనను అడ్డుకుంటామని వామపక్ష మహిళా యువజన విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు. గురువారం ఖమ్మం నగరంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ, ఐద్వా, పివోడబ్ల్యూ, డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాల ఆధ్వర్యంలో నల్ల జెండాలతో ప్లేకార్డులను ప్రదర్శిస్తూ పెవిలియన్ మైదానం నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, పివోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి, పివోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి జానకి, డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు షేక్ బషీరుద్దీన్, ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, పివైఎల్ జిల్లా నాయకు లు మాట్లాడుతూ హైదరాబాద్ వేదికగా మే నెలలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ అందాల పోటీలను నిర్వహించడమంటే తెలంగాణ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. బహుళ జాతి కంపెనీలకు, రాజకీయ నాయకులకు స్త్రీ ఒక అంగడి వస్తువుగా మారిందన్నారు. తక్షణమే ప్రభుత్వం పోటీల ఆలోచనను మానుకోవాలని హితవు పలికారు. 72వ మిస్ వరల్డ్ అందాల పోటీలను కాస్మోటిక్ కంపెనీలకు వేలాది కోట్ల లాభాలను చేకూర్చేందుకు నిర్వహిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ పోటీల వల్ల మహిళలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఈ పోటీలకు తెలంగాణ ప్రభుత్వం రూ. 250 కోట్లు ఖర్చు చేయడం అర్థరహితమన్నారు. హామీల అమలుకు డబ్బు లేదని చెబుతున్న ప్రభుత్వం అందా ల పోటీల నిర్వహణకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని వారు ప్రశ్నించారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని వారు కోరారు. జిల్లాలో విదేశీ మిస్ వరల్డ్ సుందరి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా నాయకులు తాటి నిర్మల, పోటు మమత, రాంబాయి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సుధాకర్, పివోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి , కల్పన, పిడిఎస్‌యు అధ్యక్షులు లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## బతుకమ్మ కుంట అభివృద్ధి పనులు వేగవంతం

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలో గల బతుకమ్మ కుంటను కలెక్టర్ సందర్శించి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.1కోటి 50లక్షలతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు పనులను వేగవంతం చేసి నెలరోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కుంట పూడికతీత పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ తనిఖీలలో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నీటిపారుదల ఈఈ మంగీలాల్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 12 మండలాల్లో తీవ్రనష్టం




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఆరుగాలం కష్టపడి పని చేసి పంట చేతికి వచ్చే సమయంలో వడగండ్ల వానతో అన్నదాత కష్టం కన్నీటి పాలయింది. బుధవారం కురిసిన అకాల వర్షాల వల్ల వరి మొక్కజొన్న మిరప తోట మామిడి తోటలు తీవ్రంగా రైతుకు నష్టం వాటిల్లింది. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి అప్పులు ఎట్లా తీర్చాలని మనోవేదనతో అన్నదాత అల్లాడిపోతున్నాడు. ప్రతి సంవత్సరం రైతుకు చేతికి పంట వచ్చే సమయంలోనే అకాల వర్షాలు కడగండ్లతో అన్నదాతను నిండా ఉంచుతున్నాయి. అకాల వర్షాల వల్ల జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 మండలాల్లో అనేక ఎకరాల్లో మిర్చి, వరి మొక్కజొన్న మామిడి తోటలు అనేకం కడగండ్లతో నేలమట్టం అయ్యాయి. ముఖ్యంగా భూపాలపల్లి నియోజకవర్గం లోని ఘనపురం, రేగొండ, చిట్యాల,మొగుళ్ళపల్లి మండలాల్లో అకాల వర్షాల వల్ల అనేక ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అదేవిధంగా కాటారం మలహరి మహాదేవపూర్ మహాముత్తారం పలిమల మండలాల్లో పాక్షికంగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ వ్యవసాయ అధికారులు యంత్రాంగం సర్వే నిర్వహించి జరిగిన రైతులకు నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగు ఐదు ఎకరాల రైతులు పంటలు నష్టపోయి పట్టణాలకు వలస కూలీలుగా పట్నానికి వలస వెళుతున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ ప్రభుత్వం రైతులకు నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలి.**సంగి రవి బిఎస్‌పి రాష్ట్ర నాయకులు**

అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని సమగ్ర సర్వే నిర్వహించి అంచనావేసి రైతులకు నష్టపరిహారం అందించాలి. **బి.ఎస్.పి జిల్లా అధ్యక్షుడు పొన్నం బిక్షపతి గౌడ్**

## ఆత్మ కమిటీ చైర్మన్‌గా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి

ప్రకటించిన ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:**వ్యవసాయ రంగంలో ఆదునిక సాంకేతిక నూతన ఆవిష్కరణలను రైతులకు అందజేయడానికి ఆత్మ ద్వారా కృషి చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ అన్నారు. సిపిఐ గత రెండు దఫాల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి సహకరించినందును సిపిఐ రాష్ట్రపార్టీ అభ్యర్థన మేరకు అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డిని ఆత్మ(వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) మరిపెడ డివిజన్ కమిటి చైర్మన్‌గా నియమించినట్లు ప్రభుత్వ విప్ తెలిపారు. భూ భారతి రెవిన్యూ సదస్సులు ప్రకటించి నల్లు సుధాకర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని మండలపార్టీ అధ్యక్షులకు, జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ తనపై పెట్టుకున్ననమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి గౌరవాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలు నిర్వహించి రైతు సోదరులకు ఈ కమిటీ ద్వారా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

## రక్తహీనతను తొలగించడమే లక్ష్యం

వరంగల్ జిల్లా వైద్యాధికారి బి. సాంబశివరావు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** భారతదేశం నుండి రక్తహీనతను పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నామని, గ్రామస్థాయి నుండి ప్రజలకు ఐరన్ మాత్రలు, సిరపులను అందించిన రక్తహీనత నివారణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు అన్నారు. వరంగల్‌లోని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ కార్యాలయం మీటింగ్ హాల్‌లో అనీమియా ముక్తుభారత్, ఫ్యామిలీ ప్లానింగ్, లాజిస్టిక్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం మీద ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షకులుగా డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్చన, డాక్టర్ ఆచార్య, ఫార్మసిస్ట్ సృజనలు పాల్గొని శిక్షణ ఇచ్చినారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ భారతదేశము నుండి రక్తహీనతను పూర్తిగా తొలగించడం లక్ష్యంగా పెట్టుకోవడం ముందుకు సాగుతున్నామని, ఈ ప్రోగ్రాం గురించి పిల్లలు, గర్భిణీ స్త్రీలు, యుక్త వయస్సు వారికి తగ్గట్టుగా మందుల పంపిణీ ఐరన్ మాత్రలు, ఐరన్ సిరప్స్ సక్రమంగా పంపిణీ చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా రాష్ట్రస్థాయి నుండి జిల్లా స్థాయికి, జిల్లా స్థాయి నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి సబ్ సెంటర్ వరకు పేషెంట్‌కు అందించే మందుల పంపిణీ సరైన రీతిలో నిల్వ, రవాణా ప్రణాళికను సక్రమంగా నిర్వహించడానికి ఒక రోజు శిక్షణ ప్రోగ్రాం ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో ఈదురు అనిల్ కుమార్, ఫార్మసిస్టులు బత్తిని సుదర్శన్ గౌడ్, యం. అవినాష్, వి.రాజేందర్, పూర్ణ చందర్, సుధారాణి, LD కంప్యూటర్ నాగరాజు, పిహెచ్‌సి, యూపిహెచ్‌సిల ఫార్మసిస్ట్ లు, విసిసియం లు అందరూ పాల్గొన్నారు.

## వ్యభిచారం గుట్టు రట్టు

**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణ పరిధిలో మాదన్నపేట రోడ్డులో టాస్క్ ఫోర్స్, పోలీస్ ఆధ్వర్యంలో వ్యభిచార గృ హంపై దాడి చేసి ము గ్గురు సెక్స్ వర్కర్లను, ముగ్గురు విట్టులను, 1000 కండోమ్ ప్యాకెట్స్,హెచ్ఐవి కిట్స్, ఐదు సెల్ ఫోన్లు, రూ. 2000 నగదు స్వాధీనం చేసుకున్న ఎస్సై అరుణ్ తెలిపారు. వీరిని నర్సంపేట పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ దాడుల్లో టాస్కోఫర్స్ పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ జిల్లాలో దారుణంచోటుచేసుకుంది. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన యువకుడు మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పాప ఏడవడంతో గమనించిన స్థానికులు రంజాన్‌ను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశకు చెందిన రంజాన్ కూలీ పనుల కోసం గిర్మాజీ పేటకు వచ్చి అద్దెకు ఉంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ప క్కనే ఉన్న మూడేళ్ల బాలికపై అతడి కన్ను పడింది. ఎవరూ లేని సమయం లో ఆ బాలికపై లైంగిదాడికి యత్నించారు. యువకుడు చేస్తున్న పనితో బాలిక భయందోళనకు గురై ఏడ్వడంతో స్థానికులు అక్కడకు చేరుకుని అతడిని పట్టుకొని చితకబాదారు. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. నిందితుడిపై ఫోక్సో, అత్యాచారంతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

# భూ సమస్యలకు సత్వర పరిష్కారం



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** రాష్ట్రంలో భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం చారిత్రాత్మకమైనదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొనాయిమాకుల రైతు వేదిక, సంగెం మండలం కేంద్రంలోని రైతు వేదిక వద్ద గురువారం రైతులు, ప్రజలకు నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టానికి సంబంధించిన పలు అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూభారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్ధకత ఏర్పడుతుందన్నారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ భూమి హక్కుల భద్రం భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. 1971లో అమలు చేస్తున్న చట్టంలో ట్రాన్సాక్షన్స్, మ్యుటేషన్, సక్సెషన్ లో సమస్యలు, లోపాలు ఉండటంవల్ల వాటిని సవరిస్తూ 2020 సంవత్సరం ఆర్‌ఓఆర్ చట్టంలో కొన్ని మార్పులు చేసినను ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, అందులో ఆపిల్ వ్యవస్థ లేదని తెలిపారు. దీన్ని సులభతరం చేస్తూ భూభారతి చట్టం ఫిబ్రవరిలో తీసుకువస్తూ రెండు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం నియమ, నిబంధనలను రూపొందించిందన్నారు. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్‌ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలు, ఇతరాల పేరిట ప్రత్యేక మాడ్యూల్స్, సెక్షన్స్ గురించి కలెక్టర్ వివరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టం మార్గదర్శకాలను రైతులు ప్రజలకు తెలియజేసేందుకు గురువారం నుండి 25వ తేదీ వరకు జిల్లాలో ప్రతిరోజు రెండు మండలాలలోని ర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఎంపిడిఒ కరుణాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఆర్‌డిఒ సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ లు రియజోద్దీన్, రాజ్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## దున్నే వాడికి భూమి : సిపిఐ

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్



**ప్రజాపక్షం/కాజీపేట :** భూమికోసం భుక్తి కోసం, దున్నే వాడికి భూమి కావాలని పోరాటాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. హనుమకొండ జిల్లాలోని కాజీపేట మండలంలో 62వ డివిజన్ వైయస్సార్ నగర శాఖ మహాసభలు గురువారం పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ హాజరై మాట్లాడుతూ దేశానికి స్వరాజ్యం రాకముందే భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి బ్రిటిష్ వలస పాలకులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసిన పార్టీ సిపిఐ అన్నారు. , నివాస స్థలాలు పేదలకు కేటాయించాలని నిరంతరం పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. ఈ మహాసభలో కాజీపేట మండల కార్యదర్శి మునిగాల బిక్షపతి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్, ఏఐటీయూసి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్, గుంటి రాజేందర్, వల్లెపు వెంకన్న, మంజుల, లక్ష్మి, మేరీ, రాజేశ్వరి. పాల్గొన్నారు. అనంతరం వైఎస్ఆర్ నగర కమిటీని 9 మంది కార్యవర్గంతోటి ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శి పూర్ణచందర్, సహాయ కార్యదర్శి జానపట్ల మంజుల, కోశాధికారిగా యాకయ్య సహా ఐదుగురుని కార్యవర్గ సభ్యులుగా ఈ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం / వేలేరు :** తెలంగాణ రాష్ట్రంలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీ ర్చి దిద్దడమే నాలక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎంఎల్‌ఎ కడియం శ్రీహరి అన్నారు. గురువారం వేలేరు మండలకేంద్రంలోని రైతు వేధిక వద్ద పిఎసిఎస్ ఆద్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు.ఈసంధర్భంగా కడియం మాట్లాడుతూ దేశంలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఎక్కడాలేదని కేవలం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వానికే సాధ్యమైందని అన్నారు.గతంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు దొడ్డు బియ్యం పంపిణీ చేయడం వలన అవితినకలేక అమ్ముకొని సన్నబియ్యం తినేవారని ఈదొడ్డు బియ్యాన్ని అక్రమదారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి అధికధరలకు ఇతర రాష్ట్రాలకు,ఇతర దేశాలకు పంపిణీ చేసుకొని కోట్లాది రూపాయలు సంపాదించుకునే వారని అలాంటి ఇబ్బందులను గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని పేదలు కూడా సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతోనే ఉగాది రోజున సన్నబియ్యం పథకాన్ని ప్రారంబించడం జరిగిందని అన్నారు.ఈఅభివృద్దిని చూసి ఓర్వలేని పనిలేని పసలేని కొంత మంది నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడంకోసం అవాక్కులు చెవాక్కులు పేలుతున్నారు అలాంటి వారి మాటలు పట్టించుకోకూడదని అన్నారు. రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి స న్న వరి ధాన్యం రైతులకు క్వింటాలుకు రూ,500 బోనస్ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. అ లాగే ఇనుపరాతి గుట్టలలో అక్రమ భూకబ్జాలు చేశానని మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు అక్రమ భూకబ్జాలకు పాల్పడితే బహిరంగ చర్చరావలసిందిగా కోరారు. డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్, పిఎసిఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంఆర్ఒ హెచ్ కోమి, ఎంపిడిఒ లక్ష్మీ ప్రసన్న, ఎఒ కవితారాణి, ఎపి ఎం జయసుధ, పశువైద్యాధికారి నోముల రణధీర్‌రెడ్డి,కాంగ్రేస్ పార్టీ మండలఅధ్యక్షుడు కత్తి సంపత్,మాజీసర్పంచ్‌లు,ఎంపిటిసిలు, యూత్‌కాంగ్రేస్‌నాయకులు పాల్గొన్నారు.

## భూభారతి చట్టం రైతులకు వరం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**భూ భారతి చట్టం రైతుల పాలిట వరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గురువారం ఘనపురం మండల కేంద్రం లోని రైతువేదికలో నిర్వహించిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం 2025 అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అవగాహన సదస్సు ప్రారంభానికి ముందు భూభారతి నూతన చట్టం పై రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతుల భూములకు పట్టాలు, భూమి హక్కులు లేక రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసి రైతులకు న్యాయం చేస్తామని తెలిపా రు. భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చ ట్టాన్ని తెస్తామని తెలిపిన విధంగా వివిధ రాష్ట్రాల్లో అధ్యయం చేసి భూ భారతి చట్టాన్ని తెచ్చినట్లు స్పష్టం చేశారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భూములపై రైతులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ పటిష్టమైన నూతన ఆర్.ఓ.ఆర్ చ ట్టాన్ని తెచ్చినట్లు ఆయన వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూ భారతి చట్టంపై ప్ర జలు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా 4 జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిందని, మే మాసం నుండి మన జిల్లాలో కూడా ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటామని అన్నారు. సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని చట్టంలో జత చేసేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని అన్నారు. ధరణి పోర్టల్ వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులకు పంట రుణాలు రాక అమ్మకానికి అవకాశం లేక ఎంతో వేదన అనుభవించారని ఆయన పేర్కొన్నారు.కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూభారతి చట్టంపై ప్రతి ఒక్కరు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భూ మాత చట్టం ఈ నెల 14 వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రారంభించినట్లు తెలిపారు. భూమాత చట్టం ద్వారా ప్రజలకు వేగంగా సేవలందించేందుకు ఈ ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఒభాస్కర్, సింగిల్ రెండో చైర్మన్లు కుమార్ యాదవ్, సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్ పాల్గొన్నారు.

## ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, భూములపై వచ్చిన దరఖాస్తులన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలుపై పరిశీలించడానికి రాష్ట్రంలోని నాలుగు మండలాలను ఎంపిక చేయగా జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించడంతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ మహేందర్ జితో కలిసి గురువారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో భూమిపై హక్కుల రికార్డుల చట్టం 2025పై భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుండి అభ్యంతరాలను తెలుసుకున్న అనంతరం కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గతంలో భూముల సమస్యలను పరిష్కరించడానికి ధరణి పోర్టల్ ఏర్పాటు చేయగా నేడు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందని అన్నారు. గత చట్టంలోని అంశాలే కాకుండా మరో 14 నూతన అంశాలను పొందుపర్చి క్షే త్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించడానికి చట్టాన్ని రూపొందించడం జరిగిందని వివరించారు. 2014 సంవత్సరంలో సాదా బైనామా ద్వారా భూ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోగా 2020 సంవత్సరంలో భూముల సమస్యలపై అత్యధిక దరఖాస్తులు వచ్చాయని, భూములపై హక్కు పత్రాలు పొందడానికి భూభారతి చట్టం దరఖాస్తును మండల స్థాయి అధికారులు పరిశీలించడమే కాకుండా కలెక్టర్ స్థాయిలో ప్రతి విషయాన్ని పరిశీలించి భూములకు హద్దులు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, రెవెన్యూ సదస్సుల ఇన్‌చార్జి ఆఫీసర్ ఎస్ కిరణ్ ప్రకాష్, ఆర్‌డిఓ వెంకటేష్, తహసీల్దారు గిరిబాబు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ స్టాఫ్ కలిసికట్టుగా ఉంటేనే సమస్యలు పరిష్కారం

ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** మైనింగ్ స్టాఫ్స్ కలిసికట్టుగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ అన్నారు. కేటీకే ఓసి3 అండర్ గ్రౌండ్ మైన్ లో ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ ఎల్.శంకర్ ఆధ్వర్యంలో ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మికుల తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, కార్మికులు ఐక్యంగా ఉంటేనే అనేక సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు ఎం.విజేందర్, ఆసిఫ్ పాషా, శ్రీనివాస్ , గురుజపెల్లి సుధాకర్ రెడ్డి గార్లు మైనింగ్ స్టాఫ్ ఇన్చార్జి రామ్ చందర్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్ చందర్, బ్రాంచ్ కార్యదర్శి తో హాజరై గనిలో సమస్యలు తెలుసుకొని కొత్తగా ఏఐటీయూసీ వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ గా ఎన్నికైన కెక్కెర్ల శ్రీనివాస్, హెచ్ఓఎం గాలిబ్ ఖాన్ ఆధ్వర్యంలో మైనింగ్ స్టాఫ్ సమస్యల గురించి వారితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనింగ్ స్టాఫ్ అంతా కలిసికట్టుగా ఉండాలని సమస్యలపై ఏఐటీయూసీ నిత్యం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆట్లాగే ఈ నెల 20 న జరగబోయే మీటింగ్ గురించి కార్మికులకు, మైనింగ్ స్టాఫ్ కి వివరిస్తూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బ్రాంచ్ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ శ్రీకాంత్, ఆర్గనైజర్ జగత్ రావు, టెంపుల్ కమిటీ చైర్మన్ జె.శంకర్, సలహాదారు ఎస్.శ్రీనివాస్, సీని యర్ నేతలు గడ్డం శ్రీనివాస్, కోటి కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసు రాజకీయ ప్రతీకారమే

వరంగల్ ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పేర్లు చార్జిషీట్‌లో పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ ఎంపి కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట అశోక జంక్షన్లో నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీని, లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా చార్జిషీట్ లో పేర్లు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించి మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కడియం కావ్య, నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కారు దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రతీకారాలకు వాడుకుంటోందని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి.. దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రతీకారానికి దిగుతోందని, సోనియా, రాహుల్, ఇతర అగ్రనేతలపై చార్జిషీట్ దాఖలు చేయడం అనేది ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగం చేయడమే'' అని అన్నారు. ఈ చర్య. .ప్రజాస్వామ్య బద్ధమైన విపక్ష పార్టీపై దాడి అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఈ చర్యలను చూస్తూ ఊరుకోబోదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపి కడియం కావ్య, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈ.వి. శ్రీనివాస్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ విజయశ్రీ రజాలి, మామిండ్ల రాజు, ఇనుగుల మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్ నాగరాజు, దితరులు పాల్గొన్నారు.


## ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన పాశం సంజీవ రెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీ పాల్ రెడ్డి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఈ వృత్తిలో ఉన్న గౌరవం అంకిత భావం మరే వృత్తిలో లేదని ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. భూపాల్ పల్లి జిల్లా మహా ముత్తారం మండల విద్యాధి కారి, ములుగు పల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాశం సంజీవ రెడ్డి రజిత దేవి పదవీ విరమణ సన్మాన సభ బుధవారం రాత్రి గోపాల్ పూర్ ఆదర్శ కాలనీ లో జరగగా పింగిలి శ్రీ పాల్ రెడ్డి, పిఆర్‌టీయు సంఘం ప్రతినిధులు విచ్చేసి సంజీవ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ అభినందన సమావేశం లో పిఆర్‌టియు హన్మకొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మందల తిరుపతి రెడ్డి, పలిత శ్రీహరి, మల్హర్ మండల ఎంఈవో లక్ష్మ ణ్ బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్య క్షులు పింగిలి విజయ పాల్ రెడ్డి, కామిడి సతీష్ రెడ్డి, చెల్పూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే అశోక్, లెక్కల రవీంద్ర రెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతపరికి పండ్ల వేణు, బాను ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేయాలి

సిపిఐ మండల కార్యదర్శి బాలకృష్ణ



**ప్రజాపక్షం/మరిపెడ:**నీలికుర్తిలో ధాన్యంకొనుగోలు సెంటర్ ఏర్పాటుచేయాలని సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. రైతులు పం డించిన వరి ధాన్యాన్ని దళారులకు వ్యాపారులకు అమ్మకుండా కనీస మద్దతు ధర బోనస్ లభించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఐకెపి ప్యాక్స్ సెంటర్లు ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. మరిపెడ మండలంలోని అన్ని గ్రా మాల్లో ఐకెపి ప్యాక్స్ సెంటర్లు ఏర్పాటుచేసి కొనుగోలు ప్రారంభించడం జరిగిందని, నీలికుర్తి గ్రామంలో కూడా ఫ్యాక్స్ సెంటర్ ఏర్పాటు చేసి 2500 మంది వరిధాన్యం పండించే రైతుకు కనీస మద్దతు ధ్వారా బోనస్ లభించే విధంగా ప్రజా ప్రతినిధులు అధికారులు తక్ష ణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దారులకు సమర్పించిన వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. తక్షణమే నీలికుర్తిలో ఫ్యాక్ సెంటర్‌ని ఏర్పాటుచేయాలని ఆయన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్, యాకన్న, అంజి, వస్త్రం తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

# పంజాబ్‌తో తలపడే ఆర్‌సిబి

## తుది జట్టు ఇదే!



**ఐ**పిఎల్ 2025 సీజన్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బెంగళూరు వేదికగా శుక్రవారం జరిగే మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో ఆర్‌సీబీ అమీతుమీ తేల్చుకోనుంది. 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు సాధించిన ఆర్‌సీబీ మంచి జోష్‌లో ఉంది. కానీ ఇతర వేదికలపై విజయాలు సాధిస్తున్న ఆర్‌సీబీ.. సొంత మైదానంలో మాత్రం తేలిపోతుంది. ఇప్పటి వరకు చిన్నస్వామి వేదికగా ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. పంజాబ్‌ను ఓడించి సొంతగడ్డపై విజయం సాధించాలనే పట్టుదలతో ఆర్‌సీబీ ఉంది.

మరోవైపు పంజాబ్ కింగ్స్ సైతం 6 మ్యాచ్‌ల్లో 4 విజయాలు సాధించింది. కేకేఆర్‌తో 111 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకొని నయా చరిత్రను లిఖించిన పంజాబ్.. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బెంగళూరు వేదికగా జరిగిన గత రెండు మ్యాచ్‌ల్లో పిచ్ స్లోగా ఉంది. బ్యాటింగ్‌కు కష్టమైంది. కానీ తాజా మ్యాచ్‌కు బ్యాటింగ్ పిచ్‌ను రెడీ చేసే అవకాశం ఉంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోనుంది. డ్యూ ప్రభావం నేపథ్యంలో టాస్ కీలకం కానుంది. టాస్ గెలిచిన జట్టు దాదాపు 50 శాతం మ్యాచ్ గెలిచనట్లే. అయితే పంజాబ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, విధ్వంసకర బ్యాటర్ గ్లేన్ మ్యాక్స్‌వెల్.. ఆర్‌సీబీపై ఎలా రాణిస్తారనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఇద్దరూ గతంలో ఆర్‌సీబీకి ఆడారు. మరోవైపు పంజాబ్ మాజీ ప్లేయర్.. ప్రస్తుత ఆర్‌సీబీ ఆటగాడు లియామ్ లివింగ్ స్టోన్, జితేశ్ శర్మలపై కూడా అందరి దృష్టి నెలకొంది.

**మార్పుల్లేకుండానే..?**

ఆర్‌సీబీ తమ విన్నింగ్ కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చు. ఓపెనర్లుగా ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నారు. ఈ ఇద్దరూ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. ఈ ఇద్దరూ మరోసారి శుభారంభం అందిస్తే ఆర్‌సీబీకి తిరుగుండదు. మిడిలార్డర్ దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్, లియామ్ లివింగ్ స్టోన్, జితేశ్ శర్మ బరిలోకి దిగనున్నారు. ఈ నలుగురు మంచి ఫామ్‌లోనే ఉన్నారు. కానీ లివింగ్ స్టోన్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. ఫినిషర్‌గా టీమ్ డేవిడ్ సత్తా చాటుతున్నాడు. కృనాల్ పాండ్యా కూడా బ్యాట్ ఝులిపిస్తే ఆర్‌సీబీకి భారీ స్కోర్ ఖాయం. బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్ కుమార్ కీలకంగా మారాడు. అతనితో పాటు జోష్ హాజెల్ వుడ్ యశ్ దయాల్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. హాజెల్ వుడ్ కాస్త కట్టడిగా బౌలింగ్ చేయాలి. స్పిన్నర్లుగా కృనాల్ పాండ్యా, సుయాశ్ శర్మ సత్తా చాటుతున్నారు. బెంగళూరు మైదానానికి తగ్గట్లు ఏమైనా వ్యూహాత్మక మార్పులు చేస్తే తప్పా తుది జట్టులో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు.

**ఆర్‌సిబి తుది జట్టు(అంచనా)**

**ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్, లియామ్ లివింగ్ స్టోన్, జితేష్ శర్మ, టీమ్ డేవిడ్ కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జోష్ హాజెల్‌వుడ్ యశ్ దయాల్**

# రాజస్థాన్ జట్టులో డిష్యూం.. డిష్యూం..!





**ఐ**పీఎల్ 2025 రాజస్థాన్ రాయల్స్ జట్టులో అంతర్గత పోరు మొదలైందని తెలుస్తోంది! ఆ జట్టులోని యువ ఆటగాళ్ల మధ్య పోరు మొదలైనట్లు సమాచారం. ముఖ్యంగా రియాన్ పరాగ్ యశస్వి జైశ్వాల్ పోటీ పడుతున్నట్లు అనుమానం తలెత్తుతోంది. ఇంతకీ అసలు గొడవ ఏంటంటే?

**ఒకరు వెళ్లగానే మరొకడు..**

సూపర్ ఓవర్‌కు దారీ తీసిన గత మ్యాచులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై రాజస్థాన్ రాయల్స్ ఓడింది. ఈ మ్యాచు సూపర్ ఓవర్ లో సంజూ శాంసన్ గాయం కారణంగా ఫీల్డింగ్‌కు దిగలేదు. దీంతో వైస్ కెప్టెన్ రియాన్ పరాగ్ రంగంలోకి దిగాడు. ఆ సమయంలో అతడు బౌలర్లతో ఏదో సంభాషణ జరిపాడు. రియాన్ పరాగ్ వెళ్లగానే.. ఆ వెంటనే జైశ్వాల్ కూడా వెళ్లి బౌలర్లతో ఏదో సంభాషణలు జరిపాడు. ఇదే కంటిన్యూగా సాగింది. ఈ కారణంగానే కొత్త అనుమానాలు తలెత్తాయి.

**బహిరంగంగానే చెప్పాడు...**

రియాన్ పరాగ్ ఇప్పటికే తొలి మూడు మ్యాచుల్లో కెప్టెన్ గా వ్యవహరించాడు. పైగా అతడు వైస్ కెప్టెన్ కూడా. మరి ఇలాంటి స్థితిలో జైశ్వాల్ అనవసరంగా కెప్టెన్సీ విషయంలో దూరుతున్నట్టుగా క్రికెట్ అభిమానులు అనుకుంటున్నారు. ఎందుకంటే అతడు రీసెంట్‌గానే దేశవాళీ క్రికెట్‌లోనూ ముంబయి జట్టు నుంచి వైదొలిగిన సంగతి తెలిసిందే. గోవా జట్టు కెప్టెన్సీ ఆఫర్ ఇవ్వడంతో తాను జట్టు వీడినట్లు బహిరంగంగానే చెప్పాడు.

**నిరూపించుకునేందుకు...**

అంటే జైశ్వాల్ కెప్టెన్సీ ఆశిస్తున్నట్లుగా స్పష్టంగా అర్థమైంది. ఇక టీమిండియా టెస్ట్ జట్టు వైస్ కెప్టెన్సీ రేసులోనూ అతడు పోటీ పడుతున్నట్టుగా ఆ మధ్య ప్రచారం సాగింది. ఈ క్రమంలోనే ఇప్పుడతడు ఐపీఎల్‌లోనూ కెప్టెన్‌గా నిరూపించుకోవాలని అనుకుంటున్నాడేమోనని అంతా అనుకుంటున్నారు. రాజస్థాన్ జట్టులో సారథ్య బాధ్యతల కోసం ఆశిస్తున్నాడేమోనని అంతా భావిస్తున్నారు. కాబట్టి రియాన్ పరాగ్ తో పోటీ పడుతూ.. రాజస్థాన్ కెప్టెన్సీకి సంబంధించిన విషయాల్లో దూరుతున్నాడని కామెంట్లు చేస్తున్నారు. మరి ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొంత కాలం వేచి ఉండాల్సిందే.

## రీల్



# 'ఓదెల' పార్ట్3 కూడా..

**మి**ల్కీ బ్యూటీ తమన్నా మెయిన్ లీడ్‌లో దర్శకుడు సంపత్ నంది దర్శకత్వ పర్యవేక్షణలో దర్శకుడు అశోక్ తేజ తెరకెక్కించిన లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే ఓదెల 2. తమన్నా సహా టాలెంటెడ్ నటుడు వశిష్ట నటించిన ఈ డివోషనల్ హారర్ డ్రామా నేడు థియేటర్స్ లోకి వచ్చింది. అయితే దీనికి ముందు ఆల్రెడీ ఓ సినిమా ఉన్న సంగతి తెలిసిందే. లాక్ డౌన్ సమయంలో నేరుగా ఓటిటిలో విడుదల అయ్యిన ఓదెల రైల్వే స్టేషన్ అనే సినిమా ఓటిటిలో రెస్పాన్స్ అందుకుంది. అయితే ఫైనల్ గా ఈ సినిమాకి సీక్వెల్ పార్ట్ 2 థియేటర్స్ లోకి రాగ మేకర్స్ ఫైనల్ గా ఈ సిరీస్ లో ముచ్చటగా మూడో సినిమాను కూడా అనౌన్స్ చేసేసారు. దీనితో ఓదెల 3 కూడా ఆడియెన్స్ ని అలరించేందుకు రానుంది అని చెప్పవచ్చు. మరి ఇపుడు పార్ట్ 2 రేంజ్ లో రాణిస్తుందో చూడాలి మరి. ఇక ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా డి. మధు నిర్మాణం వహించారు.



# తారక్ బర్త్‌డే ట్రీట్‌గా 'యమదొంగ'..!

**మ్యా**న్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి కలయికలో చేసిన బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాల్లో తమ మొదటి ఫాంటసీ వండర్ చిత్రం యమ దొంగ కూడా ఒకటి. నిజానికి జక్కన్న నుంచి విజువల్ ఎఫెకట్స్ తో మగధీర సినిమా కంటే ముందే రాజమౌళి యమ దొంగ చిత్రంతో సత్తా చాటారు. ఇక ఇందులో మోహన్ బాబు సాలిడ్ పాత్రలో నటించగా అప్పట్లో సూపర్ హిట్ అయ్యింది ఈ చిత్రం. మరి ఇపుడు ఫైనల్ గా తన బర్త్ డే కానుకగా యమ దొంగ సిద్ధం అవుతున్నాడు. మరి రానున్న ఈ మే 18న సినిమా గ్రాండ గా రిలీజ్ చేసేందుకు ఇపుడు సిద్ధం అయ్యింది. మే 20న తారక్ పుట్టినరోజు కాగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ గా విడుదలకి సన్నాహాలు చేస్తున్నారు. అది కూడా ప్రింట్ 4కే లో రీ మాస్టర్ చేయడం జరిగింది. మరి ఈ సినిమాకి న్యూట్రల్స్ లో కూడా మంచి ఫ్యాన్స్ ఉన్నారు. సో ఈ చిత్రం ఎలా అలరిస్తుందో చూడాల్సిందే.



# సూర్య 'రెట్రో' ట్రైలర్‌కు టైమ్ ఫిక్స్

**త**మిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రెట్రో' వేసవి కానుకగా మే 1న వరల్డ్‌డ గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాను దర్శకుడు కార్తీక్ సుబ్బారజ్ తెరకెక్కిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు పెరిగాయి. ఇక ఇప్పుడు ఈ అంచనాలను రెట్టింపు చేసేందుకు ఈ చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. 'రెట్రో' చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను ఏప్రిల్ 18న సాయంత్రం 5 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం లో లాంచ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా వెల్లడించింది. ఈ సినిమాను తొలుత అందరూ ఓ గ్యాంగ్‌స్టర్ మూవీ అని అనుకున్నారు. కానీ, ఇదొక లవ్ స్టోరీ అని.. యాక్షన్ డోస్ ఎక్కువగా ఉండే ప్రేమకథ అని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను 2డి ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై జ్యోతిక, సూర్య ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## తెలంగాణ సంస్కృతి చాటి చెప్పేలా..

# మిస్ వరల్డ్ పోటీలు

### పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సంస్కృతి, చారిత్రక వైభవం చాటి చెప్పేలా మిస్ వరల్ పోటీలను నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ప్రపంచ సుందరి పోటీల నిర్వహణపై గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విశిష్ట సంస్కృతులకు కొలువైన తెలంగాణ వైభవం ఒక్క హైదారాబాద్ నగరంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉందని, ఆయా ప్రాంతాలకు ప్రపంచ దేశాల సుందరీమణులను తీసుకెళ్లి వాటి గొప్పతనాన్ని వివరించాలని అన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, ఆధ్మాత్మిక క్షేత్రాలు, చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా అందాల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని దిశానిర్ధేశం చేశారు. విదేశీ పర్యాటకులను ఆకర్శించడం ద్వారా పర్యాటక రంగ అభివృద్ధి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 20కి పైగా వేదికల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. వివిధ వేదికల్లో వేడుకలు నిర్వహిస్తున్నందున ఆయా ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, ఇతర అధికార యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని సుచించారు. మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సి, ఎంపిలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలను ఇందులో భాగాస్వాములను చేయాలన్నారు. ఈ సమీక్షలో పర్యాటక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ జెండాగే హనుమంత్ కొండిబా, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోని బాలదేవి, యుజవన సర్వీసుల శాఖ డైరెక్టర్ వాసం వెంకటుశ్వర్లు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు

### హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి పోలింగ్, కౌంటింగ్ అధికారులకు సూచించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పోలింగ్ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపిఓలకు రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్లకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో సజావుగా జరిగేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ సాధారణమే అయినప్పటికీ అజాగ్రత్తగా ఉండవద్దని, ఎలాంటి తప్పిదాలకు తావివ్వకుండా ఎవరి బాధ్యతలు వారు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ మొదలు ప్రక్రియ ముగిసే వరకు చేయాల్సిన ప్రక్రియను ఆయన వివరించారు. ముఖ్యంగా బ్యాలెట్ పేపర్ అకౌంట్, పేపర్ సీల్, బ్యాలెట్ బాక్స్ ఓపెన్, సీల్ తదితర అంశాలపై పూర్తి సుశిక్షితులై ఉండాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిబంధనల ప్రకారం జరగాలని, ఎలాంటి తప్పిదాలు లేకుండా కౌంటింగ్ సిబ్బంది పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలోని అన్ని విషయాలను సమగ్రంగా అవగాహన చేసుకోవాలని తెలిపారు. శిక్షణలో భాగంగా పోలింగ్ అధికారులకు పోలింగ్ కేంద్రంలో చేయాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ మెటీరియల్స్, బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్ చెక్ చేసుకోవడం, ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, సంబంధిత ఫారాలు పూరించడం, ప్రిసైడింగ్ అధికారి అధికారాలు, విధులు, పోలింగ్ అధికారుల విధులు తదితరాలను మాస్టర్ ట్రైనర్స్ వివరించారు. కౌంటింగ్ ప్రక్రియలో నిర్వర్తించాల్సిన విధులు, నియమ నిబంధనలను కౌంటింగ్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి డాక్టర్ సునంద రాణి, మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి, (పిఓ యుసిడి), మమత, (ఈఈ ఎలక్ట్రికల్), పోలింగ్ పిఓలు, ఏపిఓలు, మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్స్‌లు, మైక్రో అబ్జర్వర్‌లు పాల్గొన్నారు.

# రాష్ట్రపతిని నిర్దేశించలేరు

### 'సుప్రీం' తీర్పుపై ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** భారత న్యాయవ్యవస్థ లక్ష్యంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లులు ఆమోదించడానికి గడువు నిర్ణయిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నాలుగు రోజుల తర్వాత ఉపరాష్ట్రపతి ఈ అంశంపై స్పందించారు. న్యాయవ్యవస్థను ఉద్దేశించి తీవ్ర పదజాలంతో మాట్లాడారు. కోర్టులు రాష్ట్రపతిని నిర్దేశించే పరిస్థితి మనకు ఉండదని అన్నారు. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు ఇచ్చే రాజ్యాంగంలోని ఆర్టికల్ 142, 'న్యాయవ్యవస్థకు 24/7 అందుబాటులో ఉన్న ప్రజాస్వామ్య శక్తులపై అణ్వాయుధ క్షిపణిగా మారింది' అని ఆయన అన్నారు. రాష్ట్రాల గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతి తప్పనిసరిగా మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఇటీవల తొలిసారి గడువు నిర్దేశించిన సంగతి తెలిసిందే. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి కూడా జ్యుడీషియల్ రివ్యూకు కట్టుబడి ఉండాలని ఆ తీర్పులో స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీలో ఆమోదం పొందిన బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు జడ్జిలు జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు సంచలన తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 201 ప్రకారం ఒక బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి గవర్నర్ పంపినట్టయితే... దానిని రాష్ట్రపతి ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. కానీ రాష్ట్రపతి ఎంత కాలంలోపు నిర్ణయం తీసుకోవాలన్నది రాజ్యాంగంలో పేర్కొనలేదు. అంత మాత్రాన రాష్ట్రపతికి 'పాకెట్ వీటో' అధికారం ఉందని అనుకోరాదంటూ తీర్పు చెప్పింది. అయితే, ఏదైనా ఒక బిల్లు విషయంలో రాజ్యాంగబద్ధతపై ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు మాత్రం కార్యనిర్వాహక వ్యవస్థ కోర్టుల పాత్ర పోషించరాదని, ఆర్టికల్ 143 ప్రకారం దానిని సుప్రీంకోర్టుకు రిఫర్ చేయాలని చెప్పింది.

## చర్చకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. చర్చకు కెటిఆర్ (బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు) సిద్ధమా? అని సవాల్ విసిరారు. విలేకరుల ఆధ్వర్యంలో తాను చర్చకు రెడీ అన్నారు. గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హెచ్‌యుసి భూముల గురించి మాట్లాడడానికి కెటిఆర్‌కి సిగ్గుండాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చాక కూడా కెటిఆర్, హరీశ్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములను విక్రయించారన్నారు. కెటిఆర్ తన అనునాయులకు వేల ఎకరాలను అప్పనంగా కట్టబెట్టారన్నారు. ఎకరం రూ.100 కోట్లు పలికే భూములను రూ.30 లక్షలకే విక్రయించారని ఆరోపించారు. హైకోర్టు బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి అప్పట్లో ఎన్నోసార్లు మొట్టికాయలు వేసిందన్నారు. కంచ గచ్చిబౌలి భూములను ప్రైవేట్ పరం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు. ప్రైవేట్ వ్యక్తిపరం అవుతున్న భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుకుందని తెలిపారు. హెచ్‌యుసి భూముల్లో పారిశ్రామిక ప్రగతితో 5 వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని అడ్డుకోవడమే బిఆర్‌ఎస్, బిజెపి నేతల పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కోర్టులు అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందన్నారు. సాక్షాత్తు ప్రధానమంత్రి సైతం భూములకు సంబంధించి అవాస్తవాలు మాట్లాడారన్నారు. ఏఐ ఫేక్ వీడియోలు చూసి ప్రధాని మోదీ కూడా పొరపాటుపడ్డారన్నారు. ఫేక్ వీడియోలు అని తెలిశాక, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎక్స్‌లో పెట్టిన వీడియోలు తొలగించినట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. రేవంత్ రెడ్డిని సిఎం పదవిని నుంచి దిగిపొమ్మటానికి కెటిఆర్‌కు సిగ్గుండాలని మండిపడ్డారు. దేశ చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నందుకు రేవంత్ రెడ్డి సిఎం పదవి నుంచి దిగిపోవాలా ? కెటిఆర్ ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పార్టీలో రౌడీలకు కొదవలేదన్నారు. కవిత రౌడీ కాబట్టే ఢిల్లీ వెళ్లి లిక్కర్ దందా చేసిందని విమర్శించారు.

## రెవెన్యూ అధికారుల లీలలు

(మొదటి పేజీ తరువాయి)

మద్దులపల్లి రెవెన్యూలోని సర్వేనెం. 145/అ3, 145/6/2లో 5.02 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి నల్లపునేని పార్వతమ్మ పేర పట్టా ఉండగా ఆమె మరణానంతరం ఆమె ఏకైక కుమార్తె పెందుర్తి కృష్ణవేణికి వారసత్వంగా సంక్రమించి ఆమె పేరున పట్టాలో ఉంది. కృష్ణవేణికి ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఒక కుమార్తెకు పెళ్లికాకపోగా మరో కుమార్తె వితంతువు. వివాహాలైన వారు సైతం మద్దులపల్లిలోనే ఒకే ఇంట్లో అంతా నివాసం ఉంటున్నారు. కృష్ణవేణి ద్వారా సంక్రమించిన ఆస్తి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. కృష్ణవేణి రెండేళ్ల క్రితం చనిపోగా ఆమె కుమారుడు శ్యాంప్రసాద్ కూడా మరణించాడు. శ్యాంప్రసాద్ మరణంతోనే భూ భాగోతం కథ మొదలైంది. ప్రధాన రహదారి పక్కన భూమి ఉండటం ఇక్కడ ఎకరం ఎనిమిది కోట్ల నుంచి పది కోట్ల రూపాయల ధర పలుకుతుండడంతో రాజకీయ నాయకుల ప్రోద్బాలంతో శ్యాంప్రసాద్ కుమారుడు పవన్ తప్పుడు వారసత్వ ధృవీకరణ (కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం)తో మిగిలిన కృష్ణవేణి కుటుంబ సభ్యులకు తెలియకుండా భూమిని తన పేరున మార్చుకున్నాడు. పెందుర్తి కృష్ణవేణికి ఆరుగురు కుమార్తెలు ఉండగా కుమారుని కుమారునికి ఎలా హక్కులు కల్పించారన్న ప్రశ్న మొదలైంది. ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పవన్‌ను మాత్రమే వారసునిగా ఎలా నిర్ణయించారన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతున్నారు. పవన్‌కు బదలాయించబడిన భూమిని ఆయన మరో ఇద్దరికి కొంత భాగాన్ని విక్రయించినట్లు తెలుస్తుంది. కేవలం ఈ భూమిపై ఆధారపడిన కృష్ణవేణి కుమార్తెలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమను తప్పుదారి పట్టించారంటూ పవన్‌పై రూరల్ తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయల విలువైన భూమిని అక్రమ మార్గంలో హక్కులు మార్చేందుకు ఎన్ని లక్షలు చేతులు మారాయన్నది ఇప్పుడు రూరల్ మండలంలో వినవస్తున్న ప్రశ్న.

పోలీసులకు ఫిర్యాదు చేశాం : తహసీల్దార్

145/అ3, 145/6/2 సర్వే నెంబర్‌లో గల 5.02 ఎకరాల భూ బదలాయింపుకు సంబంధించి తప్పుడు ధృవీకరణలు సమర్పించిన పవన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామని ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు. తప్పుడు వారసత్వ ధృవీకరణతో రెవెన్యూ వ్యవస్థను పక్కదారి పట్టించారని ఆయన తెలిపారు. ఈ విషయం ఉన్నతాధికారుల పరిధిలో ఉన్నదని దీనిపై తగు పరిశీలన చేసి సమీక్షిస్తామని ఆయన తెలిపారు.

## తక్షణం చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

చందన్‌పాల్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నరసింహ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అన్వేష్, మాజీ ఎంఎల్‌సి రాములు నాయక్, మాజీ మంత్రి రవీంద్ర నాయక్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాం, ఆర్‌జెడి నాయకులు రాములు యాదవ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల భూదాన్ భూములను వెంటనే స్వాధీనం చేసుకుని, వాటిని నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. సయ్యద్ అజీజ్‌పాషా మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో భూపోరాటాలు నిర్వహించి, వేలాది మంది నిరుపేదలకు గుడిసెలు వేయించామని వివరించారు. వినోబా భావే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఇ.టి.నరసింహ మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం భూదాన్ భూముల వ్యవహారాన్ని సిపిఎల్‌ఎకు అప్పగించిందన్నా. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా పేదలకు 100 గజాల ఇంటి స్థలాన్ని పంపిణీ చేయలేదన్నారు. భూదాన్ భూములు పేదలకు దక్కేంత వరకు సిపిఐ ఉద్యమిస్తుందని చెప్పారు. చందన్‌పాల్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో భూదాన్ భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆచార్య వినోబా భావే 'భూదాన్ ఉద్యమాన్ని పాఠ్యంశాల్లో చేర్చాలని, ప్రతి ఏటా 'భూదాన్ డే'ను సామాజికహితంగా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరారు. ప్రసాద్, తెలంగాణ, ఎపి సర్వోదయ మండల్ అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్, ఎన్.రాంబాబు నాయుడు మాట్లాడుతూ నిరుపేదలకు భూమి పంపిణీ చేయాలనే లక్ష్యంతో ఆచార్య వినోబా భావే 1951 ఏప్రిల్ 18న భూదాన్ జైత్రయాత్రకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 1965 'భూదాన్ – గ్రామదాన్' చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత మహేశ్, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, సర్వోదయ మండల్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ ఫరీద్, దక్షిణ తెలంగాణ ఇన్‌చార్జి ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com